ప్రకటనల కోసం
సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002

# జనంసాక్షి

www.janamsakshi.org

శుక్రవారం 31.10.2025 | సంపుటి : 12 సంచిక : 100 | పేజీలు : 12 వెల : రూ. 4/-

RNI NO.TELTEL / 2013 /50370




హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్

# అన్నదాతలు అధైర్యపడకండి నేనున్నా

## సీఎం రేవంత్ భరోసా

- యుద్ధప్రాతిపదికన సహాయక చర్యలు చేపట్టండి
- తడిచిన ధాన్యం కొనుగోలు చేయండి
- 80 లక్షల మెట్రిక్ టన్నుల కొనుగోలు లక్ష్యం
- కల్లాల్లో ధాన్యాన్ని గోదాములకు తరలించాలి
- అవసరమైతే ఫంక్షన్ హాళ్లలో నిల్వ చేయండి
- అధికారులు క్షేత్రస్తాయిలో పర్యటించాలి
- వరద ప్రాంతాల్లో నష్టాలను అంచనా వేయాలి
- వివరాలు ఎప్పటికప్పుడు మంత్రులకు చేరవేయాలి
- విద్యుత్ అంతరాయం కలగకుండా చర్యలు
- కలెక్టర్లతో వీడియోకాన్ఫరెన్స్‌లో సీఎం ఆదేశాలు



సచివాలయంలో తన ఛాంబర్ నుంచి వరద నష్టం, నివారణ చర్యలపై కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.చిత్రంతో మంత్రి తుమ్మల, సీఎస్ రామకృష్ణారావు,డీజీపీ శివధర్ రెడ్డి, వేం నరేందర్ రెడ్డి, పలు శాఖల అధికారులు

**హైదరాబాద్‌బ్యూరో(జనంసాక్షి):**రాష్ట్రంలో 80 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. అందుకు తగినట్లుగా పౌర సరఫరాల విభాగం కట్టుదిట్టంగా చర్యలు చేపట్టాలని చెప్పారు. వర్షంతో చాలా చోట్ల ధాన్యం తడిసిపోయిందని, ఐకేపీ కేంద్రాల్లో ధాన్యం కొట్టుకుపోవటం రైతులు నష్టపోవటం ఆందోళన కలిగించిందని అన్నారు. కల్లాల్లో, ఐకేపీ కేంద్రాల్లో ఉన్న ధాన్యాన్ని వెంటనే దగ్గర్లోని గోదాములు, మిల్లులకు తరలించేందుకు ఏర్పాట్లు చేయాలని కలెక్టర్లను ఆదేశించారు. మిల్లుల, గోదాములు అందుబాటులో లేని చోట దగ్గరలో ఉన్న ఫంక్షన్ హాళ్లలో నిల్వ చేయాలని కలెక్టర్లను ఆదేశించారు.తుఫాను ప్రభావిత జిల్లాల కలెక్టర్లు, మంత్రులు, ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఐకేపీ కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లపై నిరంతరం పర్యవేక్షణ ఉండాలని సూచించారు. ప్రతి కొనుగోలు కేంద్రానికో ఇన్చార్జీ అధికారిని నియమించాలని, ఇప్పుడున్న ఇన్చార్జీలు నిర్లక్ష్యంగా ఉంటే వెంటనే వేరే వాళ్లను నియమించాలని కలెక్టర్లకు సూచించారు. ప్రతీ ఐకేపీ సెంటర్ నుంచి ఏరోజుకారోజు సాయంత్రం రిపోర్టు తెప్పించుకోవాలని, రిపోర్ట్ ఇవ్వకుండా నిర్లక్ష్యం వహించే అధికారులపై తక్షణం చర్యలు తీసుకోవాలని కలెక్టర్లను అప్రమత్తం చేశారు. అధికారులు, ఉద్యోగుల సెలవులు రద్దు చేసి అందరూ క్షేత్రస్థాయిలో పర్యటించేలా, ప్రజలకు అందుబాటులో ఉండేలా చూడాలని కలెక్టర్లను మిగతా 2లో..

## నేడు వరంగల్, హుస్నాబాద్‌లలో ముఖ్యమంత్రి ఏరియల్ సర్వే..

## వరద ప్రాంతాల్లో పోలీసు సేవలను వినియోగించాలి

- హైదరాబాద్ నుంచి హైడ్రా టీమ్‌లను పంపించండి
- తక్షణ సహాయక చర్యలకు పడవలను పంపించాలి
- వరదల్లో చిక్కుకున్న వారికి డ్రోన్ల సాయంతో ఆహారం
- సీఎస్, డీజీపీలను ఆదేశించిన సీఎం రేవంత్ రెడ్డి

2లో..

## ఎకరాకు రూ.10 వేలు

- తుపాను ప్రభావంతో నష్టపోయిన ప్రతి రైతుకు పరిహారం అందిస్తాం
- 4.5 లక్షల ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లు ప్రాథమికంగా అంచనా : మంత్రి తుమ్మల

## నష్టపోయిన రైతులను కేంద్రం ఆదుకోవాలి

వరద ప్రాంతాల్లో మంత్రి పొన్నం పర్యటన

## మొంథా తుఫాన్‌తో రోడ్లు ధ్వంసం

334 ప్రాంతాల్లో 230 కి.మీ. మేర దెబ్బతిన్నాయి : మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి


## ఏపీలో 'మొంథా' నష్టం రూ.5,265 కోట్లు

అధికారులతో సమీక్షించిన సీఎం చంద్రబాబు

2లో..

## సుప్రీంకోర్టు నూతన సీజేఐగా జస్టిస్ సూర్యకాంత్

నియామక ఉత్తర్వులు వెలువరించిన కేంద్ర న్యాయశాఖ



**ఢిల్లీ(జనంసాక్షి):** సుప్రీంకోర్టు 53వ ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ సూర్య కాంత్ నియమితులయ్యారు. కేంద్ర న్యాయశాఖ.. నియామక ఉత్తర్వులు వెలువరించింది. నవంబర్ 24న ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ సూర్యకాంత్ బాధ్యతలను స్వీకరించనున్నారు. మిగతా 2లో..

## నేడు మంత్రిగా అజహర్ ప్రమాణం

### రాజ్‌భవన్ దర్బార్ హాలులో ఏర్పాట్లు



**హైదరాబాద్(జనంసాక్షి):** తెలంగాణ మంత్రివర్గ విస్తరణకు ముహూర్తం ఖరారైంది. శుక్రవారం మధ్యాహ్నం 12:15 గంటలకు కొత్త మంత్రిగా అజారుద్దీన్ ప్రమాణస్వీకారం చేయనున్నారు. రాజ్‌భవన్‌లో కేబినెట్ మంత్రిగా కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ క్రికెటర్ అజారుద్దీన్ ఒక్కరే ప్రమాణ స్వీకారం చేస్తారు. ఈ క్రమంలో ప్రభుత్వం ప్రమాణ స్వీకారానికి ఏర్పాట్లను ముమ్మరం చేసింది. ప్రమాణస్వీకారోత్సవం జరిగే రాజ్‌భవన్ దర్బార్ హాల్‌ను ప్రోటోకాల్ అధికారులు పరిశీలించారు. మంత్రి ప్రమాణ స్వీకారానికి సీటింగ్ తదితర ఏర్పాట్లను అధికారులు పరిశీలించారు. 22 నెలల క్రితం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు 11 మంది మంత్రులుగా ప్రమాణస్వీకారం చేశారు. ఆ తరువాత మరో ముగ్గురికి మంత్రులుగా అవకాశం ఇవ్వడంతో కేబినెట్‌లో మంత్రుల సంఖ్య 15కు చేరింది. ఇక మిగిలిన మూడు మంత్రి పదువులపై కాంగ్రెస్ అధిష్టానం కసరత్తు చేసింది. ఈ మూడు మంత్రి పదవుల్లో మైనారిటీ వర్గానికి చెందిన వ్యక్తికి అవకాశం ఇవ్వాలని హైకమాండ్ భావించింది. ఈ క్రమంలో మాజీ క్రికెటర్ అజారుద్దీన్ పేరును అధిష్టానం ఖరారు చేసింది. అజారుద్దీన్‌కు హోం, మైనారిటీ శాఖ ఇచ్చే అవకాశం ఉన్నట్లు సమాచారం. ఇక మంత్రివర్గంలో మరో రెండు ఖాళీలకు అధిష్టానం ఎప్పుడు గ్రీన్ సిగ్నల్ ఇస్తుందో చూడాలి మరి. కాగా.. మైనారిటీని మంత్రివర్గంలోకి తీసుకోవాలని ఎప్పటి నుంచో ఆలోచన ఉందని.. అందులో భాగంగానే అజారుద్దీన్ కేబినెట్‌లోకి తీసుకుంటున్నట్లు టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ చెప్పిన విషయం తెలిసిందే. అయితే తనకు హామీ ఇచ్చి పక్కన పెట్టారని రాజగోపాల్ రెడ్డి పదేపదే విమర్శలు చేస్తున్నా ఆయనకు మాత్రం అవకాశం దక్కకపోవడం గమనార్హం.

## దేశానికి కీర్తి, ఘనత తెచ్చిన క్రీడాకారుడిపై ఎందుకింత అక్కసు?

- అజాహరుద్దీన్‌కు మంత్రి పదవి దక్కుఉండా అడ్డుకోవడం దురదృష్టకరం
- బీజేపీ తీరుపై మండిపడ్డ కాంగ్రెస్
- కమల నాయకుల విమర్శలను కొట్టిపారేసిన పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్

2లో..

## జూబ్లీహిల్స్ ఓటర్లను ప్రభావితం చేస్తున్నారు

- మంత్రివర్గ విస్తరణను వెంటనే ఆపాలి
- ఎన్నికల అధికారికి బీజేపీ నేతల ఫిర్యాదు
- జూబ్లీహిల్స్ కోసమే అజార్‌కు మంత్రి పదవి: కేటీఆర్

## అమ్మాయిలు అదరహో..



### మహిళల వన్డే ప్రపంచకప్ ఫైనల్‌కు దూసుకెళ్లిన భారత్

మహిళల వన్డే ప్రపంచకప్ లో భారత్ ఫైనల్‌కు దూసుకెళ్లింది. సెమీస్‌లో కంగారూల జట్టుపై టీమ్‌ఇండియా 5 వికెట్ల తేడాతో విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన ఆసీస్ 49.5 ఓవర్లలో 338 పరుగులకు ఆలౌట్ అయింది. ఈ లక్ష్యాన్ని భారత్ 48.3 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి ఛేదించింది. జెమీమా రోడ్రిగ్స్ (127 నాటౌట్) సెంచరీతో మెరిసింది. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ (89)శతకం చేసే అవకాశాన్ని చేజార్చుకుంది. ఆసీస్ బౌలర్లలో అన్నాబెల్ సదర్లాండ్, కిమ్ గార్త్ రెండేసి వికెట్లు పడగొట్టారు. నవంబర్ 2న ఫైనల్‌లో దక్షిణాఫ్రికాతో భారత్ తలపడనుంది. ఈ రెండు జట్లు ఇప్పటివరకు విశ్వవిజేతగా నిలవకపోవడంతో ఈ సారి కొత్త ఛాంపియన్‌ను చూడబోతున్నాం.

## జూబ్లిహిల్స్‌లో గెలుపుపై కాంగ్రెస్ ధీమా

### పూర్తి అంచనా, ఆత్మవిశ్వాసంతో అభ్యర్థి, పార్టీ నేతలు

- పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో నిర్లక్ష్యానికి గురైన పేదలు
- 20 నెలల కాంగ్రెస్ పాలనలో కోటి 15 లక్షల తెల్ల రేషన్‌కార్డులు
- ఒక్క జుబ్లిహిల్స్‌లోనే 40 వేల తెల్ల రేషన్ కార్డుల మంజూరు
- మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి



**హైదరాబాద్(జనంసాక్షి):**జూబ్లిహిల్స్ శాసనసభ నియోజకవర్గ ఉప ఎన్నికల్లో అంతిమ విజయం కాంగ్రెస్ పార్టీదే నని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు.అన్నీ సర్వేలు హస్తం వైపే వెలువడడమే ఇందుకు తార్కాణమని ఆయన పేర్కొన్నారు.ఇక్కడి నుండి బరిలో ఉన్న కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ గెలుపు నల్లేరు మీద నడకే నని ఆయన తేల్చిచెప్పారు.జూబ్లీహిల్స్ శాసన సభ నియోజకవర్గ ఉప ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం ఉదయం నియోజకవర్గ పరిధిలోని యూసుఫ్ గూడ డివిజన్ కృష్ణానగర్ లో సహచర మంత్రి పొన్నం ప్రభాకర్ తో కలసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో షాద్ నగర్ శాసనసభ్యులు ఇదూలపల్లి శంకరయ్య,కాంగ్రెస్ పార్టీ నేత అజహారోద్దిన్,స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనా రెడ్డి,ఎస్.టి కార్పొరేషన్ చైర్మన్ బెల్లయ్య నాయక్,ఏ.ఐ. సి.సి కార్యదర్శి సంపత్, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సునీత ముదిరాజ్ ,బొల్లు కిషన్ తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ పదేళ్ల బి.ఆర్.ఎస్ పాలనలో జూబ్లీహిల్స్ నియోజకవర్గ పరిధిలోని నిరుపేదలు నిర్లక్ష్యానికి గురయ్యారని విమర్శించారు.బిఆర్ఎస్ పార్టీ మిగతా 2లో..

## సీబీఎస్ఈ టెన్త్, 12 పరీక్షలు ఫిబ్రవరి 17 నుంచి

ఫైనల్ డేట్ షీట్స్ విడుదల

9లో..

## చైనాపై సుంకాలు 10% తగ్గింపు

### అధికారికంగా ప్రకటించిన ట్రంప్

- దక్షిణ కొరియా బుసాన్‌లో చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్‌తో భేటీ
- తమది గొప్ప సంబంధం.. మళ్లీ కలవడం ఆనందంగా ఉందని వ్యాఖ్య



**బీజింగ్(జనంసాక్షి):** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మెత్తబడ్డారు. చైనాపై సుంకాలను 10 శాతం తగ్గిస్తున్నట్లు అధికారికంగా ప్రకటించారు. గురువారం దక్షిణ కొరియా బుసాన్‌లో చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్‌తో భేటీ అనంతరం ఈ ప్రకటన వెలువడింది.జిన్‌పింగ్‌తో భేటీ అద్భుతంగా జరిగిందని ట్రంప్ వ్యాఖ్యానించారు. మిగతా 2లో..

## మున్నేరు ప్రాంతం కన్నీరు

- ఖమ్మం నగరాన్ని చుట్టుముట్టిన వరద
- పెనుగంచిప్రోలు వద్ద నది ఉగ్రరూపం
- జలదిగ్బంధంలో వరంగల్
- చెరువులను తలపిస్తున్న కాలనీలు



మున్నేరు నది ఉధృతికి జలమయమైన ఖమ్మంలోని పలు కాలనీలు

**ఖమ్మం(జనంసాక్షి):**మొంథా తుపాను ప్రభావంతో కురిసిన భారీవర్షాలకు ఖమ్మంలోని 'మున్నేరు' పరివాహకంలోని కాలనీలను వరద చుట్టుముట్టింది. మోతీనగర్, బొక్కలగడ్డ కాలనీల్లోకి వరద చేరింది. మోతీనగర్‌లోని 35, బొక్కలగడ్డలో 57 కుటుంబాలను పునరావాస కేంద్రాలకు తరలించారు. మున్నేరుకు భారీగా వరద ప్రవాహం కొనసాగుతోంది. ప్రస్తుతం నీటిమట్టం 24.7 అడుగులకు చేరింది. ఎగువన భారీ వర్షాలతో వరద ప్రవాహం అంతకంతకూ పెరుగుతోంది. మున్నేరు ఉద్ధృతంగా ప్రవహిస్తుండటంతో వరద నీరు ఖమ్మం-బోనకల్ ప్రధాన రహదారిపై చేరింది. ఖమ్మం నగరం సమీపంలోని దంసలాపురం వద్ద ఆర్అండ్‌బీ రహదారిపై మూడు అడుగుల మేర వచ్చింది. దీంతో పోలీసులు ఆ మార్గంలో రాకపోకలను నిలిపివేశారు. వాహనాలు వెళ్లకుండా బారికేడ్లు ఏర్పాటు చేశారు. చింతకాని మండలం మిగతా 2లో..

వరంగల్ కాలనీల్లో చేరిన వరద నీరు





## ముంబైలో 20 మంది పిల్లల కిడ్నాప్ కలకలం

### పోలీస్ కాల్పుల్లో నిందితుడు రోహిత్ మృతి

**ముంబై(జనంసాక్షి):** 20 మంది పిల్లల్ని కిడ్నాప్ చేసిన నిందితుణ్ని పోలీసులు కాల్చి చంపారు. గురువారం ముంబైలోని పోవై ప్రాంతంలో 20 మంది పిల్లలను బంధించిన నిందితుడు రోహిత్ ఆర్యపై పోలీసులు కాల్పులు జరిపారు.పోలీసులు జరిపిన కాల్పుల్లో రోహిత్ ఆర్య చికిత్స పొందుతూ మరణించాడు.తాను నిర్మించనున్న సినిమా,డైలీ సీరియల్స్,వెబ్ సిరీస్‌లో బాల నటీనటులు కావాలంటూ కిడ్నాపర్ రోహిత్ ఆర్య మిగతా 2లో..

## అమెరికాలో భారతీయ ఉద్యోగులపై మరో పిడుగు

- వర్క్ పర్మిట్ల ఆటోమేటిక్ రెన్యువల్స్ రద్దు..
- వేల మంది ఉద్యోగులపై తీవ్ర ప్రభావం



2లో..

జనంసాక్షి
www.janamsakshi.org
శుక్రవారం
31.10.2025

## సుప్రీంకోర్టు నూతన సీజేఐగా జస్టిస్ సూర్యకాంత్

ఫిబ్రవరి 9, 2027 వరకు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా ఆయన కొనసాగనున్నారు. కాగా, నవంబర్ 23వ తేదీన ప్రస్తుత ప్రధాన న్యాయ మూర్తి జస్టిస్ భూషణ్ రామకృష్ణ గవాయ్ పదవీ విరమణ చేయనున్నారు .జస్టిస్ సూర్యకాంత్ హరియాణాలోని హిస్సార్ జిల్లాలో ఓ మధ్య తరగతి కుటుంబంలో 1962 ఫిబ్రవరి 10న జన్మించారు. 2019 మే 24న సుప్రీంకోర్టులో జడ్జిగా పదోన్నతి పొందారు. ఆయన దాదాపు 15 నెలలపాటు సేవలందించి 2027 ఫిబ్రవరి 9వ తేదీన రిటైర్ అవుతారు. సూర్యకాంత్.. హర్యానాలోని కురుక్షేత్ర విశ్వవిద్యాలయం నుంచి ఎల్‌ఎల్‌బీ పూర్తి చేశారు.1984లో న్యాయవాదిగా హర్యానా,పంజాబ్ హైకోర్టులో ప్రాక్టీస్ ప్రారంభించారు. 2004లో హైకోర్టు న్యాయమూర్తిగా.. 2019లో సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా పదవీ బాధ్యతలు చేపట్టారు. అంతేకాదు.. ఎన్ఎఎల్ఎస్ఎ కార్యనిర్వాహక ఛైర్మన్‌గా ఇటీవల ఆయన నియమితులయ్యారు.

## దేశానికి కీర్తి తెచ్చిన ఘనత తెచ్చిన క్రీడాకారుడిపై ఎందుకింత అక్కసు?

**హైదరాబాద్(జనంసాక్షి):**మంత్రివర్గ విస్తరణకు అనుమతి ఇవ్వొద్దని విజ్ఞప్తి చేస్తూ తెలంగాణ భాజపా నేతలు చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ (సీఈవో)ను ఆశ్రయించడంపై కాంగ్రెస్ నేతలు ఖండించారు. ఇందులో అజారుద్దీన్‌కు కేబినెట్‌లో స్థానం కల్పించవద్దనే కుట్ర కనిపిస్తోందని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆరోపించారు. అజారుద్దీన్ హైదరాబాద్ బిడ్డ అని, మన కీర్తిపతాకలను రెపరెపలాడించిన వ్యక్తి అని పేర్కొన్నారు. అజారుద్దీన్‌ను కేబినెట్‌లోకి తీసుకోవద్దని లేఖలు రాయడం దేశానికి పేరు ప్రఖ్యాతులు తీసుకొచ్చిన క్రీడాకారుడిని అవమానించడమేనని అన్నారు. దేశ ఔన్నత్యాన్ని ప్రపంచపటంలో నిలబెట్టారు. ఆయన్ను కేబినెట్‌లోకి తీసుకుంటే ఎవరైనా స్వాగతించాలి. కానీ.. మంత్రివర్గంలోకి తీసుకోవద్దని లేఖ రాయడం దురదృష్టకరం అంటూ విమర్శించారు. భారత రాష్ట్ర సమితిని గెలిపించడంలో భాగంగానే భాజపా నేతలు లేఖ రాశారు. పార్లమెంటు ఎన్నికల్లో భాజపాకు భారాస సహకరించింది. జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో భాజపా ఎలాగూ గెలవదు కాబట్టి బలహీన వ్యక్తిని నిలబెట్టింది. అజారుద్దీన్‌ను కేబినెట్‌లోకి తీసుకోకుండా గవర్నర్‌పైనా ఒత్తిడి తెస్తున్నట్లు తెలుస్తోందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మీడియాతో అన్నారు. ఇంతకన్నా దారుణం ఏముంటుందన్నారు. మైనార్టీలకు బిజెపి వ్యతిరేకమని వేరుగా చెప్పాల్సిన అవసరం లేదన్నారు.నాడు భారత క్రికెట్ జట్టుకు అజారుద్దీన్ సేవలందించారని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ గుర్తుచేశారు. అజారుద్దీన్‌కు ఎమ్మెల్సీ ఇచ్చి కేబినెట్‌లోకి తీసుకోవాలని కాంగ్రెస్ నిర్ణయించింది. మైనార్టీకి అవకాశమిస్తే అడ్డుతగిలేలా విషం వెళ్లగక్కుతున్నారు. ఈసీ వద్ద ఆపాలని భాజపా నేతలు ప్రయత్నిస్తున్నారు. గొప్ప క్రీడాకారుడికి మంత్రివర్గంలో అవకాశం వస్తుంటే అనైతికంగా అడ్డుకునేందుకు యత్నిస్తున్నారు. మైనార్టీ ఎమ్మెల్యేలు లేకపోవడంతో కేబినెట్‌లో అవకాశం ఆలస్యమైంది. అజారుద్దీన్‌ను మంత్రివర్గంలోకి తీసుకోవడం ద్వారా మైనార్టీలకు సంక్షేమానికి పాటుపడుతున్నాం. భాజపా ద్వంద్వ వైఖరిని ప్రజలు తెలుసుకోవాలి. ఎన్నికల వేళ అజారుద్దీన్‌ను కేబినెట్‌లోకి ఎలా తీసుకుంటారని ప్రశ్నిస్తున్నారు. రాజస్థాన్‌లో ఉపఎన్నిక వేళ భాజపా అభ్యర్థిని మంత్రిని చేశారు. భాజపాకు రాజస్థాన్‌లో ఒక నీతి.. తెలంగాణలో మరో నీతి ఉంటుందా అని పీసీసీ చీఫ్ ప్రశ్నించారు. అజారుద్దీన్‌ను కేబినెట్‌లోకి తీసుకుంటే బీజెపికి వచ్చిన నష్టం ఏంటని మంత్రి పొన్నం అన్నారు. బీజెపి, బీఆర్ఎస్‌ల ద్వంద్వ నీతి అని ఎద్దేవాచేశారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక వేళ అజారుద్దీన్ కు మంత్రి పదవి ఇవ్వడంపై బీజేపీ నేతలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే పాయల్ శంకర్, మర్రి శశిధర్ రెడ్డితో పలువురు బీజేపీ ప్రతినిధులు ఎన్నికల అధికారులను కలిసి ఫిర్యాదు చేశారు. జూబ్లీహిల్స్ ఎన్నికల వేళ అజారుద్దీన్ కు మంత్రి పదవి ఇవ్వడం ఎన్నికల కోడ్ ఉల్లంఘన కిందకే వస్తుందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి కోడ్ ఉల్లంఘించారని ఆరోపించారు. ఇలా మంత్రి పదవి ఇవ్వడం వల్ల ఒక వర్గం ఓట్లు ప్రభావితం అవుతాయన్నారు ఎమ్మెల్యే పాయల్ శంకర్. 'మంత్రివర్గ విస్తరణపై ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశాం, చర్యలు తీసుకోవాలని కోరాం. ఒక వర్గానికి మంత్రి పదవి ఇచ్చి రాజకీయంగా లబ్ధి పొందాలని చూస్తున్నారు అంటూ ఫైర్ అయ్యారు పాయల్ శంకర్.

## జూబ్లీహిల్స్ ఓటర్లను ప్రభావితం చేసే చర్య

**హైదరాబాద్(జనంసాక్షి):**జూబ్లీహిల్స్ ఓటర్లను ప్రభావితం చేసేలా చేస్తున్న మంత్రివర్గ విస్తరణను ఆపాలని బిజెపి ఎన్నికల సంఘాన్ని కోరింది. ఇది కేవలం ఓ వర్గం వారిని మచ్చిక చేసుకునే చర్య తప్ప మరోటి కాదని పేర్కొంది. ఓ వర్గం ఓట్ల కోసమే ఇప్పుడు మంత్రివర్గ విస్తరణ చేపట్టారని విమర్శించారు. అజారుద్దీన్ గతంలో జూబ్లీహిల్స్‌లో పోటీ చేశారని భాజపా నేతలు అభ్యంతరం వ్యక్తం చేశారు. మంత్రివర్గ విస్తరణను ఆపాలని సీఈవోను కోరారు. తెలంగాణ భాజపా నేతలు రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి సుదర్శన్‌రెడ్డిని కలిశారు. మంత్రివర్గ విస్తరణకు అనుమతి ఇవ్వొద్దని ఫిర్యాదు చేశారు. ప్రభుత్వం ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తోందని అందులో పేర్కొన్నారు. మంత్రివర్గంలోకి అజారుద్దీన్‌ను తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇటీవల నిర్ణయించారు. ఈ నెల 31న విస్తరణకు అవకాశం ఉందని, అజారుద్దీన్‌కు ఏఐసీసీ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చిందని సంబంధిత వర్గాల ద్వారా తెలిసింది. కొందరు మంత్రుల శాఖల్లో మార్పులు జరగవచ్చని కూడా తెలుస్తోంది. ఈక్రమంలో సీఈవోను భాజపా నేతలు కలిసి ఫిర్యాదు చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక వేళ అజారుద్దీన్ కు మంత్రి పదవి ఇవ్వడంపై బీజేపీ నేతలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే పాయల్ శంకర్, మర్రి శశిధర్ రెడ్డితో పలువురు బీజేపీ ప్రతినిధులు ఎన్నికల అధికారులను కలిసి ఫిర్యాదు చేశారు. జూబ్లీహిల్స్ ఎన్నికల వేళ అజారుద్దీన్ కు మంత్రి పదవి ఇవ్వడం ఎన్నికల కోడ్ ఉల్లంఘన కిందకే వస్తుందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి కోడ్ ఉల్లంఘించారని ఆరోపించారు. ఇలా మంత్రి పదవి ఇవ్వడం వల్ల ఒక వర్గం ఓట్లు ప్రభావితం అవుతాయ న్నారు ఎమ్మెల్యే పాయల్ శంకర్. 'మంత్రివర్గ విస్తరణపై ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశాం, చర్యలు తీసుకోవాలని కోరాం. ఒక వర్గానికి మంత్రి పదవి ఇచ్చి రాజకీయంగా లబ్ది పొందాలని చూస్తున్నారని అంటూ పాయల్ శంకర్ అన్నారు. ఒకవేళ అజారుద్దీన్ కు మంత్రి పదవి ఇవ్వాలి అనుకుంటే ఎన్నిక తర్వాత ఇవ్వాలి. కానీ ఉన్నఫళంగా మంత్రివర్గ విస్తరణ చేయడం, అజారుద్దీన్ కు మంత్రి పదవి ఇవ్వడం వెనక ఆంతర్యం ఏంటని ప్రశ్నించారు. ఈ అంశాన్ని తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్టు తెలిపారు. మర్రి శషిధర్ రెడ్డి మాట్లాడుతూ.. ఎన్నికల లబ్ది కోసం ఒక వర్గం ఓట్లు కోసం అజారుద్దీన్ కు మంత్రి పదవి ఇస్తున్నారు. ఆ వర్గంపై ప్రేమ ఉంటే గతంలో ఎందుకు ఇవ్వలేదు. మంత్రి పదవి ఆశ చూపి ఆ వర్గాన్ని మోసం చేయాలని కాంగ్రెస్ భావిస్తోంది. కోడ్ ఉల్లంఘన జరిగితే చర్యలు తీసుకోవాలంటూ కోరాం. సినీ కార్మికులను ప్రభావితం చేసేలా ప్రకటనలు చేయడంకోడ్ ఉల్లంఘనే అవుతుందన్నారు.

జూబ్లీహిల్స్ కోసమే అజార్‌కు మంత్రి పదవి: కేటీఆర్

జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక కోసమే మాజీ క్రికెటర్ అజారుద్దీన్‌ను మంత్రివర్గంలోకి తీసుకుంటున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. ప్రభుత్వంలోకి వచ్చిన రెండేళ్ల తర్వాత కాంగ్రెస్ పార్టీ ఎట్టకేలకు క్షేత్రస్థాయి వాస్తవాలను గ్రహిస్తున్నట్లు కనిపిస్తున్నదని చెప్పారు. అందుకే పూర్తిగా దిగజారిన పార్టీ పరువును కాపాడుకోవడానికి అడ్డగోలు ప్రయత్నాలు చేస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. జూబ్లీహిల్స్ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ ఆపద మొక్కులు మొక్కుతున్నదని ధ్వజమెత్తారు. జూబ్లీహిల్స్ ఎన్నికల కోసం సినీ కార్మికులకు అడ్డగోలు వాగ్దానాలు చేయడం, మాజీ క్రికెటర్ అజారుద్దీన్‌ను కేబినెట్‌లోకి తీసుకోవడం, మంత్రులు గతంలో ఎన్నడూ లేని విధంగా హైదరాబాద్ వీధుల్లో హడావుడిగా తిరగడం వంటివి ఆ పార్టీ తీవ్ర ఒత్తిడిలో ఉందనడానికి నిదర్శనమని చెప్పారు. జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ డిపాజిట్ కోల్పోతేనే అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన ఆరు గ్యారంటీలు, 420 హామీలను అమలు చేస్తుందన్నారు. అందుకే కాంగ్రెస్, దాని నాయకత్వానికి గుణపాఠం చెప్పడానికి జూబ్లీహిల్స్ ఉపఎన్నిక సరైన వేదిక అని చెప్పారు. ఈమేరకు కేటీఆర్ ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు.

# అన్నదాతలు అధైర్యపడకండి.. నేనున్నా..

ఆదేశించారు. వర్షాలకు ధాన్యం తడవకుండా తగినన్ని టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలి. విధానపరమైన నిర్ణయాలు అవసరమైతే వెంటనే సివిల్ సప్లయిస్ కమిషనర్, సీఎస్ దృష్టికి తీసుకురావాలని చెప్పారు. వరద తగ్గిన తర్వాత వ్యవసాయ, రెవిన్యూ విభాగం అధికారులు సంయుక్తంగా సర్వేలు చేసి నష్టపు అంచనాలు తయారు చేయాలని నివేదించారు. ఎంతటి విపత్తు వచ్చినా ప్రజలను ఆదుకునేందుకు జిల్లాల్లో అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని, అందుకు అవసరమైన అన్ని ప్రణాళికలను సిద్ధం చేసుకోవాలని సీఎం సూచించారు. ఇప్పటికే రాష్ట్రంలో 16 జిల్లాలపై తుఫాను ప్రభావం ఉంటుందని వాతావరణ శాఖ హెచ్చరించిందని సీఎం అధికారులను అప్రమత్తం చేశారు. వర్షాలతో పాటు ఈదురు గాలులతో విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందని, వెంటనే విద్యుత్తు పునరుద్ధరించేలా విద్యుత్ శాఖ అప్రమత్తంగా ఉండాలని అన్నారు. వర్షాలతో ఖమ్మం జిల్లాలో ఒక డీసీఎం వ్యాన్, డ్రైవర్ వాగులో కొట్టుకుపోవటం దురదృష్టకరమని సీఎం అన్నారు. అన్ని రోడ్లు, రహదారులపై ఉన్న బ్రిడ్జిలు, లో లెవల్ కాజ్ వేలు, కల్వర్టుల వద్ద అప్రమత్తంగా ఉంటే ఇలాంటి ఘటనలను నివారించవచ్చని సీఎం అన్నారు. రోడ్లు, రహదారులపైకి వరద నీళ్లు వచ్చే ప్రాంతాల్లో ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. వాహనాలు అటువైపు వెళ్లకుండా పోలీసులు నిషేధాజ్ఞలు అమలు చేయాలన్నారు. స్థానిక సీఐ, రెవిన్యూ అధికారులు వాహనాలు అటువైపు వెళ్లకుండా రెండు వైపులా బారికేడ్లు పెట్టాలన్నారు. దెబ్బతిన్న రోడ్ల వద్ద ట్రాఫిక్ ను డైవర్ట్ చేయాలని, కుంభ వృష్టి కురిసే సమయంలో ప్రజలు అవసరమైతే తప్ప రోడ్లపైకి రాకుండా అవగాహన కల్పించాలని అన్నారు. వైద్యారోగ్య శాఖ అప్రమత్తంగా ఉండాలని, అత్యవసర వైద్య సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో ప్రధానంగా వరి, పత్తి పంటకు నష్టం వాటిల్లిందని మంత్రులు, కలెక్టర్లు ముఖ్యమంత్రికి వివరించారు. ఉమ్మడి వరంగల్, నల్గొండ జిల్లాతో పాటు, హుస్నాబాద్ నియోజకవర్గంలో వరద నష్టం ఎక్కువగా ఉందని అంచనాకు వచ్చారు. అన్ని చోట్ల వరి కోతలు మొదలయ్యాయని, అనుకోని ఉపద్రవం ఏది వచ్చినా రైతులకు ఆవేదన మిగులుస్తుందని సీఎం అన్నారు. తుఫాన్ ప్రభావంతో వర్షాలు కురుస్తున్న జిల్లాల్లో యుద్ధ ప్రాతిపదికన సహాయక చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అన్ని జిల్లాల కలెక్టర్లు, ఉన్నతాధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఎక్కడ కూడా ప్రాణనష్టం జరగకుండా చూడాలని, పశువులకు ఆపద రాకుండా తగిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. వరద ముప్పు ఉన్న ప్రాంతాలు, ముంపు గ్రామాలు, కాలనీల్లో ఉంటున్న వారిని వెంటనే సురక్షిత ప్రాంతాలకు తరలించాలని, అవసరమైన చోట పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసి తగిన సహాయం అందించాలని ఆదేశించారు. ఇది వరి కోతల కాలం..కానీ అనుకోని ఉపద్రవం రైతులకు ఆవేదన మిగులుస్తోందని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. అధికారులు అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. అధికారుల అందరి సెలవులు రద్దు చేసి క్షేత్రస్థాయిలో పర్యటించేలా చూడాలని కలెక్టర్లకు ఆదేశించారు. ఈదురు గాలులతో విద్యుత్ అంతరాయం కలగకుండా విద్యుత్ శాఖ అప్రమత్తంగా ఉండాలన్నారు. మొంథా తుపాను ప్రభావిత జిల్లాల కలెక్టర్లు, అధికారులతో తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వివిధ జిల్లాల్లో కురిసిన వర్షాలు, జరిగిన నష్టాన్ని జిల్లా కలెక్టర్లు సీఎంకు వివరించారు. దెబ్బతిన్న పంటలు, రహదారులకు సంబంధించిన ప్రాథమిక వివరాలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు.కేంద్ర ప్రభుత్వం నుంచి పొందే వరదసాయం అంశాలపై అధికారులతో సీఎం చర్చించారు. శుక్రవారం వరంగల్, హుస్నాబాద్ ప్రాంతాల్లో ఏరియల్ సర్వే నిర్వహిస్తానని సీఎం రేవంత్ తెలిపారు.

## వరద ప్రాంతాల్లో పోలీసుల సేవలను వినియోగించాలి

**హైదరాబాద్(జనంసాక్షి):** వరంగల్‌లో తుఫాన్ ప్రభావం ఎక్కువగా ఉన్న నేపథ్యంలో పోలీసుల సేవలను వినియోగించుకోవాలని, అవసరమైతే హైదరాబాద్ నుంచి హైడ్రా టీమ్‌లను, అవసరమైన సామగ్రిని పంపించాలని సీఎస్, డీజీపీలను సిఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. వరంగల్లో తక్షణ సహాయక చర్యలకు అవసరమైనన్ని పడవలను అక్కడికి పంపించాలని, వివిధ జిల్లాల్లో అందుబాటులో ఉన్న ఎస్డీఆర్ఎఫ్ సిబ్బందిని తక్షణమే తరలించాలని సీఎస్, డీజీపీకి ఆదేశించారు. హైదరాబాద్ నుంచి హైడ్రా సిబ్బందిని, హైడ్రా వద్ద ఉన్న వరద సహాయక సామాగ్రిని కూడా అత్యవసరమైన చోట వినియోగించుకునే చర్యలు చేపట్టాలని సీఎం ఆదేశించారు. వరంగల్లో వరద ప్రాంతాల్లో చిక్కుకున్న వారిని వెంటనే సురక్షిత ప్రాంతానికి తరలించాలని, ఎక్కడైనా వరదలో ఇండ్ల కప్పులు, బంగ్లాలపై చిక్కుకున్న కుటుంబాలకు డ్రోన్ల ద్వారా తాగునీటితో పాటు, ఫుడ్ పాకెట్లు సరఫరా చేయాలని సూచించారు. వరంగల్లో వరద బాధితులకు అందించే సహాయక చర్యలను ముమ్మరం చేయాలని, 24 గంటలు పరిస్థితిని పర్యవేక్షించేందుకు వీలుగా కలెక్టరేట్లో టోల్ ఫ్రీ హెల్ప్ లైన్ ఏర్పాటు చేయాలని సీఎం సూచించారు.

## 'మొంథా'తుపాను నష్టం రూ.5,265 కోట్లు

**అమరావతి(జనంసాక్షి):** 'మొంథా' తుపాను వల్ల రాష్ట్రానికి రూ.5,265 కోట్ల మేర నష్టం వాటిల్లిందని ప్రాథమికంగా అంచనా వేసినట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. మొంథా తుపాను బీభత్సాన్ని ముందుగానే అంచనా వేశామని, అందుకే నష్టం తగ్గిందన్నారు. వ్యవసాయ రంగానికి రూ.829 కోట్లు, ఆర్‌అండ్‌బీకి రూ.2,079 కోట్ల మేర నష్టం వాటిల్లిందని చెప్పారు. తుపాను వల్ల ఎవరూ ప్రాణాలు కోల్పోలేదన్న ఆయన.. 120 పశువులు మృత్యువాత పడినట్లు పేర్కొన్నారు.

## ఎకరాకు రూ.10 వేలు

**ఖమ్మం(జనంసాక్షి):** తుపాను ప్రభావంతో నష్టపోయిన ప్రతి రైతునూ ఆదుకుంటామని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు భరోసా ఇచ్చారు. పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.10 వేల చొప్పున అందిస్తామన్నారు. 4.5 లక్షల ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లు ప్రాథమికంగా అంచనా వేసినట్లు తెలిపారు. పశుసంపద, ఇళ్లు నష్టపోయినా ఆదుకుంటామని చెప్పారు. 80 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు వెల్లడించారు. తుపాను ప్రభావిత ప్రాంతాల్లో సీఎం రేవంత్‌రెడ్డి ఏరియల్ సర్వే నిర్వహించనున్నట్లు తెలిపారు.

## నష్టపోయిన రైతులను కేంద్రం ఆదుకోవాలి

**సిద్దిపేట(జనంసాక్షి):**

సిద్దిపేట జిల్లా కోహెడలో వరద ప్రభావిత ప్రాంతాల్లో మంత్రి పొన్నం ప్రభాకర్ గురువారం పర్యటించారు. పోరెడ్డిపల్లి గ్రామంలో భారీ వర్షం కారణంగా జరిగిన పంట నష్టాన్ని పరిశీలించారు. వరదలతో దెబ్బతిన్న వరి పంటలను పరిశీలించారు. పంట నష్టంతో ఆవేదన చెందుతున్న రైతులతో మాట్లాడారు. అనంతరం మంత్రి పొన్నం మీడియాతో మాట్లాడుతూ.. హుస్నాబాద్ నియోజకవర్గం మూడు జిల్లాల పరిధిలో ఉందని.. పూర్తిగా జలమయం అయిందని తెలిపారు. రైతాంగం పూర్తిగా నష్టపోయిందన్నారు. వేలాది ఎకరాల్లో ధాన్యం దెబ్బతిన్నదని.. కొట్టుకుపోయిందని అన్నారు. వర్షాలకు రోడ్లు మొత్తం దెబ్బతిన్నాయని చెప్పారు.

## మొంథా తుఫాన్‌తో రోడ్లకు దెబ్బ

**హైదరాబాద్(జనంసాక్షి):**

మొంథా తుఫాను ప్రభావంతో తో ఆర్ అండ్‌బీ రోడ్లు 334 లోకేషన్స్‌లో 230 కి.మీ దెబ్బతిన్నాయని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు. రోడ్లు భవనాలు శాఖ పూర్తి అప్రమత్తంగా ఉందని వెల్లడించారు. తాజాగా తుఫాన్ ఎఫెక్ట్స్‌పై అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన మంత్రి మాట్లాడారు. నిన్న అన్ని శాఖల అధికారులను అప్రమత్తం చేసినట్లు తెలిపారు. ప్రాణనష్టం జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టామన్నారు.. దెబ్బతిన్న, కోతకు గురైన రోడ్లు, బ్రిడ్జిలు, కాజ్‌వేల తాత్కాలిక పునరుద్ధరణకు సుమారు రూ. 7కోట్లు, శాశ్వత పునరుద్ధరణకు రూ. 225 కోట్ల వరకు ఖర్చు అవుతుందని అధికారులు అంచనాలు రూపొందించినట్లు స్పష్టం చేశారు. తుఫాన్ వల్ల అకాల వర్షాలతో ఉమ్మడి నల్గొండ వ్యాప్తంగా రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు.

## గురుకులాలు, కేజీబీవీ, బెస్ట్ అవైలబుల్ పాఠశాలలకు నిధులు విడుదల

**హైదరాబాద్(జనంసాక్షి):**గురుకులాలు, కేజీబీవీ పాఠశాలల, బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ బకాయిలు మొత్తం వెంటనే క్లియర్ చేయాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు ఆదేశించారు. గురువారం సాయంత్రం ప్రజాభవన్ లో ఆర్థిక శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థినీ, విద్యార్థులకు, నిర్వాహకులకు ప్రజాప్రభుత్వం శుభవార్తను అందించింది. ప్రజా భవన్ లో జరిగిన సమీక్ష సమావేశంలో గిరిజన సంక్షేమ నివాస పాఠశాలలు, గిరిజన, జనరల్ గురుకులాలు, కేజీబీవీ పాఠశాలలు విద్యార్థుల భోజన ఛార్జీలు, అద్దె చార్జీలు మరియు కాస్మెటిక్ చార్జీలకు సంబంధించిన పెండింగ్ బిల్లులపై చర్చించారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు రాకూడదని అన్ని రకాల బిల్లులు సుమారు 92 కోట్లు వెనువెంటనే చెల్లించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఉప ముఖ్యమంత్రి ఆదేశించారు. ప్రజా ప్రభుత్వం నిర్దేశించిన మెనూను తూచా తప్పక పాటించాలని, మెనూ పాటిస్తున్నారా లేదా, వసతి సౌకర్యాలు, బోధనలు నాణ్యత వంటి విషయాలను ఎప్పటికప్పుడు తెలుసుకునేందుకు అధికారులు నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం ప్రభుత్వ గురుకులాలు, సంక్షేమ వసతి గృహాలు, కేజీబీవీలను సందర్శించాలని సూచించారు.డిప్యూటీ సీఎం ఆదేశంతో ఆయా పాఠశాలల బిల్లులన్నీ తక్షణం క్లియర్ అయ్యేలా అధికారులు చర్యలు ప్రారంభించారు. ప్రజాప్రభుత్వం విద్యకు పెద్ద పీట వేస్తోంది. ప్రభుత్వ ఆధ్వర్యంలోని విద్యాసంస్థలల్లో చదువుకుంటున్న విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు రాకూడదని ప్రజాప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది అన్నారు. ఈ నేపథ్యంలోనే గత ప్రభుత్వంలో ఉన్న బకాయిలతో పాటు తాజా బకాయిలను ఎప్పటికప్పుడు క్లియర్ చేస్తూ వస్తున్నామని డిప్యూటీ సీఎం తెలిపారు.ప్రభుత్వ హాస్టళ్లలో చదువుకుంటున్న విద్యార్థుల కోసం కాస్మోటిక్ చార్జీలను 200 శాతం, మెస్ ఛార్జీలను 40% పెంచిన విషయం విదితమే. తాజాగా పెంచిన ఛార్జీలతో పాటుగా, పెండింగ్ బిల్లును క్లియర్ చేయడంతో విద్యార్థులకు ప్రయోజనం చేకూరనుంది.

## చైనాపై సుంకాలు 10% తగ్గింపు

జేపీ మోర్గాన్ నివేదిక ప్రకారం.. 2018 దాకా చైనా ఉత్పత్తులపై అమెరికా సుంకాలు 0-5 శాతంగా ఉండేవి. అయితే 2021లో అది 20 శాతానికి చేరింది. ట్రంప్ రెండోసారి అధ్యక్ష పదవి చేపట్టి టారిఫ్ వార్ మొదలుపెట్టాక చైనా విషయంలోనూ పెంపు ఉండొచ్చని అంతా భావించారు. అందుకు తగ్గట్లే అది 57 శాతానికి చేరింది. అయితే ఆ పెంపు 155 శాతం దాకా ఉంటుందని.. నవంబర్ 1వ తేదీ నుంచి అమలు అవుతుందని ఆయన హెచ్చరించారు వాణిజ్య ఉద్రిక్తతల వేళ.. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ ముఖాముఖి మాట్లాడుకున్నారు. దక్షిణ కొరియా బుసాన్‌లో గురువారం ఆసియా-పసిఫిక్ ఆర్థిక సహకార సదస్సు సమ్మిట్ వేదికగా ఈ ఇరు దేశాధినేతలు భేటీ అయ్యారు.దాదాపు ఆరేళ్ల తర్వాత.. కరచలనం చేసుకుంటూ నవ్వుకుంటూ ఇద్దరూ మీడియా ముందు ఫోజులిచ్చారు. ఆపై ఇరు దేశాల ప్రతినిధులతో ప్రత్యేక భేటీ జరిపారు.ఖరారైనట్లు సంకేతాలు అందుతున్నాయి.

## అమెరికాలో భారతీయ ఉద్యోగులపై మరో పిడుగు

- వర్క్ పర్మిట్ల ఆటోమేటిక్ రెన్యువల్స్ రద్దు..
- వేల మంది ఉద్యోగులపై తీవ్ర ప్రభావం

**వాషింగ్టన్(జనంసాక్షి):**వలసదారులపై కఠిన విధానాలు అమలుచేస్తోన్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం తాజాగా మరో సంచలన నిర్ణయం తీసుకుంది. వలసదారుల పని అనుమతులను ఆటోమేటిక్‌గా రెన్యువల్ చేసే విధానానికి ముగింపు పలికింది. డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోంల్యాండ్ సెక్యూరిటీ ఈ మేరకు ప్రకటన చేసింది. దీంతో వేలాది మంది విదేశీయులు ముఖ్యంగా భారతీయులు తమ ఉద్యోగాలు కోల్పోయే ప్రమాదం ఉంది."అక్టోబరు 30 లేదా ఆ తర్వాత నుంచి వర్క్ పర్మిట్లను (ఎంప్లాయిమెంట్ ఆథరైజేషన్ డాక్యుమెంట్స్) పునరుద్ధరించుకునేందుకు దరఖాస్తు చేసుకునే వలసదారులకు ఇకపై ఆటోమేటిక్ రెన్యువల్ ఉండదు. అయితే ఈ తేదీ కంటే ముందు పని అనుమతులను పొడిగించుకున్న వారిపై ఎలాంటి ప్రభావం ఉండదు" అని హోంల్యాండ్ సెక్యూరిటీ విభాగం తమ ప్రకటనలో వెల్లడించింది. ప్రజా భద్రత, జాతీయ ప్రయోజనాలను కాపాడుకోవాలనే ఉద్దేశంతోనే ఈ కొత్త నిబంధనలు తీసుకొచ్చినట్లు తెలిపింది.గతంలో బైడెన్ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో వలసదారులు తమ వర్క్ పర్మిట్ కాలపరిమితి ముగిసిన తర్వాత కూడా 540 రోజుల వరకు అమెరికాలో ఉద్యోగం చేసుకునేందుకు వీలుండేది. ఈ విధానానికి ముగింపు పలుకుతూ తాజాగా ట్రంప్ సర్కారు కొత్త రూల్స్ తీసుకొచ్చింది. పని అనుమతుల పొడిగింపు కోసం వలసదారులు ముందుగానే దరఖాస్తు చేసుకోవాలని అగ్రరాజ్య అధికారులు స్పష్టం చేశారు. " ఎంప్లాయిమెంట్ ఆథరైజేషన్ డాక్యుమెంట్ల రెన్యువల్ కోసం దరఖాస్తులను వలసదారులు ఎంత ఆలస్యం చేస్తే వారికి అంత నష్టం. ఒక్కోసారి తాత్కాలికంగా పని అనుమతులను కోల్పోయే ప్రమాదం కూడా ఉంది. అందుకే వర్క్ పర్మిట్ల గడువు ముగియడానికి 180 రోజుల ముందే రెన్యువల్ కోసం దరఖాస్తులు సమర్పిస్తే మంచిది" అని సూచించింది.



## జూబ్లీహిల్స్‌లో గెలుపుపై కాంగ్రెస్ ధీమా

అధికారంలో ఉన్నన్ని రోజులు ఒక్కటంటే ఒక్క తెల్ల రేషన్ కార్డు మంజూరు చేయలేక పోవడమే ఇందుకు నిదర్శనమన్నారు. కేవలం 20 నెలల కాంగ్రెస్ పాలనలో రాష్ట్ర వ్యాప్తంగా అర్హులైన నిరుపేదలకు 89 లక్షల నుండి కోటి 15 లక్షలకు తెల్ల రేషన్ కార్డులు పెంచామన్నారు. ఇంత పెద్ద ఎత్తున నిరుపేదలకు తెల్ల రేషన్ కార్డులను మంజూరు చేసిన ఘనత తమ ప్రభుత్వానికి దక్కిందన్నారు. ఒక్క జూబ్లీహిల్స్ నియోజకవర్గ పరిధిలోని నిరుపేదలకే 40 వేల తెల్ల రేషన్ కార్డులు మంజూరు చేశామని ఆయన గుర్తుచేశారు. యావత్ భారత దేశ చరిత్రలోనే మొట్టమొదటి సారిగా నిరుపేదలందరికి నాణ్యమైన సన్న బియ్యం పంపిణీని ప్రారంభించిన చరిత్ర కాంగ్రెస్ ప్రభుత్వానికి దక్కిందని ఆయన కొనియాడారు.రాష్ట్ర జనాభాలోని 85 శాతం మంది ఎస్.సి,ఎస్.టి,బి.సి, మైనారిటీ ప్రజలకు సన్న బియ్యం అందించిన కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంపై ప్రజలలో రోజు రోజుకు విశ్వసనీ యత పెరుగుతుందని ఆయన చెప్పారు.నాణ్యమైన సన్న బియ్యంతో 3 కోట్ల 15 లక్షల మంది లబ్ది పొందుతుం దగా మహాలక్ష్మి పథకంలో భాగంగా మహిళలు ఉచిత బస్సు ప్రయా ణంతో ప్రయోజనం పొందుతున్నాం ^న్నారు.అంతే గాకుండా గృహ జ్యోతి పథకంతో అర్హులైన నిరుపేదలం దరికి 200 యూనిట్ల విద్యుత్ ను ఉచితంగా అంది స్తున్న విషయాన్ని ఆయన గుర్తుచేశారు.అటువంటి సంక్షేమ పథకాలను విస్మరిం చిన విపక్షాలు అధికార కాంగ్రెస్ ప్రభుత్వంపై దుష్ప్ర చారానికి పాల్పడడం విడ్డురంగా ఉందని ఆయన విరుచుకుపడ్డారు. ముఖ్యమంత్రి రేవంత్,ఉప ముఖ్య మంత్రి మల్లు భట్టి విక్రమార్క ల నేతృత్వంలోనీ రాష్ట్ర ప్రజలకు సంపూర్ణమైన నమ్మకం కుదిరిందని,ఆ నమ్మకంతోటే ఇక్కడి ప్రజలు జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టబోతున్నారని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. రాష్ట్ర రోడ్డు రవాణా,బి.సి సంక్షేమ శాఖామంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో బి.జె.పి,బి.ఆర్.ఎస్ లు ఒక్కటయ్యారని ఆరోపించారు. ఆ రెండు పార్టీల కుట్ర లను ఛేదించాడానికి ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించాల్సిన ఆవశ్యకతను ఆయన వివరించారు.ఇదే నియోజకవర్గం నుండి ప్రాతినిధ్యం వహిస్తూ కేంద్ర మంత్రిగా విధులు నిర్వర్తిస్తున్న కిషన్ రెడ్డి జూబ్లీహిల్స్ నియోజకవర్గానికి ఎన్ని నిధులు విడుదల చేశారని మంత్రి పొన్నం సూటిగా ప్రశ్నించారు.

# మున్నేరు ప్రాంతం కన్నీరు



రామకృష్ణాపురం సమీపంలో లో లెవెల్ వంతెనపై వరద ప్రవహిస్తోంది. పాలేరు జలాశయానికి భారీగా వరద ప్రవాహం వచ్చి చేరుతోంది.

**పెనుగంచిప్రోలు వద్ద మున్నేరు ఉగ్రరూపం**

మొంథా తుపాను ప్రభావంతో ఎగువన కురిసిన వర్షాలకు ఖమ్మంలో మున్నేరు ఉద్ధృతంగా ప్రవహిస్తోంది. 25 అడుగులకు పైగా ప్రవాహం ఉండటంతో మూడో ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. వరద ఉద్ధృతికి పరిసర కాలనీల్లోని పలు ప్రాంతాలు ముంపునకు గురయ్యాయి. నివాసాలు, వ్యాపార సముదాయాలు వరద నీటిలో మునిగిపోయాయి. వరద బాధితులను అధికారులు పునరావాస కేంద్రాలకు తరలించారు. మున్నేరు ప్రవాహాన్ని జిల్లా కలెక్టర్ అనుదీప్, మేయర్ నీరజ పరిశీలించారు ఖమ్మంలోని రాపర్తి నగర్ బీసీ కాలనీ వద్ద డంపింగ్ యార్డుకు వెళ్లే రహదారి కొట్టుకుపోయింది. టీఎన్జీవోస్ కాలనీని నలువైపులా వరద నీరు ముంచెత్తడంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మున్నేరు పరివాహక ప్రాంతంలోని ఏదులాపురం పరిధిలో కేబీఆర్ నగర్, ప్రియదర్శిని కళాశాల ప్రాంతంలో ఉన్న ఇళ్ల చుట్టూ వరద నీరు చేరింది.

**జలదిగ్బంధంలో వరంగల్..**

మొంథా తుపాను ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు వరంగల్‌లోని పలు ప్రాంతాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. ప్రధానంగా వరంగల్ నగరంతో పాటు హనుమకొండ, కాజీపేట ప్రాంతాల్లోని పలు కాలనీలు చెరువులను తలపిస్తున్నాయి. వరంగల్-హనుమకొండను అనుసంధానం చేసే హంటర్ రోడ్డులో బొంది వాగు ఉప్పొంగడంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి.

**భద్రకాళి ఆలయానికి రాకపోకలు బంద్**

ములుగు రోడ్డు వద్ద నాలా ఉద్ధృతంగా ప్రవహిస్తోంది. సంతోషిమాత కాలనీ, డీకే నగర్, ఎన్ఎన్ నగర్, మైసయ్య నగర్, సమ్మయ్య నగర్, సాయి గణేశ్ కాలనీలోని ఇళ్లల్లోకి వరదనీరు చేరుకోవడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. వరద ప్రభావంతో వరంగల్ భద్రకాళి ఆలయానికి రాకపోకలు నిలిచిపోయాయి. ఆలయం నుంచి పాలిటెక్నిక్ కళాశాల వరకు రోడ్డు జలమయమైంది. వరంగల్ తూర్పు పరిధిలో ఆరు పునరావాస కేంద్రాలను నగరపాలక సంస్థ అధికారులు ఏర్పాటుచేశారు. ముంపు ప్రాంతాల ప్రజలను పడవల సహాయంతో పునరావాస కేంద్రాలకు విపత్తు నిర్వహణ సిబ్బంది తరలించారు.

కొట్టుకుపోయిన కార్లు, బైక్‌లు

హనుమకొండ పరిధిలోని వడ్డేపల్లి చెరువు నుంచి భారీగా వరద నీరు కాలనీల్లోకి వచ్చి చేరుతోంది. దీంతో జవహర్ కాలనీ, గోపాల్‌పూర్, 100 ఫీట్ల రోడ్డు జలమయమయ్యాయి. కాజీపేట నుంచి హనుమకొండ మార్గంలోని సోమిడి, గోపాల్‌పూర్ చెరువులు నిండిపోవడంతో కట్టలు తెగిపోయాయి. భారీగా వరద నీరు రోడ్డు పైకి చేరడంతో రాకపోకలు నిలిచిపోయాయి. వివేక్ నగర్, అమరావతి నగర్, ప్రగతి నగర్ కాలనీలు జలమయమయ్యాయి. పలు కాలనీల్లో కార్లు, బైక్‌లు జల ప్రవాహంలో కొట్టుకుపోతున్నాయి. పోచమ్మ మైదాన్-దేశాయిపేటకు వెళ్లే మార్గంలో 80 ఫీట్ రోడ్డు కూడలి వద్ద ప్రమాదకరంగా గుంత ఏర్పడింది.

## ముంబైలో 20 మంది పిల్లల కిడ్నాప్ కలకలం

ఓ యాడ్ ఇచ్చాడు. ఆ యాడ్ చూసిన 100 మందికి పైగా పిల్లలు మహారాష్ట్ర రాజధాని ముంబైలో ఉన్న ప్రముఖ నివాస ప్రాంతం 'పోవై' ఆర్ఏ స్టూడియోకు తరలివచ్చారు. ఆడిషన్స్ ఇచ్చేందుకు వచ్చిన 100 మంది పిల్లలో 20మంది పిల్లల్ని కిడ్నాప్ చేశాడు. వీరి వయస్సు 15 ఏళ్ల లోపే ఉంటుంది.అయితే, గురువారం మధ్యాహ్నం 1:45 గంటల ప్రాంతంలో పిల్లలు కిడ్నాప్‌కు గురైనట్లు 'పోవై' ప్రాంత పోలీసులకు సమాచారం అందింది. అప్రమత్తమైన పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. పిల్లల్ని రక్షించేందుకు పోలీసులు కిడ్నాపర్ రోహిత్ ఆర్యతో చర్చలు జరిపేందుకు ప్రయత్నించారు. కానీ పోలీసుల ప్రయత్నాలు విఫలమయ్యాయి. పిల్లల్ని విడుదల చేసేందుకు రోహిత్ అంగీకరించలేదు. పైగా పిల్లల ప్రాణాలు తీస్తానంటూ బెదిరింపులకు దిగాడు. దీంతో బాత్రూం ద్వారా పోలీసులు రెస్క్యూ ఆపరేషన్ చేపట్టారు. ఆ సమయంలో నిందితుడు పోలీసులపై కాల్పులు జరిపారు.ఈ కాల్పులకు ముందు పిల్లలు కిడ్నాప్‌కు గురైన 'పోవై' స్టూడియోలో నాటకీయ పరిణామాలు చోటు చేసుకున్నాయి. పిల్లల్ని బంధించిన కిడ్నాపర్ ఓ వీడియోను విడుదల చేశాడు. ఆ వీడియోలో కిడ్నాపర్ రోహిత్ ఆర్య మాట్లాడుతూ.. 'నావి మామూలు డిమాండ్లే. నేను కొంతమందిని ప్రశ్నించాలని అనుకుంటున్నాను. వాళ్ల నుంచి నాకు జవాబు కావాలి. నేను ముందుగా సూసైడ్ చేసుకోవాలనుకున్నాను. కానీ ప్లాన్ మార్చి పిల్లల్ని కిడ్నాప్ చేశా. ఈ వీడియో చూసిన తర్వాత పిల్లల్ని రక్షించాలని పోలీసులు ఏదైనా ప్రయోగం చేస్తే ఈ ప్రదేశాన్ని తగలబెడతా. డబ్బును ఆశించడం లేదు. అలాగని ఉగ్రవాదిని కూడా కాదు' అంటూ బెదిరింపులకు దిగాడు.అప్రమత్తమైన పోలీసులు రోహిత్ చెర నుంచి పిల్లల్ని రక్షించేందుకు రెస్క్యూ ఆపరేషన్ నిర్వహించారు. పిల్లల్ని కాపాడి వారి తల్లిదండ్రులకు అప్పగించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు రోహిత్ ఆర్య ఎవరు? పిల్లల్ని ఎందుకు కిడ్నాప్ చేశాడు? ఆయన మానసిక స్థితి ఎలా ఉంది? అన్న కోణం పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.

# వరద బాధితులకు ప్రభుత్వం అండ

- రాష్ట్ర దేవాదాయ అటవీ పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ
- వరద ముంపు ప్రాంతాల్లో క్షేత్ర స్థాయిలో పర్యటించిన మంత్రి
- డ్రోన్ ద్వారా ఆహార పంపిణీ పరిశీలన
- జిల్లాలో నాలుగు మండలాల్లో అత్యధిక వర్షపాతం నమోదైందన్న కలెక్టర్



**వరంగల్ బ్యూరో,అక్టోబర్ 30 (జనం సాక్షి) :** వరద బాధితులకు ప్రభుత్వం అండగా ఉందని అధైర్య పడవద్దని రాష్ట్ర దేవాదాయ అటవీ పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు.మేంథా తుఫాను ప్రభావం తో కురిసిన భారీ వర్షానికి జల మయమైన ఎన్ఎన్ నగర్, బిఆర్ నగర్ ప్రాంతాల్లో మంత్రి లోక్ సభ సభ్యురాలు డా.కడియం కావ్య, జిల్లా కలెక్టర్ డా.సత్య శారద తో కలిసి క్షేత్ర వరద ప్రాంతాలను సందర్శించి, బాధితులకు దైర్యం కలిగించారు.ఈ సందర్భం గా మంత్రి మాట్లాడుతూ తుఫాను వల్ల ఉమ్మడి జిల్లా వ్యాప్తం గా భారీ వర్షాలు కురిసాయని, వృద్ధులు ఆపరేషన్ మొదటి అంతస్తులో సుమారు 400 మంది వరకు ఉన్నారని, ఎస్ డి ఆర్ ఎఫ్, డి ఆర్ ఎఫ్ ల ద్వారా సహాయక చర్యలు చేపడుతున్నామని అన్నారు. గత 5 సంవత్సరాల నుండి ముంపు పరిస్థితి తలెత్తుతున్నదని, నగర పరిధి లో లోతట్టు ప్రాంతాలు ఉండడం, కొన్ని ప్రాంతాలు కబ్జాకు గురి అవ్వడం, సరైన వెడల్పుతో నాలాలు ఉండకపోవడం ఇందుకు కారణమని ఇకముందు ఇలాంటి పరిస్థితులు పునరావృతం కాకుండా ప్రణాళిక ప్రకారం చర్యలు తీసుకుంటామని అన్నారు. వర్షాల వల్ల ప్రజలు ఎలాంటి ఇబ్బందులు పడవద్దని ఇందుకోసం ముఖ్యమంత్రి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారని, వారి ఆదేశం మేరకు ముందుకు వెళతామని మంత్రి తెలిపారు. వరద ప్రభావం దృష్ట్యా గత రాత్రి నుండి జిల్లా కలెక్టర్‌తోపాటు సంబంధిత అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేయడం జరిగిందని, ప్రజలను సురక్షిత ప్రాంతాలకు చేర్చడానికి మన వద్ద అందుబాటులో ఉన్న డిఆర్ఎఫ్ బృందాలకు తోడు ఎన్‌డిఆర్ఎఫ్ బృందాలను కూడా పిలిపించడం జరిగిందని ఆయా డివిజన్‌లకు చెందిన కార్పొరేటర్లు కూడా రాత్రి నుండి వారి డివిజన్‌లలో అందుబాటులో ఉంటూ సేవలు అందిస్తున్నారని కాలనీ లలోని వరద ప్రాంతాల్లో చిక్కున్న వారిని పడవల సహాయం తో సురక్షిత ప్రాంతాలకు తరలించి ఆవాసం అందిస్తున్నామని అన్నారు. వరద వల్ల జరిగిన నష్టాన్ని ప్రభుత్వ దృష్టికి తీసుకు వెళ్లి న్యాయం జరిగేలా చూస్తామని వరద వల్ల నిరాశ్రయులైన వారికి తాత్కాలికంగా వరంగల్ ప్రాంతంలో 9 పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసి ఇప్పటివరకు సుమారు 700 మందిని తరలించినట్లు, వరద నీటి నుండి బయటకు వచ్చే పరిస్థితి లేని వారికి డ్రోన్‌ల ద్వారా ఆహారం అందిస్తున్నట్లు తెలిపారు. ప్రతి సారి వరద ప్రభావానికి గురయ్యే ప్రాంతాల వాసులకు ఇందిరమ్మ ఇళ్లను అందించి ఆ ప్రాంతాలను ఖాళీ చేయించేలా చూస్తామని, ప్రస్తుత పరిస్థితి నేపథ్యంలో రెండు రోజులు సెలవులు ప్రకటించామని, ప్రజలు కూడా అత్యవసరమైతే తప్ప బయటకు రాకూడదని ముఖ్యమంత్రితో వీడియో కాన్ఫరెన్స్ సమావేశం ఉందని వరంగల్‌లో వరద పరిస్థితులను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళతానని పునరావస కేంద్రాలలో ఆశ్రయం పొందుతున్న బాధితులకు పౌష్టికాహారం మంచినీటితో పాటు దుప్పట్లను కూడా అందజేస్తున్నట్లు మంత్రి తెలిపారు.జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వరంగల్ జిల్లా పరిధికి లో సగటున 25 సెంటీమీటర్ల వర్షపాతం నమోదు కావడం జరిగిందని పర్వతగిరి కల్లెడ ప్రాంతాలలో 37 సెం.మీ వర్షపాతం నమోదైందని నెక్కొండలో 33 సెం.మీ వర్షం కురిసిందని పర్వతగిరి, నెక్కొండ,వర్ధన్నపేట, రాయపర్తి మండలాల్లో అత్యధికంగా వర్షం కురిసిందని, పర్వత గిరి లో కొన్ని చెరువుకు లకు గండ్లు పడ్డాయని విద్యుత్ సరఫరా లో అంతరాయాలు ఏర్పడ్డాయని, ఎన్‌పిడిసిఎల్ నుండి సిఎండి పర్యవేక్షించి తగు చర్యలు తీసుకుంటున్నారని అన్నారు. రాయపర్తి మండలం లో కట్ట తెగడం వల్ల సుమారు 50 ఇండ్లు ప్రభావితం అయ్యాయని, పంట పొలాల్లోకి నీరు చేరడం జరిగిందని వరద నష్టాన్ని అంచనా వేసి ప్రభుత్వానికి నివేదించడం జరుగుతుందని తెలిపారు.వర్షం నిలిచిపోయినప్పటికి నగరం లో కొన్ని కాలనీలు ఇంకా నీటి లోనే ఉన్నాయని ముంపును అరికట్టగలిగితే రాబోయే 12 నుండి 16 గం.లలో నీరు పూర్తిగా వెళ్ళిపోయే అవకాశం ఉంటుందని ఎస్ఆర్‌నగర్‌లో వృద్ధుడు ఒంటరిగా నివసిస్తున్న వృద్ధుడు వృద్ధాప్య కారణంతో మృతి చెందినట్లు తెలిసిందని, సమగ్ర సమాచారం అందాల్సి ఉందని తెలిపారు. వరంగల్ జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో ఏలాంటి ప్రాణ నష్టం జరుగలేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంధ్య రాణి కార్పొరేటర్ పాల్గొన్నారు. డిఎఓ అనురాధ, డిఎం హెచ్ఓ డాక్టర్ సాంబశివరావు, సంబంధిత శాఖల అధికారులు తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.



## అలంకార్ జంక్షన్ వద్ద నీటి వరద

- రాకపోకలకు తీవ్ర అంతరాయం

**హనుమకొండ, అక్టోబర్ 30 (జనంసాక్షి) :** హనుమకొండ నగరాన్ని వరద ముంచెత్తింది. మొంథా తుఫాన్ ప్రభావంతో నగరంలో రోడ్లన్నీ జలమయమయ్యాయి. బుధవారం రోజంతా కురిసిన వర్షానికి రోడ్ల నీళ్లు వరదలా ప్రవహించాయి. హనుమకొండలోని అలంకార్ బ్రిడ్జి, కేయూ బైపాస్ రోడ్ పెద్దమ్మగడ్డ సమీపంలో ఉన్న బ్రిడ్జి వద్ద వరద ఉధృతంగా ప్రవహిస్తుండటంతో అటువైపు రాకపోకలను నిలిపివేశారు. దీంతో వాహనదారులకు ఇబ్బందులు తప్పలేదు. హనుమకొండ చౌరస్తా మీదుగా వరంగల్‌కు వెళ్లకుండా అంతరాయం ఏర్పడింది. అలంకార్ జంక్షన్, ములుగురోడ్, అజరా హాస్పిటల్‌కు వెళ్లేందుకు ప్రయాణికులకు ఇబ్బందులు తప్పలేదు. ఉదయం నుంచి సాయంత్రం వరకు వరద ఉద్రిక్తత ట్రాఫిక్ స్తంభించిపోయింది. ప్రయాణికులు తెలియక అటువైపు రావడంతో ఎటువెళ్లాలో తెలియక అయోమయానికి గురయ్యారు. యాదవ్‌నగర్ మూలమలుపు వద్ద ట్రాఫిక్ స్తంభించిపోయింది. 4వ డివిజన్‌లోని జ్యోతిబసు నగర్‌కాలనీ, పెద్దమ్మగడ్డ కాలనీలు, అలంకార్ జంక్షన్‌లోని పలు కాలనీలు నీటమునిగాయి. పోలీసులు, ఫైర్‌సిబ్బంది, ఎన్‌డీఆర్ఎఫ్ సిబ్బంది సహాయక చర్యలు చేపట్టారు. వరంగల్‌కు కాపువాడ మీదుగా వాహనాలను తరలించారు.

## తెలంగాణ బీసీ జేఏసీ కన్వనర్‌గా గటిక విజయ్ కుమార్



**హైదరాబాద్ (జనం సాక్షి) :** తెలంగాణ బీసీ జేఏసీ కన్వీనర్‌గా డాక్టర్ గటిక విజయ్ కుమార్ ను నియమితు లయ్యారు. ఈ మేరకు రాష్ట్ర బీసీ జేఏసీ అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు ఆర్ కృష్ణయ్య హైదరాబాద్ లో గురువారం నియామక పత్రం అందించారు. వరంగల్ జిల్లా నెక్కొండ కు చెందిన విజయ్ కుమార్ ప్రస్తుతం తెలంగాణ రాష్ట్ర పెరిక సంఘం అధ్యక్షులుగా ఉన్నారు. సీనియర్ జర్నలిస్టు అయిన విజయకుమార్ పలు సామాజిక ఉద్యమాల్లో చురుకైన పాత్ర నిర్వహిస్తున్నారు. హైదరాబాదులోని అశోక హోటల్ లో తెలంగాణ బీసీ జేఏసీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో రాష్ట్రవ్యాప్తంగా బీసీ ఉద్యమాన్ని బలోపేతం చేయడం పై చర్చ జరిగింది. స్థానిక సంస్థల్లో 42% రిజర్వేషన్లు సాధించడంతోపాటు చట్టసభల్లో కూడా బీసీ రిజర్వేషన్లు సాధించి రాజ్యాధికారంలో వాటా దక్కించుకోవడమే లక్ష్యంగా ముందుకు పోవాలని ఈ సమావేశంలో నిర్ణయించారు త్వరలోనే బీసీ జేఏసీ చైర్మన్ కృష్ణయ్య గారి ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా బీసీ రథయాత్ర నిర్వహించాలని నిర్ణయించారు. ఎందుకోసం జిల్లా నియోజకవర్గాల వారీగా కోఆర్డినేటర్ అని కూడా నియమించాలని సమావేశంలో నిర్ణయించారు.

## విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవంలో పాల్గొన్న ఉప్పల



**హైదరాబాద్ (జనంసాక్షి) :** మారుతీనగర్, తట్టిఅన్నారం, బండ్లగూడ, నాగోల్ లో జరిగిన పంచాయతన సహిత సీతారామాంజనేయ దేవాలయ విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాహ్వానం శ్రీ విష్ణు సహస్రనామ స్తోత్ర పారాయణ బృందంలో జరిగిన కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి అంతర్జాతీయ ఆర్య వైశ్య ఫెడరేషన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్త పాల్గొన్నారు. ఈ సందర్భగా ఆయన మాట్లాడుతూ శ్రీశ్రీశ్రీ భారతీ తీర్థ మహాసన్నిధానం వారి అశీస్సులతో, సన్నిధానంవారైన శ్రీశ్రీశ్రీ విధుశేఖర భారతీ స్వామివారు విచ్చేసి తమ కరకమలములతో పంచాయతని సహిత రామాలయమునకు సంబంధించి శ్రీ సీతారామాంజనేయ, స్పటికలింగ, -శారదామాత, ఆదిత్య, గణపతి విగ్రహమూర్తులనూ దత్తాత్రేయ ఆదిశంకరాచార్య మూర్తులకూ ప్రతిష్టాపనా మహోత్సవము కుంభాభిషేకము చేయుట జరుగును కావున, యావన్మంది భక్తులు సకుటుంబ సపరివార సమేతంగా ఈ ప్రతిష్టా మహోరీత్సవములో పాల్గొని, తీర్థప్రసాదములు స్వీకరించి స్వామివారి కృపకు పాత్రులు కావాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో దేవాలయ పాలక మండలి చైర్మన్ జంధ్యాల వేంకటేశ్వరులు, బ్రాంచ్ హెడ్ జొన్నలగడ్డ రామకృష్ణ, కోశాధికారి శిష్టా సుబ్బారాయుడు,శ్రీవిష్ణు సహస్రనామ స్తోత్ర పారాయణ బృంద కార్యవర్గము వేంకటేశ్వరులు,ఇంగువ భాస్కర నారాయణ శర్మ, శుద్ధపల్లి శ్రీనివాస ప్రసాద్, భాస్కర చారి పలువరు పాల్గొన్నారు.

## చిన్నారుల ఆకలి తీర్చిన అంగన్వాడీలు

- అభినందించిన మంత్రి సీతక్క



**హైదరాబాద్ (జనంసాక్షి) :** హన్మకొండలోని సమ్మయ్యనగర్, అమరావతినగర్, టీవీ టవర్ ప్రాంతాలు ఇటీవల వరదలతో తీవ్రంగా ప్రభావితమయ్యాయి. ఈ పరిస్థితుల్లో వరద ప్రభావిత ప్రాంతాల నుండి రక్షించబడిన చిన్నారుల ఆకలి తీర్చడానికి అంగన్వాడీ సిబ్బంది విశేష సేవలు అందించారు. పిల్లల ఆరోగ్యం దృష్టిలో ఉంచుకొని, అంగన్వాడీ టీచర్లు, హెల్పర్లు వేడిగా వండిన బాలమృతం ను చిన్నారులకు అందించారు. మంగళవారం నాడు అంగన్వాడి కేంద్రాలకు సెలవులు ప్రకటించినా..అంగన్వాడి సిబ్బంది విధుల్లోనే ఉండి వరద ప్రభావిత ప్రాంతాల్లో నీ చిన్నారుల బాగోగులు చూసుకున్నారు. స్వయంగా బాలామృతం వండి వరద ప్రభావిత ప్రాంతాలకు చేరుకుని వేడివేడి బాలామృతాన్ని వడ్డించారు. సిబ్బంది తీసుకున్న ఈ మానవతా దృక్పథంతో కూడిన చొరవను మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డా. దనసరి అనసూయ సీతక్క అభినందించారు. "అవసర సమయంలో ప్రజల కోసం అంగన్వాడీలు నిలబడటం, చిన్నారుల ఆకలి తీర్చడం గొప్ప సేవ" అని మంత్రి సీతక్క ప్రశంసించారు.అంగన్వాడీ వ్యవస్థ సామాజిక సేవలో ఒక కాంతి దీపంలా నిలుస్తుందని పేర్కొన్నారు. మొంథా తుఫాను నేపథ్యంలో కూడా అంగన్వాడీ సిబ్బంది చూపుతున్న నిబద్ధత, సేవా భావం పట్ల మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి అనితా రామచంద్రన్, డైరెక్టర్ శృతి ఓజా కూడా అభినందనలు తెలియజేశారు.

## మూడో రోజుకు మావోయిస్టు రాజకీయ ఖైదీ సంజయ్ దీపక్‌రావు నిరాహార దీక్ష

**హైదరాబాద్ (జనంసాక్షి) :** చర్లపల్లి జైలులో మావోయిస్టు రాజకీయ ఖైదీ సంజయ్ దీపక్ రావు నిరాహార దీక్ష మూడవ రోజు కొనసాగుతోంది. చర్లపల్లి సెంట్రల్ జైలు సూపరింటెండెంట్ శివ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో మానసా, మంజీరా బ్లాకుల్లో జరుగుతున్న ఖైదీల హక్కుల ఉల్లంఘనలను ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ పీపుల్స్ లాయర్స్ ఉపాధ్యక్షుడు ఎం.వెంకన్న తీవ్రంగా ఖండించారు. రాజకీయ ఖైదీ సంజయ్ దీపక్ రావు, సీపీఐ (మావోయిస్టు) సెంట్రల్ కమిటీ సభ్యుడని ఆరోపణలున్న వ్యక్తి, 2025 అక్టోబర్ 28 నుంచి నిరాహార దీక్ష చేస్తున్నారని, ప్రతి ఖైదీకి ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు తమ బ్లాక్ పరిధిలో స్వేచ్ఛగా తిరిగే హక్కు కల్పించాలి, ఇది తెలంగాణ జైలు మాన్యువల్ ప్రకారం చట్టబద్ధమైన హక్కు అని, ప్రస్తుతం మానసా, మంజీరా బ్లాకుల్లోని ఖైదీలను వెరండాలలో లేదా సెల్లుల్లో పగటి సమయంలో బంధిస్తున్నారని, దీనివల్ల ఖైదీలు తాజా గాలి, సూర్యకాంతి, శారీరక కదలిక లభించక ఆరోగ్య సమస్యలు, మానసిక ఒత్తిడి ఎదుర్కొంటున్నారు. ఈ రెండు బ్లాకుల్లో ఎక్కువగా రాజకీయ ఖైదీలు ఉన్నారని తెలిపారు. అయితే డీఎల్ఎస్ఏ న్యాయమూర్తులు క్రమం తప్పకుండా తనిఖీలు చేయకపోవడం వల్ల, సూపరింటెండెంట్ శివ కుమార్ గౌడ్ తన అధికార పరిమితి దాటి వ్యవహరిస్తున్నాడని,

నిరాహార దీక్ష మూడవ రోజు కొనసాగుతుందని, సంజయ్ దీపక్ రావు న్యాయవాది ఆయనను కలుసుకున్నారని, జైలు అధికారులు పగటి సమయంలో లాక్‌అప్ తెరవడానికి నిరాకరించారని తెలిపారు. రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ వెంటనే విచారణ జరపాలని, సీసీటీవీ ఫుటేజ్ ఆధారంగా విచారణ జరపి చర్లపల్లి జైలు సూపరింటెండెంట్ పై చర్యలు తీసుకోవాలని, డీఎల్ఎస్ఏ న్యాయమూర్తులు క్రమం తప్పకుండా పరిశీలనలు చేసి, భారత రాజ్యాంగంలోని ఆర్టికల్స్ 21, 14 ప్రకారం ఖైదీల హక్కులు రక్షించబడేలా చూడాలని కోరారు. ఖైదీల ప్రాథమిక హక్కులను కాపాడేందుకు ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## హరీష్ రావుకు కవిత దంపతుల పరామర్శ



**హైదరాబాద్, అక్టోబర్ 30 (జనంసాక్షి) :** మాజీ మంత్రి హరీష్‌రావు ఇంటికి కల్వకుంట్ల కవిత వెళ్లి ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. భర్తతో కలసి వెళ్లి హరీష్ రావును పరామర్శించారు. రెండు రోజుల క్రితం హరీష్‌రావు తండ్రి సత్యనారాయణరావు మృతి చెందిన విషయం తెలిసిందే. ఆ సందర్భంలో కవిత అంత్యక్రియలకు హాజరుకాలేదు. దీనితో హరీష్‌రావుతో ఉన్న విభేదాల కారణంగానే రాలేదని అనేక ఊహాగానాలు చెలరేగాయి. అయితే మూడు రోజుల తర్వాత, గురువారం ఉదయం కవిత హరీష్‌రావు నివాసానికి వెళ్లి కుటుంబసభ్యులను కలుసుకున్నారు. సత్యనారాయణరావు మృతి పట్ల విచారం వ్యక్తం చేస్తూ సంతాపం తెలిపారు. కాసేపు కుటుంబ సభ్యులతో మాట్లాడి ధైర్యం చెప్పినట్లు తెలుస్తోంది. అయితే.. గతంలో మాజీ మంత్రి హరీష్‌రావుపై సంచలన ఆరోపణలు చేశారు కవిత. కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతి వ్యవహారంలో హరీష్‌రావుపై మండిపడ్డారు. ఈ వ్యాఖ్యలపై హరీష్‌రావు ప్రత్యక్షంగా స్పందించలేదు. తాను ఉద్యమం నుంచి ఉన్నారని, తన ప్రస్థానం తెరిచిన పుస్తకమంటూ పరోక్షంగా స్పందించారు. కవిత హరీష్‌రావుపై చేసిన ఆరోపణల అనంతరం ఆమె ఆయన ఇంటికి వెళ్లడం ఇదే తొలిసారి. ఈ తాజా తరుణం అటు బీఆర్ఎస్ ఇటు జాగృతి శ్రేణుల్లో ఆసక్తి రేకెత్తించింది.



## జలమండలికి 'జల్ సంచయ్ జన భాగిదారి' అవార్డు

**హైదరాబాద్ (జనంసాక్షి) :** కేంద్ర జల్ శక్తి మంత్రిత్వ శాఖ, జల వనరుల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన 'టాప్ మునిసిపల్ కార్పొరేషన్' కేటగిరీలో అత్యుత్తమ ప్రదర్శన కనబరచినందుకు 'జల్ సంచయ్ జన భాగిదారి (జేఎస్ జేబీ) 1.0 అవార్డ్ లభించింది. ఈ అవార్డు భాగంగా నీటి సంరక్షణ కార్యక్రమాల కోసం రూ.2 కోట్ల నగదు ప్రోత్సాహక బహుమతిని అందిస్తారు. జలమండలి నీటి భద్రతతో కూడిన భవిష్యత్తు కోసం నీటి సంరక్షణ మాత్రమే కాకుండా ప్రజల ప్రవర్తనలో సానుకూల మార్పు తీసుకురావడంలో కూడా కీలకపాత్ర పోషించినందుకు, జేఎస్ జేబీ పరిధిలో కమ్యూనిటీ ఆధారిత నీటి సంరక్షణ చర్యలను ప్రోత్సహించడం ద్వారా "వాటర్ పాజిటివ్ యాక్షన్"ను ప్రేరేపించడమే కాకుండా, నీటి పట్ల కోల్పోయిన గౌరవాన్ని తిరిగి కలిగించిందని ఈ సందర్భంగా మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో పేర్కొంది. ఈ మేరకు ఆ సంస్థ ప్రతినిధులు జలమండలి ఎండీ అశోక్ రెడ్డి కి లేఖ రాశారు.

## సిద్దిపేట కలెక్టర్ కు కేంద్ర మంత్రి బండి సంజయ్ ఫోన్

- అక్కన్నపేటలో ఇద్దరు గల్లంతుపై ఆరా
- ఎస్డీఆర్ఎఫ్ టీంలను పంపి గాలింపు చర్యలు చేపట్టాలని కోరిన కేంద్ర మంత్రి

**కరీంనగర్ (జనంసాక్షి) :** బుధవారం రాత్రి కురిసిన వర్షానికి హుస్నాబాద్ నియోజకవర్గం అక్కన్నపేట మండలంలోని మల్లంపల్లి చెరువులో ఇద్దరు (భార్యభర్తలు) గల్లంతయ్యారనే సమాచారం తెలుసుకున్న కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ కొద్దిసేపటి క్రితం సిద్దిపేట జిల్లా కలెక్టర్ కు ఫోన్ చేశారు. ఆ ఇద్దరి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఇద్దరూ భార్యాభర్తలని వారి బైక్ లభ్యమైందే తప్ప ఆచూకీ తెలియలేదని కలెక్టర్ వివరించారు. వెంటనే ఎస్డీఆర్ఎఫ్ టీంలను రప్పించి గాలింపు చర్యలు చేపట్టాలని కోరారు. ఈ విషయంలో అవసరమైతే అన్ని రకాల సహాయ సహకారాలు అందించేందుకు సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు. స్థానిక బీజేపీ శ్రేణులు సైతం సహాయక చర్యల్లో పాల్గొనాలని, వర్ష బాధిత ప్రాంతాల్లో పర్యటించాలని పిలుపునిచ్చారు.

## జనగామ జిల్లాలో విషాద ఘటన

- వరద ప్రవాహంలో కొట్టుకుపోయిన జంట
- యువకుడు క్షేమం..యువతి గల్లంతు



**జనగామ, అక్టోబర్ 30 (జనంసాక్షి) :** జనగామ జిల్లాలో విషాదం చోటు చేసుకుంది. మొంథా తుపాన్ ప్రభావంతో జిల్లాలో వాగులు, వంకలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. వరద దాటికి బైక్‌పై వెళ్తున్న యువతీ, యువకుడు కొట్టుకుపోయారు. హైదరాబాద్‌కు చెందిన బరిగల శివకుమార్, వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలం దమ్మన్నపేట గ్రామానికి చెదిన యువతి శ్రావ్య ఇద్దరు కలిసి బైక్ వస్తున్నారు. ఈ క్రమంలో స్టేషన్ ఘనపూర్ నుంచి జఫర్‌ఘడ్ వెళ్లే ప్రధాన రహదారిపై తిమ్మంపేట గొల్ల మత్తడి వద్ద రోడ్డుపై వరద ఉధృతంగా ప్రవహిస్తున్నది. వరదను లెక్క చేయకుండా దాటే ప్రయత్నం చేయగా బైక్‌తో సహా ఇద్దరు కొట్టుకుపోయారు. శివకుమార్ చెట్టు కొమ్మను పట్టుకొని సురక్షితంగా బయటపడ్డాడు. యువతి మాత్రం గల్లంతయ్యింది. సమాచారం అందుకున్న పోలీసులు గొల్ల మత్తడి వద్దకు చేరుకుని 30 మంది ఎస్డిఆర్ఎఫ్ బృందాలతో గాలిస్తున్నారు. కాగా, యువతి తల్లిదండ్రులు హైదరాబాద్‌లోని ఓ పౌల్ట్రీ ఫామ్‌లో పనిచేస్తూ అమ్మాయిని ప్రైవేట్ హాస్టల్లో ఉంచి చదివిస్తున్నారు. హనుమకొండలోని వాగ్దేవి డిగ్రీ కళాశాలలో శ్రావ్య చదువుతున్నట్లు సమాచారం. బోళ్ల మత్తడి వద్ద డీసీపీ రాజమహేంద్ర నాయక్, ఆర్డీవో వెంకన్న, ఏసీపీ నరసయ్య సమీక్షిస్తున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## హన్మకొండలో వరద బాధితుల ఆందోళన

- మేయర్, కమిషనర్ల వాహనాలు అడ్డగింత

**హనుమకొండ, అక్టోబర్ 30 (జనంసాక్షి) :** హన్మకొండసమ్మయ్యనగర్ వద్ద ఉద్రిక్తత నెలకొంది. కమిషనర్ చాహత్ , మేయర్ సుధారాణి వాహనాలను వరద బాధితులు అడ్డుకున్నారు. రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. తులసి బార్ దగ్గర గేట్లు ఓపెన్ చేయాలని డిమాండ్ చేశారు. గోపాల్‌పూర్ చెరువు మత్తడి వద్ద గేట్లు మూసివేయడంతోనే గండిపడి వరద తీవ్రత పెరిగిందని సమ్మయ్య నగర్ వాసులు ఆందోళన చేపట్టారు. అధికారులు ముందస్తు చర్యలు చేపడితే ఈ పరిస్థితులు ఉండేవి కాదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కాగా, హనుమకొండలో వరద ఉద్రిక్తత ఏర్పడింది. మొంథా తుఫాన్ కారణంగా పలు కాలనీలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. భారీ వర్షాలకు రోడ్లు జలమయం అయ్యాయి. జనజీవనం స్తంభించింది. లోతట్టు ప్రాంతాల్లోని ప్రజల ఇళ్ళలోకి వరద నీరు చేరడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వాతావరణ శాఖ సైతం హనుమకొండ, వరంగల్ జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేసింది.

**CHENGE OF NAME AND RESIDENCE ADDRESS**

I, ENTENIKI BUNNY, H.NO.2-20, ERUPUMALLA GP(POST), BOMRASPET(M), VIKARABAD (DIST), TELANGANA(STATE), PIN:509338, CHENGED MY NAME AND RESIDENCE ADDRESS AS FOR RESI-DENCE CERTIFICATE JOGU ARUN KUMAR S/O JOGU NARSIMULU, H.NO:3-18, CHOWDARPALLY GP(POST), BOMRASPET(M), VIKARABAD(D), TELANGANA STATE, PIN:509350.

## చందమామతో కొడవటిగంటి
# విడదీయరాని అనుబంధం



### అక్టోబర్ 28...కొడవటిగంటి కుటుంబరావు జయంతి

దాదాపు ముప్పై సంవత్సరాలుగా "చందమామ" సంపాదకవర్గంలో ముఖ్యుడిగా వుంటూ, 'చంద మామ' అభివృద్ధికి దోహదం చేసిన సుప్రసిద్ధ రచయిత కొడవటిగంటి కుటుంబరావు. ''చందమామ'ను అభిమానించే అసంఖ్యాక పాఠకులు, అభిమానుల హృదయాలలో చిరస్థాయిగా ఆయన నిలిచి పోయారు. కథకుడుగా, విమర్శకుడిగా, వ్యాస, నవలా రచయితగా ఆయన సాధించిన ఖ్యాతి తెలుగు పాఠక లోకానికి సుపరిచితమే. 'చందమామ'లో ఎవరు ఏ కథ రాసినా, ఆ కథకు మెరుగులు దిద్ది, అందం తెచ్చి, చదివింప జేసిన ఘనత ఆయనది. తన అనుభ వాన్ని రంగరించి, సులభ భాషలో చందమామ పాఠకులకు ఆయన అందించిన వేలాది కథలు బాల సాహిత్యంలో ఆణి ముత్యాలు.

చక్రపాణి ఆశయాలను సాకారం చేసి, చందమామకు ప్రత్యేకత కల్పించి, తన ప్రతిభతో పాఠక లోకాన్ని తక్కిన పత్రికలను కాదని చందమామ వైపు ఆకర్షింప చేసిన మేధావి కొడవటిగంటి.

తెలుగు రచయితల్లో సుప్రసిద్ధ చెందిన వారిలో కొడవటిగంటి కుటుంబరావు ఒకరు. సమకాలీన మానవ జీవితాన్ని సునిశితంగా పరిశీలించి తన రచనలతో సహజత్వాన్ని సుసంపన్నం చేసిన సాహితీవేత్త ఆయన. తెలుగు మధ్య తరగతి కుటుంబాలను (కొంత ఎక్కువగా బ్రహ్మణ కుటుంబాలను) నిశితంగా పరిశీలించి వాటికి సంబంధించి ఎన్నో ఇతివృత్తాలను తన కథల్లోకి ఆయన తీసుకొన్నారు. జాతకాలు - వాటి ప్రభావాలు, మత పరమైన మూఢ విశ్వాసాలు, పిల్లల్ని పెంచటంలో పెద్దవాళ్ళ మూరత్వాలు, సామాజిక స్పృహ లేని వ్యక్తులు, మధ్య తరగతి మానవ సంబంధాలు, ముఖ్యంగా స్త్రీ - పురుష సంబంధాలు, అందులో దాంపత్యేతర సంబంధాలు ఆయన రచనల్లో ప్రధాన వస్తువులు.

కొడవటి గంటి కుటుంబరావు (1909 అక్టోబర్ 28 - 1980 ఆగష్టు 17), ప్రసిద్ధ తెలుగు రచయిత, హేతువాది. "కొకు" గా చిరపరిచితు డైన ఆయన తన యాభై ఏళ్ళ రచనా జీవితంలో పది వేల పేజీలకు మించిన రచనలు చేసాడు. చందమామ పత్రికను తీర్చిదిద్దిన ప్రముఖులలో ఆయన అగ్రగణ్యులు. కుటుంబరావు గుంటూరు జిల్లా, తెనాలి లోని ఒక మధ్య తరగతి బ్రాహ్మణ కుటుంబంలో జన్మిం చారు. తెనాలిలో పాఠశాల చదువు 1925 వరకు సాగింది. చిన్న వయసులోనే 1914లో తండ్రీ, 1920లో తల్లీ మరణించడంతో మేనమామ వద్ద పెరిగారు. ఆయన చిన్నతనం గ్రామీణ జీవితంతో పెనవేసుకు పోయింది. కవీ, రచయితా అయిన అన్నయ్య వెంకట సుబ్బయ్య ద్వారా ఆయన సాహితీ రంగ ప్రవేశం జరిగింది. ఆ కాలంలోనే ఆయనకు పాశ్చాత్య సాహిత్య పరిచయం జరిగింది. పదమూడేళ్ళ లేత వయసులోనే కొన్ని పద్యాలు, ఒక అసంపూర్ణ థ్రిల్లరు నవలా రాసారు. కొద్ది కాలం లోనే వాటిని వదిలి పెట్టారు. 1925లో ఉన్నత విద్య పూర్తికాక ముందే 11 ఏళ్ళ పద్మావతితో ఆయన పెళ్ళి జరిగింది. 1925 నుండి 1927 వరకు గుంటూరు ఆంధ్రా క్రిస్టియన్ కళాశాలలో ఇంటర్మీడియేటు చదివాక, 1927-29 కాలంలో మహారాజా కళాశాల, విజయ నగరంలో బియ్యే ఫిజిక్సు చదివారు. ఈ కాలంలోనే రచనా వ్యాసంగాన్ని సీరియస్ గా మొదలు పెట్టాడు. బియ్యే చివరికి వచ్చేసరికి ఆయన నాస్తికునిగా మారిపోయారు.

1929లో కాశీ హిందూ విశ్వ విద్యాలయంలో ఎం.ఎస్.సి ఫిజిక్సులో చేరారు. 1930లో ఆయన తొలిరచన సినిమా ఓరియంటల్ వీక్లీలో ప్రచురిత మైంది. ఆయన మొదటి కథ ప్రాణాధికం గృహలక్ష్మి మాస పత్రికలో అగ్రస్థానం పొందింది. కారణాంతరాల వల్ల ఎం.ఎస్.సి రెండో సంవత్సరం చదువు ఆగిపోయింది. 1931లో కొంతకాలం పాటు వరంగల్ లో ఉండి పిల్లలకు ప్రైవేట్లు చెప్పారు. చక్రపాణి, పిల్లలమర్రి బాలకృష్ణ శాస్త్రి, పిల్లలమర్రి సాంబశివ రావులతో కలిసి యువ ప్రెస్‌ను స్థాపించి యువ పత్రికను ప్రారంభించారు. 1940 - 42 మధ్య కాలంలో ఆంధ్ర పత్రికలో పని చేసారు. ఆ సమయంలో జరుక్ శాస్త్రి (జలసూత్రం రుక్మిణీనాథ శాస్త్రి) ఆయనకు సహోద్యోగి. 1942 లో నాలుగు నెలల పాటు ఒక మెటలు కర్మాగారంలో పని చేసారు. 1942 జూలై నుండి 1943 జనవరి వరకు సిమ్లాలో జాతీయ యుద్ధ ప్రచారక సమితిలో కాపీ రైటరుగా పనిచేసారు. 1944లో ఒడిషా జయపూరులో ఇన్స్పెక్టరేట్ ఆఫ్ మెటల్ అండ్ స్టీల్‌లో ఆర్నెల్ల పాటు ఫోర్మనుగా పనిచేసారు. 1948లో మూణ్ణెల్ల పాటు బొంబాయి ఎయిర్ ఇండియా కార్యాలయంలో ఎకౌంట్సు క్లర్కుగా పనిచేసారు. 1948లో ఆంధ్రపత్రిక దినపత్రికలో చేరి 1950-51లో వారపత్రిక సంపాదకత్వం నిర్వహించారు.

జగత్తులో స్థలము, కాలము అనే రెండు కొలతలే కాకుండా బుద్ధి అనేది కొలతగా పనిచేస్తుంది అనే సిద్ధాంతాన్ని... బుద్ధికొలత వాదం అనే పేరుతో ఆయన ప్రతిపాదిం చారు. ఈ ప్రతిపాదన అనేక చర్చలకు దారితీసింది. 1937లో రాసిన ఆయన రచన కారుణ్యం ముందు మాటలో...


నాకు ఒకటే ఆశయం - నా రచనల వల్ల కూడా మనోవికాసం పొంద దగిన వాళ్ళు తెలుగు వాళ్ళలో ఉండి తీరాలి. వారందరూ నా కథలు చదవాలని నా కోరిక. వారందరికీ నా రచనల మీద ఎంత త్వరగా ఏవగింపు కలిగితే అంత ఉపయోగం చేసిన వాణ్ణవుతాను తెలుగు సారస్వతానికి. అప్పటికి తెలుగు సారస్వతానికి నాతో పని అయిపోతుంది. నా కథలు చిరస్థాయిగా ఉండిపోవాలనే ఆశ నాకు ఏకోశానా లేదు. ఇంకా ఎప్పుడో పుట్టబోయే వాళ్ళ కోసం రాస్తున్నాననే అహంకారం కూడా నాకు లేదు. నేను ఆకాశం నుంచి ఊడిపడలేదు... అని తన మనసు లోని మాటను స్పష్టం చేశారు.

1952, జనవరి 1 నుండి చనిపోయే వరకూ చందమామలో పనిచేసి ఆ పత్రిక అత్యున్నత స్థితికి రావటానికి నిర్విరామ కృషి సలిపారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల**
9440595494

---

## వృద్ధులను రక్షించుట
# మన బాధ్యత



ఈ రోజు సమాజం మరోసారి ఆత్మపరిశీలన చేసుకోవాల్సిన సందర్భం. వృద్ధులను భారంగా కాకుండా బాధ్యతగా చూడాలి. వారిని ఆదరించడం, సంరక్షించడం, వారి అనుభవాలకు గౌరవం ఇవ్వడం మన ధర్మం. ఐక్యరాష్ట్ర సమితి (యూఎన్‌ఓ) 1990 నుంచి ఈ దినోత్సవాన్ని ప్రకటించి, ప్రపంచవ్యాప్తంగా జరుపుకుంటున్నారు. వృద్ధులు సమాజానికి అనుభవ సంపద. జీవిత పొడవునా సాధించిన జ్ఞానం, విలువలు, నీతి మన తరానికి మార్గదర్శకం. కానీ ఆధునిక జీవనశైలి, వేగవంతమైన జీవితం వారిని ఒంటరిగా మారుస్తోంది. శారీరక, ఆర్థిక, మానసిక ఒత్తిడులు పెరిగాయి. ఇంటి నుంచి గెంటివేయడం, ఆస్తి కోసం హత్యలు, మానసిక హింస కూడా జరుగుతున్నాయి. ఈ దినోత్సవం వృద్ధుల సమస్యలపై అవగాహన పెంచడం, వారి హక్కులు రక్షించడం, సమాజంలో గౌరవప్రద స్థానం కల్పించడమే లక్ష్యం.

**కుటుంబ వ్యవస్థలో మార్పులు.. వృద్ధుల దురవస్థ**

గతంలో ఉమ్మడి కుటుంబాలు వృద్ధులకు ఆధారం. తాతలు, అమ్మమ్మలు, నాయనమ్మలు పిల్లలకు కథలు చెప్పి, నీతి బోధలు చేసేవారు. ఇప్పుడు వ్యక్తి కుటుంబాలు, న్యూక్లియర్ ఫ్యామిలీలు పెరిగాయి. ఉద్యోగాలు, వలసలు, ఆర్థిక ఒత్తిడులు కుటుంబ సభ్యులను దూరం చేస్తున్నాయి. వృద్ధులు ఒంటరిగా ఉండిపోతున్నారు. ఆరోగ్య సమస్యలు %-% డయాబెటిస్, ఒత్తిడి, గుండె జబ్బులు, ఆర్థరైటిస్ %-% పెరిగాయి. ఆర్థికంగా ఆధారం లేకపోవడం, మానసికంగా ఒంటరితనం వారిని కృంగదీస్తోంది. వృద్ధాశ్రమాల సంఖ్య పెరుగుతోంది. ఇది సమాజంలో వృద్ధులపట్ల ఆదరణ తగ్గుతున్నట్టు సూచిక. పిల్లలు వారిని భారంగా భావిస్తున్నారు. ఆస్తి కోసం హింస, హత్యలు కూడా జరుగుతున్నాయి. ఇది సమాజ ధర్మానికి విరుద్ధం.

**చట్టాలు.. పథకాలు.. కానీ అమలు లోపం**

భారత రాజ్యాంగం ఆర్టికల్ 41 ప్రకారం వృద్ధులు, బలహీనులకు సహాయం చేయాలి. ఆర్టికల్ 46 బలహీన వర్గాలు, వృద్ధులకు రక్షణ కల్పించాలని చెబుతుంది. హిందూ అవిభాజ్య కుటుంబ చట్టం 1956 ప్రకారం పిల్లలు తల్లిదండ్రులకు భరణం ఇవ్వాల్సిన బాధ్యత ఉంది. క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ సెక్షన్ 125 ద్వారా న్యాయపరంగా భరణం పొందవచ్చు. ప్రభుత్వం వృద్ధాప్య పెన్షన్ పథకాలు, ఆరోగ్య సంక్షేమ పథకాలు అమలు చేస్తోంది. సీనియర్ సిటిజన్‌లకు రైల్వే, బస్సు ప్రయాణాల్లో రాయితీలు, దేవాలయ దర్శనాల్లో ప్రత్యేక సౌకర్యాలు, ఆసుపత్రుల్లో ప్రత్యేక వార్డులు కల్పిస్తున్నారు. ఓల్డ్ ఏజ్ హోమ్‌లు ఏర్పాటు చేస్తున్నారు. కానీ చట్టాలు, పథకాలు ఉన్నా అమలు లోపం ఉంది. అవగాహన లేకపోవడం, బ్యూరోక్రసీ ఆలస్యం, కుటుంబాల్లో బాధ్యత లోపం %-% ఇవన్నీ సమస్యలు. చట్టాలు మాత్రమే కాదు, మనసుల్లో మార్పు అవసరం.

**నైతిక విలువలు నశిస్తే సమాజం బాగుపడదు**

వృద్ధులు మనకు నీతి, అనుభవం, జ్ఞానానికి ప్రతిరూపం. వారిని గౌరవించడం, రక్షించడం సమాజ ధర్మం. ప్రపంచంలో ఏ మతం, సాంప్రదాయం అయినా వృద్ధులను గౌరవించాలని చెబుతుంది. హిందూ ధర్మంలో 'మాతృదేవో భవ, పితృదేవో భవ' అని చెప్పారు. క్రైస్తవంలో 'గౌరవించు నీ తల్లిదండ్రులను' అని బైబిల్ ఆదేశిస్తుంది. ఇస్లాం, సిక్కు మతాలు కూడా వృద్ధుల సేవను ధర్మంగా చెబుతాయి. వారు లేనిదే మనం లేమని స్పష్టమైన స్పృహ అందరికీ ఉండాలి. వృద్ధాశ్రమాలు పెరుగుతున్నాయంటే సమాజంలో ఆదరణ తగ్గుతోందని అర్థం. శ్రవణకుమారుడు వృద్ధ తల్లిదండ్రులను తీర్థయాత్రలు తీసుకెళ్లిన కథ చదివాం. ఆధ్యాత్మిక ధర్మం కూడా వృద్ధులను గౌరవించాలని చెబుతుంది.

**యద్భావం తద్భవతి.. పిల్లలు మనల్ని అనుసరిస్తారు**

నీవు వృద్ధ తల్లిదండ్రుల పట్ల ప్రవర్తించిన తీరే నీ ద్వారా వచ్చిన పిల్లలు అనుసరిస్తారు. ఇది పూర్తిగా నైతిక, మానసిక చర్య. చాలా కుటుంబాల్లో వృద్ధులు సమస్యలు చెప్పుకోలేక మానసికంగా కృంగిపోతున్నారు. పత్రికల్లో వృద్ధులపై దాడులు, హింస రోజూ కనిపిస్తున్నాయి. ఆస్తి కోసం కొడుకులు తల్లిదండ్రులను హింసిస్తున్న ఘటనలు భయానకం. నలుగురు, ఐదుగురు కొడుకులు ఉంటే భారాన్ని ఒకరిపై నెట్టేసుకుంటూ బాధ్యత నుంచి తప్పించుకుంటున్నారు. మరో భయంకర విషయం %-% వృద్ధాప్యంలో తల్లిని ఒకచోట, తండ్రిని మరొకచోట ఉంచి బతికుండగానే మానసికంగా చంపేస్తున్నారు. వృద్ధులు కూడా పిల్లలను పూర్తిగా నమ్మకుండా ఆస్తులు, ఆర్థిక విషయాల్లో జాగ్రత్తలు తీసుకోవడం అవసరం. విల్ రాయడం, బ్యాంకు ఖాతాలు సంయుక్తంగా ఉంచడం, ఆరోగ్య బీమా వంటి చర్యలు తీసుకోవాలి.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పినట్టు ఉద్యోగుల జీతాల్లో 10 శాతం వృద్ధ తల్లిదండ్రులకు ఇవ్వడం సంతోషకరం. ఇది బాధ్యతను గుర్తు చేస్తుంది. కానీ వారిని దూరంగా ఉంచితే కఠిన శిక్షలు విధించాలి. ప్రభుత్వం, సమాజ సంస్థలు వృద్ధులకు కౌన్సెలింగ్, ఆరోగ్య శిబిరాలు, సామాజిక కార్యక్రమాలు నిర్వహించాలి. పాఠశాలల్లో వృద్ధుల గౌరవం గురించి పాఠాలు చేర్చాలి. సమాజంలో నైతిక విలువలు నశిస్తే ఎంత అభివృద్ధి ఉన్నా బాగుపడదు. వృద్ధులను గౌరవించడం అంటే వారి ఆలోచనలు, అభివృద్ధి, సంస్కృతిని పిల్లలకు అందించడమే. ఇది మన బాధ్యత, మన ధర్మం.

**ఉమాశేషారావు వైద్య**
లెక్చరర్ ఇన్ సివిక్స్
జీజేసీ, దోమకొండ
9440408080

---

## సుబ్బరామిరెడ్డికి మాఫీ చేసిన
# బ్యాంకు డబ్బులు ఎవరివి?




లోకంలో ఎవరూ బంగారు చెంచాతో , బొడ్డులో వరాలు పోసుకుని పుట్టరు.బ్యాంకులు కూడా అంతే.బ్యాంకులు అంటే? ఆర్థిక పరిభాషలో డబ్బులు ఉన్న వారి (పొదుపుదారులు) నుండి డిపాజిట్ల పేర తీసుకుని అప్పులు తీసుకునే వారికి, రుణ గ్రహీతలకు డబ్బులను ఇచ్చి ఆర్థిక మధ్య వర్తిత్వం వహించు చున్నవి. ఇక డబ్బుల పరిభాష లో డబ్బులు స్వీకరిస్తూ, నిల్వచేస్తూ మరియు అప్పులను ఇస్తున్నవి.డబ్బులను డిపాజిట్ చేస్తున్న వారికి రుణ దాతలుగా డబ్బులను అప్పుగా తీసుకునే వారికి రుణగ్రహీత లుగా మధ్యవర్తిత్వం వహిస్తున్నవి.అన్ని బ్యాంకులకు మార్గదర్శకాల ను ఇస్తూ పెద్దన్నగా రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ)పని చేస్తుంది.భారత రిపబ్లిక్ ప్రభుత్వ ఆర్థికమంత్రిత్వశాఖ యాజమాన్యం వహిస్తుంది. 21 మంది సెంట్రల్ బోర్డాఫ్ డైరెక్టర్లు,గవర్నర్లు నలుగురు, డిప్యూటీ గవర్నర్లు ఇద్దరు,ఆర్థిక మంత్రిత్వ వ్యవహారాల కార్యదర్శి,ఆర్థిక సేవల కార్యదర్శి , ప్రభుత్వం నామినేటెడ్ చేసిన 10 మంది డైరెక్టర్లు కలిసి పని చేస్తారు.కర్ణాటక రాష్ట్ర మైసూర్ లో,పశ్చిమ బెంగాల్ రాష్ట్ర సల్బోనిలో కరెన్సీ నోట్లను ముద్రిస్తుంది. ద్రవ్య అధికారాన్ని సూత్రీకరించుచు, ద్రవ్య సరఫరాను నియంత్రిం చుచు ద్రవ్య విధానాన్ని అమలు చేస్తుంది. కరెన్సీ నోట్లు నాణెంలను జారీ చేస్తూ సరఫరాను నిర్ధారిస్తుంది.అలాగే బ్యాంకింగ్ వ్యవస్థను పర్యవేక్షి స్తుంది. నాన్ బ్యాంకింగేతర ఆర్థిక సంస్థలను (ఎన్బిఎఫ్సి) ఇతర సంస్థలకు లైసెన్సులు ఇస్తూ పర్యవేక్షిస్తుంది. డిజిటల్ లావాదేవీ లను ప్రోత్సహిస్తూ,చెల్లింపు పద్దతుల భద్రతలను నిర్ధారిస్తూ చెల్లింపులను, పరిష్కారాలను నియంత్రిస్తుంది. పర్యవేక్షిస్తుంది.

ఆర్థిక చేరికలను,రుణ మద్దతులను అందిస్తూ ఆర్థిక అక్షరాస్యతను పెంపొందించడం ద్వారా ఆర్థిక అభివృద్ధికి తోడ్పడుతుంది.2025 అక్టోబర్ 3న రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వెల్లడించిన లెక్కల ప్రకారం $699.96 బిలియన్ల విదేశీ మారక నిల్వలు ఉన్నవి.

దేశంలో 2025 ఆగస్ట్ నాటి లెక్కల ప్రకారం 12 ప్రభుత్వ రంగ బ్యాంకులు, 21ప్రైవేటు రంగ బ్యాంకులు,11 చిన్న ఆర్థిక బ్యాంకులు,44 విదేశీ బ్యాంకులు,5 చెల్లింపు బ్యాంకులు ఉన్నవి. ఇంకా నేషనల్ బ్యాంక్ ఫర్ అగ్రికల్చర్ అండ్ రూరల్ డెవలప్ మెంట్ (నాబార్డ్/ఎన్ఎబిఎఆర్ డి)బ్యాంకు పర్యవేక్షణ కింద సహకార బ్యాంకులు,గ్రామీణ ప్రాంతీయ బ్యాంకులు,లోకల్ ఏరియా బ్యాంకులు ఉన్నవి.2025 జనవరి నాటికి 15 ఏండ్ల వయస్సుకు మించి ఉన్న పెద్ద వయస్కుల్లో దాదాపు 89 శాతం మందికి,2.5 బిలియన్ల(250 కోట్ల ఖాతాలు) ఖాతాలు బ్యాంకులలో ఉన్నవి.2024 నవంబర్ నాటి లెక్కల ప్రకారం వివిధ బ్యాంకులలో దాదాపు రూ.224.7 లక్షల కోట్ల డిపాజిట్ లు ఉన్నవి. బ్యాంకులు తమ ఆదాయాలు పెంచుకోవడానికి ఖాతాదారుల/ప్రజల నుండి ఖాతా నిర్వహణ,ఎటిఎం(ఆటో మేటెడ్ టెల్లర్ మిషన్) పరిమితికి మించి డబ్బుల ఉపసంహారణకు,చెక్కు లావా దేవీలు, లోన్ ప్రాసెసింగ్ రుసుము, చెక్ బుక్ ఛార్జీలు, ఎన్ఇఎఫ్టి(నేషనల్ ఎలక్ట్రానిక్ ఫండ్స్ ట్రాన్స్ ఫర్), ఆర్టిజిఎస్(రియల్ టైమ్ గ్రాస్ సెటిల్ మెంట్) నగదు బదిలీల రుసుం. హౌసింగ్,వాహనం, వ్యక్తిగత,గోల్డ్ లోన్ రుణాలపై వడ్డీలు,బంగారు ఆభరణాల పరీక్ష ,మూల్యాంకనం, ఎస్ఎంఎస్(షార్ట్ మెసేజ్ సర్వీస్)హెచ్చరికలు, డిమాండ్ డ్రాఫ్ట్,లాకర్ సౌకర్యం,ఓవర్ డ్రాఫ్ట్,ముందస్తు ఖాతా ముగింపు,అధిక లావా దేవీలు మొదలగు బ్యాంకు సేవలపై ఖాతాదారుల/ప్రజల నుండి రుసుములు వసూలు చేస్తూ లాభాలను పొందుచున్నవి.డిపాజిట్ దారులకు సాధారణ వడ్డీగా 2.50 శాతం నుండి 8.50 వరకు చెల్లిస్తున్నారు.బ్యాంకులు ఇచ్చే రుణాలపై సంవత్సరానికి/ఫర్ ఆనమ్ 9.98 శాతం నుండి 24 వరకు, 10.60నుండి 16.50 శాతం వరకు,ఫ్యాక్టరీ లోన్స్ పై 9 నుండి 27 శాతం వరకు, నాన్ బ్యాంకింగ్ ఫైనాన్సియల్ కంపెనీలు 9 నుండి 30 శాతం వరకు వడ్డీలను వసూలు చేస్తున్నవి.ఇలా బ్యాంకులు వడ్డీలు,రుసుముల రూపేణా వసూలు చేస్తూ లాభాలను సాధించుచున్నవి.అలాగే డిపాజిట్/పొదుపు దారుల డబ్బులతో మధ్యవర్తిత్వం వహిస్తూ లావాదేవీలను సాగిస్తున్నవి.

1967 లో హజారే కమిటీ "ఇండస్ట్రీయల్ ప్లానింగ్ అండ్ లైసెన్సింగ్ పాలసీ" నివేదికను ఇచ్చారు.అప్పటి ప్రధాన మంత్రి ఇందిరా గాంధీ 1969 జూలై 19 న రూ.50 కోట్లు అంతకంటే ఎక్కువ డిపాజిట్లు ఉన్న 14 వాణిజ్య బ్యాంకులను జాతీయం చేశారు.అప్పటి నుండి వ్యవసాయం,చిన్న పరిశ్రమలు, దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న కుటుంబాలకు రుణాలు లభించినవి.సంపద వికేంద్రీకరణగా,ప్రజా సంక్షేమం లక్ష్యంగా బ్యాంకు సేవలు ప్రజలకు చేరువైనవి.కాని నేడు రైటాప్ ప్రతిపాదికన బ్యాంకుల దగ్గర బడాబాబులు తీసుకున్న అప్పులను మాఫీ చేస్తున్నారు.2025 జూలై 22 న ఎంపీ రితబ్రత బెనర్జీ రాజ్యసభలో బ్యాంకు లోన్స్ మాఫీపై అడిగిన ప్రశ్నకు కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి 2015 ౹ 2016 ఆర్థిక సంవత్సరం నుండి 2024, 2025 వరకు రూ.12,08,828 కోట్లు మాఫీ చేసినట్లుగా వెల్లడిం చారు. 2022 డిసెంబర్ నాటికి దేశ వ్యాప్తంగా ఉద్దేశ్యపూర్వకంగా అప్పుల ఎగవేత దారుల సంఖ్య 16,044 మంది బడాబాబులు ఉన్నారని,ఇందులో 85 శాతం రుణాలు ప్రభుత్వ బ్యాంకులవని నివేదించాయి.లోన్స్ రైటాప్ అంటే బ్యాంకుల పరిభాషలో "అప్పులను మాఫీ చేయకూడదు"! అట్లాగని బ్యాంకుల ఆస్తుల పట్టికలో చెత్త/మొండి బకాయిలు,చెత్త లోన్స్ ఉండకూడదని భావించి తొలగిస్తారు.కాని వాస్తవంగా లోన్స్ రైటాప్ అంటే మాఫీ చేయడమే జరుగుతుంది.

టి.సుబ్బరామి రెడ్డి ఆర్థికంగా దివాళా తీసిందని, అప్పు పుడుత లేదని మీడియాలో వచ్చిన వార్తలు చూసిన మెజారిటీ ప్రజలు అయ్యో పాపం అన్నారు.ఎందుకంటే ? ఎంపీగా, కేంద్ర గనుల సహాయ మంత్రిగా,సినీ నిర్మాతగా, బోళా శంకరుడి భక్తుడిగా, రుద్రాక్ష మాలలతో నిత్య పూజలు చేస్తున్నట్లు చిత్ర విచిత్రంగా టీవీల్లో కనిపించిన సుబ్బరామిరెడ్డికి అట్లేట్లయిందని ప్రశ్నించుకున్నారు.

ఇక కొన్ని రోజుల పిదప సుబ్బరామి రెడ్డికి రూ.5,700 కోట్ల బ్యాంకు రుణాలను మాఫీ చేశారన్న పిడుగు లాంటి వార్తతో ఉలిక్కిపడినారు. బ్యాంకు లోన్స్ కట్ట లేదని ఇంటి తలుపులను పీక్క పోయిన వారిని, ట్రాక్టర్లను, టూవీలర్స్ గుంజుక పోయిన బ్యాంకుల ను చూసినాము గాని ,వేల కోట్ల రూపాయల అప్పులను ఎట్లా? మాఫీ చేస్తారని ప్రశ్నించారు. టి.సుబ్బరామిరెడ్డి కుటుం బం ప్రమోటర్లుగా వ్యవహరిస్తున్న"గాయత్రి ప్రాజెక్ట్" ప్రభుత్వ బ్యాంకులైన కెనరా బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ బరోడా, పంజాబ్ నేషనల్ బ్యాంక్, ఇండస్ట్రియల్ డెవలప్ మెంట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఐడీబీఐ) ప్రభుత్వ వాటా 45.48శాతం,ఎల్ఐసి(లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా)49.24 శాతం వాటా కలిగి న బ్యాంకులకు దాదాపు రూ.8,100 కోట్ల అప్పును చెల్లించకుండా మొండికేసింది. అప్పుడు బ్యాంకులు"నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ (ఎన్సీఎల్టీ)హైదరాబాద్ కోర్టులో గాయత్రి ప్రాజెక్ట్ పై దివాళా పిటిషన్ ను వేశాయి. 2013 కంపెనీల చట్టం,2016 ఇన్ సాల్వెన్సీ అండ్ బ్యాంక్ రప్టసీ కోడ్(ఐబీసీ దివాళా కోడ్) మార్గదర్శకంగా గాయత్రి ప్రాజెక్ట్ ఆస్తులను "లిక్విడేషన్"లో పెట్టడం జరిగింది. అయినగాని గాయత్రి ప్రాజెక్ట్ ఆస్తులను కొనుగోలు చేయడానికి ఎవరూ ముందుకు రాలేదు.అప్పుడు గాయత్రి ప్రాజెక్ట్ వారే వన్ టైమ్ సెటిల్ మెంట్ (ఓటిఎస్)కింద రూ.2,400 కోట్లు చెల్లించడానికి ముందుకు వచ్చారు.దానితో ఎన్సీఎల్టీ ఆమోదం తెలిపింది. బ్యాంకులు కూడా మధ్యేమార్గంగా సమ్మతించారు. దానితో గాయత్రి ప్రాజెక్ట్ చెల్లించ వలసిన రూ.8,100 కోట్లు లోన్స్ కు బదులుగా రూ.2,400 కోట్లు లోన్స్ చెల్లించారు.ఇలా చట్టబద్ధంగా రూ.5,700 కోట్లు అప్పు మాఫీ కావడంతో పాటుగా మరల గాయత్రి ప్రాజెక్ట్ స్వంతం కావడాన్ని ప్రజలు ఆశ్చర్యంగా చెప్పుకుంటున్నారు. చేతి వృత్తుల వారు, రైతులు, స్వయం ఉపాధితో జీవించాలనుకునే సామాన్యులు బ్యాంకు రుణాలు కావాలని అడిగితే అవరోధాలు ఎదురవుతున్నవి. అదే బడాబాబులకు,పారిశ్రామిక వేత్తలకు, కార్పోరేట్ కంపెనీలకు మాత్రం వేల కోట్ల రూపాయల రుణాలను అప్పనంగా ఇస్తూ రైటాప్ పేరుతో మాఫీ చేయడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. ప్రజలు రుసుముల,వడ్డీల పేర చెల్లిస్తున్న డబ్బులే బ్యాంకుల లాభాలని,బ్యాంకుల డబ్బులన్నీ ప్రజల శ్రమ ఫలితంగా పోగైన డబ్బులుగా గుర్తించాలని కోరుచున్నారు.ప్రభుత్వమే బ్యాంకుల డబ్బులను రుణాలుగా తీసుకుని ఉపాధి అవకాశాలను పెంచడా నికి, ఉత్పత్తి, ఉత్పాదకతలను పెంచడా నికి, ప్రాజెక్ట్ ల నిర్మాణానికి వెచ్చించి దేశాభివృద్ధికి తోడ్పడాలని కోరుకుంటున్నారు.



**మేరుగు రాజయ్య**
వాట్సాప్ నంబర్: 9441440791

---

## మృత్యు కుహరాలు

పిల్లలు ఆడుకునే రంగురంగుల బొమ్మలు కావవి
కావలి కారులు లేని మృత్యు కుహరాలు
పైన ధగధగలు లోన ప్రమాణాల లేమి
ఎందుకు ఎక్కుతారో
ఎందుకు దిగుతారో తెలియదు
ఇంపైన సీటు ఇరుకిరుకు దారిని గమనింప
చేయదు
కాలం వెంట పరుగు ఈ లోకం నుండి
నిష్క్రమణ దాకా
ఎక్కడెక్కడో రిజిస్ట్రేషన్ మరెక్కడో ఫిట్నెస్
వెరసి తెలుగు రాష్ట్రాల్లో రోడ్లపై తిరుగు
టూరిస్ట్ పర్మిట్ లు స్టేజి క్యారియర్లు గా
విచ్చలవిడిగా కళ్లు మూసుకున్న కబోదిగా
రాజ్యాలు లంచగొండి రాజ్యంలో
ప్రాణాలకు వెలకట్టే రాజ్యంలో
మానవీయ విలువలను చంపేసే
పెట్టుబడి కరాళ నృత్యం
ప్రజారోగ్యం ప్రజారవాణా ఎక్కడుంటే క్షేమమో
ఎరుగని జనం
పెట్టుబడి రాజ్యం చెట్టపట్టాలేసుకొని తిరిగినా
నోరు పెగలదు
వెలను ప్రశ్నించరు
ఊరవతల డాబాల్లో ఏం సేవిస్తున్నా కిమ్మనరు
వేగాన్ని ఆస్వాదిస్తారు
ఏ క్షణం ఏం జరుగునో ఎరుగరు
ప్రజా రవాణా కోసం వెంపర్లాడరు
సౌలభ్యం మాటున దాగిన చీకటి కోణాలు వెలికి
తీసేదెవరు?!
ప్రజా ఉద్యమాల నిర్మాణం ఆగిందెప్పుడో
అరకొర వున్నా మద్దతు లేక నిస్సారంగా
ఓటు అమ్ముకున్నప్పుడే చస్తూ బతికే బతుకును
ఆహ్వానించారులే!
కొన్ని కన్నీటి బొట్లు ఓ వారం
మళ్లీ షరా మామూలే! ఎక్కడి దొంగలు అక్కడే
గప్ చుప్!!

**- గిరి ప్రసాద్ చెలమల్లు**
9493388201

---



## సుడులదారులు

నీతి పాలన
అందరి అభిమతం
ఆశల తోట
కథాభాషణం
సత్యహరిశ్చంద్రుడు
నిత్యస్మరణం
న్యాయ పాలన

గంతలు లేని రాజ్యం
ధర్మసతాకం
చెమట కష్టం
పాట్లకూటికి యుద్ధం
నిజసంపద

**రేడియమ్**
9291527757

---

## అమ్మ కదా

మంత్రాల సర్పంచు దుస్తంత్రాల పట్వారి
తంత్రాల పటేల్ కుతంత్రాల దొర
ఎవరు చెప్పినా అమ్మను
మా తాత పొర్లాడిండు
మా అయ్య తిరుగులాడిండు
నేనెట్ల అమ్మేది
అమ్మలేనని చెప్పేది
టీకొట్టులో ఛీకొట్టినా
కిరాణాకొట్టులో చివాట్లు పెట్టినా
పరవాలేదు
అమ్మను వెలేయండి మోలేయండి
అమ్మను
అమ్మడానికి అది గంటచూట్టా కాదు
అమ్మడానికి అది అగ్గిపెట్టె కాదు
నా పిల్లలు సాలెకి పోయిరి
చదువులు నేర్చిరి కొలువులకి వెళ్ళిరి
మమ్మల్ని చల్లంగా చూసిన భూమిని
వదిలేది లేదు మమ్మల్ని మెల్లంగా సాకిన
భూమిని విడిచేది లేదు
ఏడాదికో శివరాత్రి జాతర
ఏడాదికో నవరాత్రి జాతర
మాకు నారు వేస్తుంటే జాతర
పైరు కోస్తుంటే జాతర
ఏరువాకలు ఎదురుపడితే ఆరుగాలం
అలుపెరుగని జాతర
ఆశతో మెడలు వంచాలన్నది బ్రోకర్ల కుహకం
దురాశతో తొడలు విరచాలన్నది మేకర్ల
నిర్వాకం భూమి లేకుంటే రైతులేడు
రైతు లేకుంటే భూమిలేదు
భూమికి పర్యాయపదం రైతు
రైతుకి మర్యాదపదం భూమి
మంచెను కూల్చాలా ? కంచెను కాల్చాలా ?
మేకలు కసాయికా?ఆవులు ఆల్కబీర్ కా ?
పొలంలో నేను నడుస్తుంటే ఆనంద నాట్యాలు
చేస్తూ ఎగిరే ధూళి కణాల్ని
కాలువల ద్వారా నాతో పాటే నడిచే
నీటి బిందువుల్ని
ఎలా మరువగలను ?
కరెన్సీ కట్టలు బ్యాంకు వడ్డీలు
రైతును పిలవలేవు కొలవలేవు .. రైతు రైతే
నాగలి మోసేవాడు రైతు
ఆకలి తీర్చేవాడు రైతు
వానలు లేవనో వాగులు రావనో
అమ్మను .. కరాళ కరువుల పాదాక్రాంతాలు
కర్కశ కౌరవుల అన్యాక్రాంతాలు
నన్ను అమ్మించలేవు నమ్మించలేవు
బతుకీడుస్తున్నది
సంసార బండి లాగిస్తున్నది ఈ భూమే
జీవనాధారం ఈ భూమే
వెలుగు రేఖలు ప్రసరిస్తున్నది ఈ భూమే బి
భూమి లేకుంటే నేనెగరేసేది
సూత్ర రహిత గాలిపటమే బి
భూమి లేకుంటే నేనెమరేసేది
పాత్ర విహిత చిత్రపటమే బి
మా తాత సమాధి దగ్గర మా అయ్య
మా అయ్య సమాధి దగ్గర రేపు నేనూ
నా పిల్లలు రైళ్ల మీద బస్సుల మీద ఊరువచ్చి
ఆరడుగులనేల అప్పుగా అడగాలా ?
అమ్మను

# విధి నిర్వహణలో పోలీస్ అమరవీరుల త్యాగాలు మరువలేనివి

- రక్తదానం ప్రాణదానంతో సమానం
- గంజాయి, డ్రగ్స్‌కు యువత దూరంగా ఉండాలి
- మహేశ్వరం జోన్ డీసీపీ సునీతా రెడ్డి
- ఇబ్రహీంపట్నంలో మెగా రక్తదాన శిబిరం పాల్గొన్న పలు కళాశాలల విద్యార్థులు, యువకులు, జర్నలిస్టులు
- సీఐలు, ఎస్ఐలు, పోలీసు సిబ్బంది సైతం రక్తదానం



**ఇబ్రహీంపట్నం, అక్టోబర్ 30 (జనం సాక్షి) :** విధి నిర్వహణలో పోలీస్ అమరవీరుల త్యాగాలు మరువలేనివని మహేశ్వరం జోన్ డీసీపీ సునీతా రెడ్డి అన్నారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాల సంధర్భంగా గురువారం ఇబ్రహీంపట్నంలోని వైష్ణవి గార్డెన్ లో ఇబ్రహీంపట్నం ఏసీపీ రాజు ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ముందుగా నిజామాబాద్ కానిస్టేబుల్ కు శ్రద్ధాంజలి ఘటించారు. రక్తదానం శిబిరంలో పలు కళాశాలల విద్యార్థులు, అధ్యాపకులు, యువకులు, పోలీస్ సిబ్బంది అత్యధిక సంఖ్యలో పాల్గొని రక్తదానం చేశారు. మెగా రక్తదాన శిబిరాన్ని మహేశ్వరం డీసీపీ సునీతా రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ...పోలీస్ శాఖ శాంతిభద్రతల పరిరక్షణ, ప్రజా రక్షణ కోసం విధి నిర్వహణలో ప్రాణాలు సైతం లెక్కచేయకుండా సమర్ధవంతంగా విధులు నిర్వహిస్తున్నామని చెప్పారు. విధి నిర్వహణలో అమరులైన పోలీసుల త్యాగాలు మరువలేనివని కొనియాడారు. అక్టోబర్ 21 పోలీసుల అమరవీరుల దినోత్సవం పురస్కరించుకొని వారి కుటుంబాలను రాచకొండ పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో తమ పోలీసులు కలిసి కుటుంబ స్థితిగతులు తెలుసుకోవడం జరుగుతుందని వివరించారు. తమకు తోచిన ఆర్థిక సహాయాన్ని ఆ కుటుంబాలకు అందజేస్తున్నామన్నారు. పోలీసుల అమరత్వాన్ని కొనియాడుతూ అవగాహన సదస్సులు, ర్యాలీలు, రక్తదాన శిబిరాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. పోలీసు అమరుల కుటుంబాలకు ప్రభుత్వ యంత్రాంగం అండగా ఉంటుందని అన్నారు. శాంతి భద్రతల పరిరక్షణకు ప్రజలు సహకరించాలన్నారు. గ్రామాల్లో సైబర్ నేరాల పట్ల అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామని తెలిపారు. శాంతి,భద్రతల విషయంలో పోలిసులకు ప్రజలంతా సహకరించాలని కోరారు.

### రక్తదానం ప్రాణదానంతో సమానం

రక్తదానం ప్రాణదానంతో సమానమని, ప్రతి ఒక్కరూ రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని మహేశ్వరం డీసీపీ సునీతా రెడ్డి అన్నారు. రక్తదానం చేయడం వల్ల ఆపదలో వారి ప్రాణాలు కాపాడటానికి ఉపయుక్తంగా ఉంటుందన్నారు. అన్ని దానాల కన్న ప్రాణదానం మిన్న అనే నినాదాన్ని పలు కళాశాలల విద్యార్థులు, యువకులు నిజం చేశారని చెప్పారు. విద్యార్థులు, యువకులు, పోలీసులు సైతం స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేయడం అభినందనీయం అన్నారు. రక్తదానం చేయడం వల్ల మనుషులను ప్రాణాపాయం నుండి కాపాడగలుగుతామన్నారు. రక్తదానం చేయడంతో మూడు రకాలుగా మనుషులకు ఉపయోగపడుతుందని అన్నారు. ఇప్పటికే రక్త నిల్వలు పడిపోయి ఆపదలో ఉన్నవారికి రక్తం అందడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. దాని ఫలితంగా అనేక మంది అభాగ్యులు ప్రాణాలు కోల్పోతున్నారని చెప్పారు. అందుకే రక్తదానం చేసేందుకు యువత ముందుకు రావాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి ఒక్కరూ నాలుగు సార్లు రక్తదానం చేయవచ్చని వైద్యులు చెపుతున్నారని, కనీసం ఒకసారి రక్తదానం చేయడం వల్ల ఎంతోమంది ప్రాణాలను కాపాడగలుగుతామని చెప్పారు. రక్తం అందుబాటులో లేక వందలాది మంది ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాబట్టి యువత ముందుకు వచ్చి రక్తదానం చేస్తే, ఆపదలో ఉన్నవారికి రక్తం అందుబాటులో ఉంటుందని చెప్పారు. కాబట్టి ప్రతి ఒక్కరూ రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని కోరారు.

### గంజాయి, డ్రగ్స్‌కు యువత దూరంగా ఉండాలి

గంజాయి, డ్రగ్స్‌కు యువత, విద్యార్థులు, దూరంగా ఉండాలని మహేశ్వరం డీసీపీ సునీతా రెడ్డి సూచించారు. సమయాన్ని వృధాగా చేస్తూ మత్తు పదార్థాలకు అలవాటు పడి బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని అన్నారు. విద్యార్థులు చక్కటి క్రమశిక్షణతో విద్యను అభ్యసిస్తూ ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. తల్లిదండ్రులు ఎంతో కష్టపడి తమ పిల్లలను చదివిస్తున్నారని, వారి కలలను నిజం చేయాల్సిన బాధ్యత ప్రతి విద్యార్థిపై ఉందన్నారు. యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. విద్యార్థులకు, యువతకు పోలీస్ యంత్రాంగం అండగా ఉంటుందన్నారు. రక్తదాన శిబిరంలో విద్యార్థులు సైతం రక్తదానం చేయడం అభినందనీయమన్నారు. రక్తదాన శిబిరంలో భాగస్వాములైన 200 మందికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతర రక్తదానం చేసిన విద్యార్థులకు, యువకులకు, సిబ్బందికి పోలీసులు సర్టిఫికెట్లను ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం ఏసీపీ రాజు, సీఐలు మహేందర్ రెడ్డి, రవికుమార్, మధు, సత్యనారాయణ, నందీశ్వర్ రెడ్డి, ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది, విధ్యార్థులు, అధ్యాపకులు, జర్నలిస్టులు, తదితరులు పాల్గొన్నారు.

## శంషాబాద్ విమానాశ్రయంలో ప్రీపెయిడ్ టాక్సీ కౌంటర్ ప్రారంభం




**రాజేంద్రనగర్, అక్టోబర్ 30 (జనంసాక్షి) :** మాధాపూర్ ట్రాఫిక్ డీసీపీ సాయి మనోహర్ రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయాన్ని సందర్శించి, కొత్త ప్రీపెయిడ్ టాక్సీ కౌంటర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన టాక్సీ డ్రైవర్లతో సమావేశమై, విమానాశ్రయ ప్రయాణికులతో వ్యవహరిస్తూ నిబంధనలు, రహదారి నియమాలు, మర్యాదతో వ్యవహరించాల్సిన విధానం గురించి సూచనలు చేశారు.డీసీపీ సాయి మనోహర్ డ్రైవర్లు ప్రయాణికులకు సురక్షితమైన, సౌకర్యవంతమైన సేవలు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో శంషాబాద్ ఏసిపి నాగభూషణం, ఇన్స్పెక్టర్ ప్రమోద్ కుమార్, ట్రాఫిక్ కానిస్టేబుల్, సిబ్బంది పాల్గొన్నారు.

## పెండింగ్‌లో ఉన్న ఫీజు రియంబర్స్‌మెంట్‌ను విడుదల చేయాలి

- ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు శ్రీకాంత్..




**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 30 (జనంసాక్షి) :** పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ స్కాలర్షిప్స్ ను విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు వద్ల శ్రీకాంత్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా బందులో భాగంగా షాద్ నగర్ లో ఉన్న కళాశాలలను బందు చేయించారు ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ విద్యార్థులకు పెండింగ్ లో ఉన్న 8500 కోట్లు స్కాలర్షిప్ ఫీజు రీయింబర్స్మెంట్ విడుదల కావలసి ఉందని కానీ ప్రభుత్వం మాత్రం పట్టించుకోవడంలేదని దీంతో విద్యార్థులు చదువుకోడానికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి విద్యార్థులకు పెండింగ్ లో ఉన్న స్కాలర్షిప్స్ ఫీజు రీయింబర్స్మెంట్ వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు శివ శంకర్ చరణ్ వంశీ చింటూ చంద్ర కార్తీక్ అమీర్ బాబా బబ్లూ సాయి విజయ్ హరి నవదీప్ శివ తదితరులు పాల్గొన్నారు.

## పౌర హక్కులకు భంగం కలిగించొద్దు



**మర్పల్లి, అక్టోబర్ 30 (జనంసాక్షి) :** పౌరహక్కులపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని, బాల్య వివాహాలు, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు గ్రామస్తులు అందరూ సహకరించాలని మర్పల్లి ఎస్ఐ రవూఫ్, సిరిపురం హాస్టల్ సంక్షేమ అధికారి తుల్జారాం గౌడ్ అన్నారు. గురువారం మండలం పరిధిలోని సిరిపురం గ్రామం నల్ల పోచమ్మ గుడి దగ్గర పౌర హక్కులపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లేబర్ చట్టం బాల్య వివాహాలు నిరోధక చట్టం వంటి వాటిపై అందరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. గ్రామ కార్యదర్శి మహేష్ గౌడ్, సిరిపురం అంబేద్కర్ సంఘం అధ్యక్షుడు నర్సింలు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## భారీ వర్షాలతో కొట్టుకపోయిన కల్వర్టు

- తీవ్ర ఇబ్బందులు పడుతున్న రైతులు




**మోమిన్‌పేట, అక్టోబర్ 30 (జనం సాక్షి) :** ఇటీవల కురిసిన భారీ వర్షాలకు రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండల పరిధిలోని ఎన్కతల గ్రామ విరాట్ హనుమాన్ జదిగల వాగు పూర్తిగా కొట్టుకపోవడంతో రైతులు, గంగారం వెళ్లే బాటసారులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు గ్రామ శివారులో జదిగల వాగు వారం రోజుల క్రితం కురిసిన భారీ వర్షాలకు పూర్తిగా కొట్టుకపోవడంతో గ్రామానికి చెందిన 60 మంది రైతులు, గంగారం వెళ్లే బాట సారులకు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని గ్రామస్తులు పేర్కొన్నారు. కల్వర్టు మీదుగా 60 మంది రైతులు తమ పంట పొలాల్లో కూరగాయ పంటలు, వరి, పత్తి, ఇతర పంటలతో సాగు చేస్తున్నడంతో రాకపోకలతో తీవ్ర ఇబ్బందిగా మారింది భారీ వర్షాలతో పంటలు నష్టపోయిన రైతుల పొలాలను సందర్శించిన అధికారులు కల్వర్టు వైపు కన్నెత్తి చూడకపోవడం విచారకరమన్నారు ఈ విషయమై సంబంధిత అధికారులు స్పందించి కల్వర్టు నిర్మాణానికి నిధులు విడుదల చేసి రైతుల రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతినిత్యం పొలాలకు వెళ్లే రైతులందరికీ చాలా ఇబ్బందికరంగా మారింది కల్వర్టు నిర్మాణం వెంటనే జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కల్వర్టు రోడ్డులో వ్యవసాయ రైతులే కాకుండా గ్రామానికి వెళ్లే వాహనదారులు బాటసారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు వారి ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని కలవట్టు నిర్మాణం లేదా తాత్కాలికంగా రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా చూడాలన్నాలని కల్వర్టు నిర్మాణ పనులు త్వరలో పూర్తయ్యేల చర్యలు తీసుకోవాలని పలువురు రైతులు, గ్రామస్తులు కోరుతున్నారు.

## విజిలెన్స్ అవగాహన వారోత్సవం




**రాజేంద్రనగర్, అక్టోబర్ 30 (జనం సాక్షి) :** విజిలెన్స్ అవగాహన వారోత్సవాల సందర్భంగా డైరెక్టర్ జనరల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ శిఖా గోయల్ ఐపీఎస్ ఆదేశాల మేరకు, హైదరాబాద్ రూరల్ యూనిట్ రీజనల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి పాల్వాయి శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రొఫెసర్ జయశంకర్ అగ్రికల్చర్ యూనివర్సిటీలో విజిలెన్స్ అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ డా. సిహెచ్ విద్యాసాగర్, ప్రిన్సిపల్ డా. ఎం. గోవర్ధన్, విజిలెన్స్ అధికారి శ్రీనివాస్ రెడ్డి తదితరులు విజిలెన్స్ ప్రాముఖ్యతపై ప్రసంగిస్తూ, అవినీతి రహిత సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరి పాత్ర ముఖ్యమని విద్యార్థులను కోరారు.ఈ కార్యక్రమంలో డా. వి. రామి రెడ్డి, విజిలెన్స్ అధికారులు, కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## కార్మికులకు అండగా ఉంటా..



**కుత్బుల్లాపూర్, అక్టోబర్ 30 (జనం సాక్షి) :** కష్టాన్ని నమ్ముకుని పనిచేస్తున్న ప్రతి కార్మికునికి తాను అండగా ఉంటానని బి.ఆర్.టి.యు నాయకులు, శ్రమశక్తి అవార్డు గ్రహీత రవి సింగ్ అన్నారు. గురువారం జీడిమెట్ల పారిశ్రామిక వాడ లోని ప్యూర్ నేచురల్ వేర్వాస్ ఎగ్జిక్యూటివ్ పరిశ్రమలో గణేష్ అనే కార్మికులు కొన్ని సంవత్సరాలు పనిచేసే ఇటీవల పని మానేశాడు. అతనికి రావలసిన జీతం డబ్బులు 35 వేల రూపాయలు యాజమాన్యం ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేసింది. యాజమాన్యాన్ని అడిగి విసిగి వేసారిన గణేష్ కార్మిక నాయకుడు రవి సింగ్ ను ఆశ్రయించాడు. వెంటనే స్పందించిన ఆయన యాజమాన్యం తో చర్చించి ఆయన డబ్బు రావలసిన డబ్బులను ఇప్పించారు. ఈ సందర్భంగా రవి సింగ్ మాట్లాడుతూ కార్మికుల శ్రమను దోచుకునే ఎవరిని వదిలిపెట్టేది లేదన్నారు. కార్మికుల న్యాయమైన డిమాండ్ లను నెరవేర్చడానికి తాను శాయశక్తుల కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం కార్మికుడు గణేష్ మాట్లాడుతూ తనకు న్యాయం జరగడానికి కృషిచేసిన నాయకుడు రవి సింగ్ కు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అనిల్, సుదర్శన్, జగన్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## చేవెళ్లలో ఎస్ఎఫ్ఐ బంద్ విజయవంతం

**చేవెళ్ల, అక్టోబర్ 30 (జనంసాక్షి) :** ఎస్ఎఫ్ఐ చేవెళ్ల డివిజన్ అధ్యక్ష కార్యదర్శులు ఎర్రవల్లి శ్రీనివాస్, బేగరి అరుణ్ కుమార్ భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా చేవెళ్లలో జూనియర్, డిగ్రీ ప్రభుత్వ ప్రైవేటు కళాశాలలను బందు చేయించడం జరిగిందని అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థులకు స్కాలర్షిప్ ఫీజు రియంబర్స్మెంట్ చెల్లించకుండా కాలయాపన చేయడం సరైంది కాదన్నారు. గత కొన్ని రోజుల క్రితం పెండింగ్ బకాయిలను కొంతమేరకు చెల్లిస్తామని హామీ ఇచ్చిన ఇప్పటికీ చెల్లించకపోవడాన్ని నిరసిస్తూ తెలంగాణ వ్యాప్తంగా జూనియర్ డిగ్రీ ప్రొఫెషనల్ ఇంజనీరింగ్ బి.ఎడ్ తదితర విద్యాసంస్థలను ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో బందు నిర్వహించడం జరిగిందని అన్నారు. పెండింగ్లో ఉన్నటువంటి 8500 కోట్ల స్కాలర్షిప్స్ ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలను వెంటనే చెల్లించాలని లేనిపక్షంలో ఆందోళన పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ చేవెళ్ల మండల కార్యదర్శి మాల చందు, ఎస్ఎఫ్ఐ చేవెళ్ల డివిజన్ నాయకులు రిషి, ఆకాష్, విష్ణు, కైఫ్, వినయ్, లోకేష్, తదితరులు పాల్గొన్నారు.



## ఇల్లు కూలిపోయిన బాధితులకు అండగా ఉంటాం



**ఇబ్రహీంపట్నం, అక్టోబర్ 30 (జనం సాక్షి) :** గతకొన్ని రోజులుగా మోంతా తుఫాన్ వల్ల కురిసిన భారీ వర్షాల కారణంగా మంచాల మండలంలో ఇండ్లు కూలిపోయిన బాధితులను ఆదుకొని ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి సహకారంతో వారికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు అయ్యేలా కృషి చేస్తామని కాంగ్రెస్ పార్టీ రాష్ట్రనాయకులు కొంగర విష్ణువర్ధన్ రెడ్డి అన్నారు. గురువారం రోజున తుఫాన్ కారణంగా కూలిపోయిన ఆరుట్ల గ్రామానికి చెందిన గట్ల గణేష్ నూకం రమేష్, చిందం యాదయ్య, బొద్రమోని మల్లేష్, నూకం బన్ని, తదితరుల ఇండ్లను ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల వ్యాప్తంగా తుఫాను వల్ల ఇండ్లు కూలిపోగా వారికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇందిరమ్మ కమిటీ సభ్యులు బుట్టి కృష్ణ ,కంబాలపల్లి బుగ్గరాములు, మార లక్ష్మణ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు మార సురేష్, ఎన్నిదుల సురేష్, మానిపాటి వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

# 9వ షెడ్యూలే బీసీ రిజర్వేషన్లకు శ్రీరామరక్ష

- 42శాతం రిజర్వేషన్ సాధనకు బీసీ ఉద్యమ కార్యాచరణ
- నవంబర్ 10న కామారెడ్డిలో బహిరంగ సభ
- బీసీ ఉద్యమ కార్యాచరణ ప్రకటించిన ఐఏఎస్ రిటైర్డ్ చిరంజీవులు



**ఖైరతాబాద్, అక్టోబర్ 30 (జనంసాక్షి) :** 42 శాతం బీసీ రిజర్వేషన్ల సాధనకై, 9వ షెడ్యూల్లో చేర్చేంతవరకు 42శాతం బీసీ రిజర్వేషన్ల సాధన సమితి నిష్క్రమించదని బీసీ నాయకులు ప్రకటించారు. 9వ షెడ్యూల్లో చేర్చడమే ఏకైక మార్గమని అదే శ్రీరామరక్షాని, 42 శాతం రిజర్వేషన్లుకు అప్పుడే రాజ్యాంగ రక్షణ ఉంటుందని తెలిపారు. సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో బీసీ పొలిటికల్ ఫ్రంట్ చైర్మన్ బాలగోని బాలరాజ్ గౌడ్ అధ్యక్షతన నిర్వహించిన విలేకరుల సమావేశంలో 42% బీసీ రిజర్వేషన్ల సాధన సమితి అధ్యక్షులు రిటైర్డ్ ఐఏఎస్ అధికారి టి చిరంజీవులు 42% బీసీ రిజర్వేషన్లు సాధించేందుకు ఉద్యమ కార్యాచరణను ప్రకటించారు. నవంబర్ 3న మండల స్థాయి అధికారులకు, 4న జిల్లా కలెక్టర్లకు, అరుణ తెలంగాణ రాష్ట్ర ముఖ్య కార్యదర్శికి 42 శాతం రిజర్వేషన్లను తొమ్మిదవ షెడ్యూల్లో చేర్చాలని విజ్ఞాపన పత్రాలను సమర్పించడంతోపాటు నవంబర్ 10న కామారెడ్డిలో బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జస్టిస్ ఈశ్వరయ్య మాట్లాడుతూ సాంప్రదాయ బీసీ సంఘాలు 350లో పడ్డాయని విమర్శించారు. రాజకీయ పార్టీలకు కొమ్ముకాసే విధంగా తమ ఉద్యమ కార్యాచరణను మార్చుకుంటున్నాయని దుయ్యబట్టారు. వారికి రాజ్యాంగంపైన చట్టాలపైన తీర్పులపైన సమగ్రమైన అవగాహన లేదని విమర్శించారు. డాక్టర్ విశారదన్ మహరాజ్ మాట్లాడుతూ.. రాజకీయ పార్టీలు 42% బిసి రిజర్వేషన్లపై కపట వైఖరితో ఉన్నాయని, బీసీల రిజర్వేషన్ల సమస్య తెలంగాణ రాష్ట్ర సమస్య కాదా అని రాజకీయ పార్టీలను ప్రశ్నించారు. 42% బి సి రిజర్వేషన్ల సాధన సమితి చేస్తున్న పోరాటం నికార్సైన పోరాటమని, కాబట్టి రాజకీయ పార్టీలు కుట్రలు చేస్తున్నాయని పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీలకు చట్టబద్ధంగా అన్ని హక్కులు అధికారం దక్కుతున్నాయని ఇప్పుడు బీసీల కోసం బీసీలతో కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ దుర్గయ్య గౌడ్, జాతీయ నాయకులు ఆల్మెన్ రాజ్, బీసీ ఇంటలెక్చువల్స్ ఫోరం వ్యవస్థాపక సభ్యులు కేవీ గౌడ్, బైరు శేఖర్, రాఘవేంద్ర ముదిరాజ్, డాక్టర్ విజయ్ భాస్కర్, చెన్న శ్రీకాంత్, లింగేష్ యాదవ్, అవ్వారు వేణు తదితరులు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
శుక్రవారం
31 అక్టోబర్ 2025

# ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మత్తు పనిలో అసిస్టెంట్ లైన్‌మన్ మృతి

**• అధికారుల నిర్లక్ష్యమే కారణమని విద్యుత్ సంఘాల ఆందోళన**

**భువనగిరి, అక్టోబర్ 30 (జనం సాక్షి) :** యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరు మండలం పాలడుగు గ్రామంలో నిన్న రాత్రి కురిసిన వర్షాల కారణంగా ట్రాన్స్ఫార్మర్ కూలిపోయింది. దాన్ని తిరిగి ఏర్పాటు చేయడానికి వెళ్లిన అసిస్టెంట్ లైన్‌మన్ ఓర్సు నరేష్ ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందారు. ఈ ఘటన సమయంలో మండల అసిస్టెంట్ ఇంజనీర్ ప్రమాద స్థలంలోనే ఉన్నారని సమాచారం. ప్రమాదం సంభవించడానికి అధికారుల నిర్లక్ష్యమే కారణమని విద్యుత్ ఉద్యోగ సంఘాలు ఆరోపించాయి. దీనికి నిరసనగా విద్యుత్ ఉద్యోగ సంఘాలు జేఏసీగా ఏర్పడి భువనగిరి డివిజన్ ఆఫీసు ఎదుట ధర్నా నిర్వహించారు. సంఘ నాయకులు ఆవేదన వ్యక్తంచేశారు. సంఘ నాయకులు మాట్లాడుతూ టీజీ ఎస్పీడీసీఎల్ పరిధిలో మన యాదాద్రి జిల్లా అన్ని జిల్లాల కంటే ముందుగా బిల్లులు తీయడం, కలెక్షన్ పూర్తిచేయడం జరుగుతోంది. అయినప్పటికీ కింది స్థాయి కార్మికులపై అధికారులు అధిక ఒత్తిడి తెస్తున్నారు. ఈ ఒత్తిడి కారణంగానే కార్మికులు మానసిక వేదనకు గురై ప్రమాదాలకు గురవుతున్నారు. గత 30 ఏళ్లుగా విధులు నిర్వర్తిస్తున్నాం, పనులు ఎలా చేయాలో మాకు తెలుసు. కానీ అధికారులు అనవసర ఒత్తిడి పెంచడం వలన సరిగా విధులు



నిర్వహించలేకపోతున్నాం," అని వారు పేర్కొన్నారు. ఈ ధర్నా కార్యక్రమంలో తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్1104 అధ్యక్షులు పడిగం యాదగిరి, జిల్లా కార్యదర్శి అమర్నాథ్, విద్యుత్ బీసీ అసోసియేషన్ కంపెనీ కార్యదర్శి బొబ్బిలి మురళి, విద్యుత్ ఎస్సీ/ఎస్టీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు దొడ్డి యాదగిరి, రాజేష్, 327 యూనియన్ తరఫున కుసంగి శ్రీనివాస్, హెచ్ఎంటీ తరపున బొట్ల రమేష్, జోగు వెంకటేశం, మీర్జా షకీల్ బెగ్, టి. రమేష్ రెడ్డి, పి. సత్యనారాయణ, బాల్ నరసింహ, సిద్ధి లింగం, జి. బాబు గౌడ్, ఎస్. బాబురావు, ఎం.ఆర్. రవీందర్, విజయ్ కుమార్, శ్రీనివాస్, వెంకటేశ్వర, మహేష్, గోపాల్, భావా సింగ్, జంగయ్య, నందు, స్వరూప, స్వప్న, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా షెల్టర్ అపార్ట్మెంట్ సమస్యల పరిష్కారానికి కృషి

**శేరిలింగంపల్లి, అక్టోబర్ 30 (జనంసాక్షి) :** శేరిలింగంపల్లి నియోజకవర్గం మియాపూర్ డివిజన్ పరిధి ప్రజా షెల్టర్ అపార్ట్మెంట్స్ లో నెలకొన్న పలు సమస్యల పరిష్కారానికి నిజాయితీగా కృషి చేస్తానని డివిజన్ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ హామీని ఇచ్చారు. ఈ మేరకు ప్రజా షెల్టర్ అపార్ట్మెంట్స్ పరిధిలో చేపట్టవలసిన పలు అభివృద్ధి పనులనిమిత్తం జిహెచ్ఎంసి ఇంజనీరింగ్ విభాగం అధికారులు, అపార్ట్మెంట్స్ అసోసియేషన్ సభ్యులతో కలసి గురువారం ఉప్పలపాటి పార్కు పరిసర ప్రాంతాలను సందర్శించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ శ్రీకాంత్ మాట్లాడుతూ... మియాపూర్ డివిజన్ పరిధిలోని ప్రజాషల్టర్ అపార్ట్మెంట్స్ పరిధిలోగల పలు సమస్యలను, స్థానిక నాయకులు, అసోసియేషన్ సభ్యులతోకలిసి పరిశీలించడం జరిగిందని, వీలైనంత త్వరగా రాష్ట్ర ప్రజాపద్దుల కమిటీ చైర్మన్ అరికెపూడి గాంధీ సహకారంతో సంబంధిత అధికారులను సమన్వయం చేసుకొని వాటి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. అపార్ట్మెంట్స్ పరిధిలో తలెత్తినటువంటి డ్రైనేజీ, మంచినీటి కొరత సమస్యలను ప్రాధాన్యత క్రమంలో విడతల వారిగా పరిష్కరిస్తానని, పార్కు అభివృద్ధి పనులనుసైతం త్వరలోనే చేపట్టి పూర్తి చేయడం జరుగుతుందన్నారు. భూగర్భ డ్రైనేజీ, మంజీర మంచినీటి వసతులను మెరుగుపరుస్తామని, మియాపూర్ డివిజన్లో ప్రతి కాలనీలో చక్కటి ఆహ్లాదకరమైన వాతావరణం కలిపిస్తామని కార్పొరేటర్ ఆశాభావం



వ్యక్తం చేశారు. మియాపూర్ డివిజన్ ప్రజలకు అన్నివేళల్లో అందుబాటులో ఉండడం జరుగుతుందని, ఎలాంటి సమస్యలు ఏర్పడినా తమ దృష్టికి తీసుకురావాలని, మెరుగైన ప్రజా జీవనానికి అన్నిరకాల మౌలిక వసతుల కల్పనకు తనవంతు కృషిచేస్తానని శ్రీకాంత్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిహెచ్ఎంసి ఏఈ సంతోష్, వర్క్ ఇన్స్పెక్టర్లు నవీన్, అన్వర్, స్థానిక నాయకులు ప్రతాప్ రెడ్డి, నరేందర్ రెడ్డి, శివయ్య, కాసర్ల శ్రీనివాస్, గోపాల కృష్ణ, శివారెడ్డి, శంకర్, శివ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## రోడ్ల భద్రతకు జీహెచ్ఎంసీ కొత్త యాప్

**హైదరాబాద్, అక్టోబర్ 30 (జనం సాక్షి) :** నగర రోడ్ల భద్రత, మౌలిక వసతుల అభివృద్ధి దిశగా జీహెచ్ఎంసీ మరో కీలక అడుగు వేసింది. ఫీల్డ్ ఇంజనీర్లు ప్రత్యక్షంగా రోడ్ల పరిస్థితిని పరిశీలించి, సమాచారాన్ని తక్షణమే అప్‌డేట్ చేయడానికి ‘పీరియాడిక్ పబ్లిక్ సేఫ్టీ ఇన్‌స్పెక్షన్ యాప్’ను తీసుకువచ్చారు. ఈ మొబైల్ యాప్ ద్వారా ఇంజనీర్లు పోత్‌హోల్స్, ఓపెన్ మాన్‌హోల్స్, ప్రోట్రూడింగ్ బార్స్ / స్టోన్స్, ఫుట్‌పాత్‌లలో ఓపెన్ ఎలక్ట్రికల్ బాక్స్‌లు, సరిగా లేని బ్యారికేడింగ్ వంటి సమస్యలను గుర్తించి జియో ట్యాగ్ ఫోటోలతోపాటు తక్షణ నివేదికలను అప్‌లోడ్ చేయవచ్చు. ఈ యాప్‌తో రియల్‌టైమ్ ట్రాకింగ్, వేగవంతమైన తనిఖీలు, అలాగే పారదర్శక రిపోర్టింగ్ వ్యవస్థ ద్వారా బాధ్యతాయుతమైన మానిటరింగ్ సాధ్యమవుతుందని అధికారులు తెలిపారు.

## అదుపుతప్పి లోయలో పడ్డ బొలేరో వాహనం

**• ముగ్గురికి తీవ్ర గాయాలు**

**సదాశివపేట, అక్టోబర్ 30 (జనం సాక్షి) :** సదాశివపేట మండలంలోని సూరారం గ్రామ పరిధిలో జాతీయ రహదారిపై గురువారం సాయంత్రం చోటు చేసుకుంది. సదాశివపేట నుండి జహీరాబాద్ వైపు వెళ్తున్న బొలెరో వాహనం సూరారం వద్ద అదుపుతప్పి బ్రిడ్జి కిందకు దూసుకుపోయింది. ఈ ప్రమాదంలో టాటా ఏసీ వాహనంలో ప్రయాణిస్తున్న డ్రైవర్ సందీప్, మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన వారిని అంబులెన్స్ లో సంగారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రమాద సమాచారాన్ని తెలుసుకున్న సీఐ వెంకటేష్ ఘటన స్థలానికి చేరుకొని పరిస్థితిని పరిశీలించారు. వాహనం పూర్తిగా ధ్వంసం అయిందని, డ్రైవర్ నిర్లక్ష్యం, అతివేగమే ప్రమాదానికి కారణమై ఉండవచ్చని తెలిపారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## పోలీస్ అమరవీరులను స్మరిస్తూ క్యాండిల్ ర్యాలీ



**హయత్‌నగర్, అక్టోబర్ 30 (జనం సాక్షి) :** హయత్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాలలో భాగంగా హయాత్ నగర్ ఎస్‌హెచ్ఓ నాగరాజు గౌడ్ ఆధ్వర్యం లో క్యాండిల్ ర్యాలీ ని హయత్ నగర్ పోలీస్ స్టేషన్ నుండి రాఘవేంద్ర హోటల్ వరకు మరల హయాత్ నగర్ పోలీస్ స్టేషన్ వరకు నిర్వహించారు. విధి నిర్వహణలో ప్రాణాలను అర్పించిన పోలీస్ అమర వీరులను స్మరించుకుంటూ, వారికి జోహార్లు అర్పించారు. ఈ కార్యక్రమంలో సబ్ ఇన్స్పెక్టర్స్ వెంకట్ రెడ్డి, అరుణ్ కుమార్, పోలీసు సిబ్బంది, సామిడి శేఖర్ రెడ్డి, యువకులు, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

## భారత్ పెట్రోల్ బంక్'లో కల్తీ పెట్రోలు..!



**చింతపల్లి, అక్టోబర్ 30 (జనం సాక్షి) :** చింతపల్లి మండల కేంద్రంలోని హైదరాబాద్ నాగార్జునసాగర్ హైవే పక్కన ఉన్న భారత్ పెట్రోల్ బంక్‌లో పెట్రోల్ కల్తీ చేసి విక్రయిస్తున్నారని నూనె జగన్ గురువారం ఆందోళన చేశారు. ఓ బాటిల్‌లో పెట్రోల్ పోయించుకోగా పెట్రోల్ తెల్లగా ఉండడంతో ఆ బంక్ లో పెట్రోల్ పోసే వ్యక్తితో వాగ్వివాదం దిగాడు. నూనె జగన్ మాట్లాడుతూ పెట్రోల్ బంక్ లో పలుమార్లు కల్తీ డీజిల్, కల్తీ పెట్రోల్ వస్తుందని వినియోగదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. బంకుల్లో నిర్వహణ సక్రమంగా లేకపోవడం వల్ల, సిబ్బందిపై పర్యవేక్షణ లేకపోవడం వల్ల ఇష్టానుసారంగా వ్యవహరించడం జరుగుతుందని అన్నారు.

# తుఫాన్ వల్ల నష్టపోయిన రైతులను ఆదుకోవాలి



**ఉప్పునుంతల, అక్టోబర్ 30 (జనం సాక్షి) :** గత రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న మెంత తుఫాన్ ప్రభావంతో నష్టపోయిన రైతులను ఆదుకోవాలని, భారీ వర్షం రావడంతో చేతికొచ్చే పంట నీళ్ల పాలయిందని, రెవిన్యూ వ్యవసాయ అధికారులచే నష్టపోయిన రైతుల పొలాలను సందర్శించి అంచనా వేసి వారిన ఆదుకునే విధంగా చర్యలు చేపట్టాలని సిపిఎం ఆధ్వర్యంలో మండల తహసిల్దార్‌కి వినతి పత్రం గురువారం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి చింతల నాగరాజు మాట్లాడుతూ మండలంలో తుఫాన్ ప్రభావంతో నష్టపోయిన రైతులను ఆదుకోవాలని, రైతులకు పంట నష్టపరిహారం ఎకరాకు 30వేల రూపాయలు అందజేయాలని సిపిఎం ఆధ్వర్యంలో మండల తహసిల్దార్ వినతి పత్రం అందజేయడం జరిగింది అని అన్నారు. అధికారులచే నష్టపోయిన రైతుల పొలాలను సందర్శించి అంచనా వేసి వారి నాదుకునే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. రైతులు వేసుకున్న పంటలు పత్తి మొక్కజొన్న వరి ఇతర పంటలు తీవ్రంగా దెబ్బ తినడంతో ఆరుగాలం కష్టం చేసి కోతలు కోసేవేళ భారీ వర్షం రావడం వల్ల పంటలన్నీ దెబ్బతిని రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారని అలాంటి రైతులను ప్రభుత్వము ఆదుకోవాలని సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు గొడుగు చంద్రయ్య, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

# ముంపు ప్రాంతాలను పరిశీలించిన ఎమ్మెల్యే బాలు నాయక్

**కొండమల్లేపల్లి, అక్టోబర్ 30 (జనంసాక్షి) :** మెంతా తుఫాను ప్రభావంతో ముంపునకు గురైన బాధితులను ఆదుకుంటామని ఎమ్మెల్యే బాలు నాయక్ అన్నారు. గురువారం కొండమల్లేపల్లి పట్టణంతో పాటు పరిసర ప్రాంత గ్రామాలను పరిశీలించి ముంపునకు గురయిన బాధితులను అధికారులతో కలిసి పరామర్శించారు. భారీ వర్షాలతో నీట మునిగిన ముంపు ప్రాంతాలు భవిష్యత్తులో మళ్లీ ముంపునకు గురికాకుండా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. భారీ వర్షాలతో ముంపు కారణంగా దెబ్బతిన్న రోడ్లు, కల్వర్టులు, వంతెనలు గుర్తించి శాశ్వత పరిష్కార మార్గాలను రూపొందించాలని అధికారులకు సూచించారు. గ్రామాలలో విద్యుత్ సరఫరా ఎక్కడా నిలిచిపోకుండా విద్యుత్ శాఖ అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. వ్యవసాయ పంటలకు జరిగిన నష్టాన్ని అంచనా వేసి రైతులకు తగిన పరిహారం అందించేలా చర్యలు చేపట్టాలని అధికారులకు తెలిపారు. ప్రజలకు



కావాల్సిన మౌలిక అవసరాలను గుర్తించి వారికి తక్షణ సహాయం అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. వారివెంట ఆర్డిఓ రమణా రెడ్డి, రెవెన్యూ, నీటిపారుదల, విద్యుత్, గ్రామపంచాయతీ అధికారులు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## సీఎస్ఆర్ నిధుల వినియోగంలో ముష్కిన్ చెరువు నమూనా కావాలి

**• హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్**



**హైదరాబాద్, అక్టోబర్ 30 (జనంసాక్షి) :** సీఎస్ఆర్ నిధులతో చెరువులు అభివృద్ధి చేస్తున్న పలు సంస్థలకు ముష్కిన్ చెరువు ఒక నమూనా కావాలని తత్వ డెవలపర్స్‌కు హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ సూచించారు. నార్సింగి మండలంలోని ఈ చెరువు అభివృద్ధిని తత్వ డెవలపర్స్ అనే సంస్థ సీఎస్ ఆర్ నిధుల(సామాజిక బాధ్యత)తో అభివృద్ధి చేస్తోంది. గతంలో చెరువు హద్దులను పూర్తిస్థాయిలో మార్కింగ్ చేసి ఇవ్వక పోవడంతో అభివృద్ధి జాప్యం అయ్యిందని సంస్థ ప్రతినిధులు కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు. దాదాపు 60 ఎకరాల పరిధిలోని ప్రభుత్వ భూముల సర్వే పూర్తి చేసి, అనధికార ఆక్రమణలను తొలగించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. చెరువు పరిసర కాలనీల నివాసితులు, దేవాలయ కమిటీ సభ్యులు, రైతులు, ఇరిగేషన్ శాఖ అధికారులు చెరువు అభివృద్ధిని చేపట్టిన తత్వా డెవలపర్స్ ప్రతినిధులతో సమావేశం ఏర్పాటు చేసి కమిషనర్ చర్చించారు. ఎఫ్‌టీఎల్ పరిధిలోకి వచ్చిన రైతులకు టీడీఆర్ (ట్రాన్సఫర్‌బుల్ డెవలప్‌మెంట్ రైట్స్) కింద నష్టపరిహారం అందేలా చూస్తామన్నారు. చెరువులోకి వరద నీరు వచ్చి చేరడంతో పాటు.. ఔట్‌లెట్ కూడా సరిగా ఉండేలా చూడాలన్నారు. చెరువు చుట్టూ పటిష్టమైన బండ్ నిర్మించి.. మొక్కలు నాటి.. ఆహ్లాదకరమైన వాతావరణం ఉండేలా తత్వ సంస్థ అభివృద్ధి పనులు చేపట్టాలని సూచించారు.

## దేశ ఐక్యత కోసం రన్ ఫర్ యూనిటీ

**• పౌరులు విద్యార్థులు యువత పాల్గొని విజయవంతం చేయాలి**

**• ఎస్పీ కె.నరసింహ**



**సూర్యాపేట ప్రతినిధి, అక్టోబర్ 30 (జనంసాక్షి) :** నేడు ఉక్కుమనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి పురస్కరించుకుని నిర్వహిస్తున్న జాతీయ ఐక్యత దినోత్సవం సందర్భంగా నేటి ఉదయం 6 గంటలకు ఎస్పీ ఇంజనీరింగ్ కాలేజ్ చౌరస్తా నుండి మినీ ట్యాంక్ బండ్ వరకు జిల్లా కేంద్రంలో జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో ఐక్యత కోసం పరుగు రన్ ఫర్ యూనిటీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ఎస్పీ నరసింహ తెలిపారు. జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీస్ స్టేషన్ లో పరిధిలో ఈ రన్ ఫర్ యూనిటీ కార్యక్రమం సంబంధిత పోలీసుల ఆధ్వర్యంలో నిర్వహించడం జరుగుతుందన్నారు. స్థానిక పౌరులు, యువత అధిక సంఖ్యలో పాల్గొని జాతి ఐకమత్యం చాటాలని కోరారు. ఈ కార్యక్రమం ద్వారా సర్దార్ వల్లభాయ్ పటేల్ సేవలను స్మరించుకోవడంతో పాటు, దేశీయ ఐక్యతకు అంకితభావాన్ని వ్యక్తపరచే అవకాశం కలుగుతుందన్నారు. అందరూ పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా పోలీస్ శాఖ తరుపున విజ్ఞప్తి చేశారు.

## చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి



**వీపనగండ్ల, అక్టోబర్ 31 (జనం సాక్షి) :** వీపనగండ్ల మండల కేంద్రంలో గురువారం మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి నాయకులు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మీసాల నాగరాజు మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు నవంబర్ 1న హైదరాబాదులో నిర్వహించే దళిత ఆత్మగౌరవ ప్రదర్శన ర్యాలీని జయప్రదం చేయాలని అన్నారు. చలో హైదరాబాద్ కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మీసాల రాజశేఖర్, పాము నాగులు,దయ్యాపు రవివర్మ,బండారి విస్తు,పాము భరత్,బండారి విజయ్ గడ్డమిది కర్ణాకర్ తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు ఇబ్బంది లేకుండా ధాన్యం తూకం వేయాలి



**మెదక్, అక్టోబర్ 30 (జనం సాక్షి) :** రైతులకు ఇబ్బంది లేకుండా ధాన్యం తూకం వేయాలని జిల్లా వ్యవసాయ అధికారి దేవ్ కుమార్ సూచించారు. రెండు రోజుల పాటు కురిసిన అకాల వర్షానికి కళ్ళాల్లో తడిసిన వరి ధాన్యం కుప్పలను జిల్లా వ్యవసాయ అధికారి దేవ్ కుమార్ గురువారం పరిశీలించారు. మండలంలోని రంగంపేట ప్రాథమిక సహకార సంఘం ఆవరణలో రైతులు నిలువచేసిన ధాన్యం కుప్పలను పరిశీలించి తేమ శాతం కొలిచే పరికరాన్ని పరిశీలించారు. అనంతరం ఫర్టిలైజర్ దుకాణాలను తనిఖీ చేసి స్టాక్ రిజిస్టర్ లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో మాట్లాడారు. మరో రెండు రోజుల పాటు వర్షాలు కురిసే సూచనలు ఉన్నాయని, రైతులు జాగ్రత్తగా ఉండాలన్నారు. తూకం వేసిన బస్తాలు, ధాన్యం రాశులపై పాలిథీన్ కాగితాలను కప్పుకోవాలని సూచించారు. మండల వ్యవసాయ అధికారి స్వేతాకుమారి, సహకార సంఘం సిబ్బంది ఉన్నారు.

## అమరవీరుల త్యాగాలు మరువలేనివి



**జడ్చర్ల, అక్టోబర్ 30 (జనంసాక్షి) :** పోలీసు అమరవీరుల త్యాగం చిరస్మరణీయమని మహబూబ్ నగర్ డిఎస్పి వెంకటేశ్వర్లు అన్నారు. పోలీసు అమరవీరుల దినోత్సవ వారోత్సవాలలో భాగంగా గురువారం జడ్చర్ల పోలీస్ స్టేషన్ ఆవరణలో పోలీసు అమరులను స్మరిస్తూ రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. జిల్లా ఇండియన్ రెడ్ క్రాస్, జిల్లా పోలీసుల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని డిఎస్పి వెంకటేశ్వర్లు ప్రారంభించారు. శిబిరంలో 54 మంది దాతలు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా డిఎస్పి మాట్లాడుతూ విధి నిర్వహణలో ఎంతోమంది పోలీసులు అమరులయ్యారని వారి బలిదానం దేశానికే గర్వకారణం అని కొనియాడారు. పోలీస్ అమరవీరుల వారోత్సవాల సందర్భంగా రక్తదాన శిబిరం నిర్వహించడం అభినందనీయం అన్నారు. కార్యక్రమంలో పట్టణ సీఐ కమలాకర్, ఎస్సైలు, జిల్లా ఇండియన్ రెడ్ క్రాస్ చైర్మన్ లయన్ నటరాజ్, మహబూబ్ నగర్ ఎంసి క్లబ్ మెంబర్ ధ్రువ, కాల్వ రామిరెడ్డి, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఉప్పరపల్లి గ్రామాన్ని సందర్శించిన ఎమ్మెల్యే

**చింతపల్లి, అక్టోబర్ 30 (జనం సాక్షి) :** చింతపల్లి మండలంలోని ఉప్పరపల్లి గ్రామాన్ని దేవరకొండ శాసనసభ్యులు నేనావత్ బాలునాయక్ ప్రత్యక్షంగా సందర్శించారు. ముంపు ప్రాంతాలను జిల్లా అధికారులతో కలిసి పర్యటించి, ప్రజలతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. గ్రామంలోని రోడ్లు తీవ్రంగా దెబ్బతినడంతో రాకపోకలు అంతరాయం కలిగిన విషయాన్ని గమనించిన ఎమ్మెల్యే బాలునాయక్ తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.. ఆయన మాట్లాడుతూ ఉప్పరపల్లి గ్రామానికి నాలువైపులా రోడ్లు దెబ్బతినడంతో గ్రామ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. భవిష్యత్తులో ఇలాంటి పరిస్థితులు పునరావృతం కాకుండా రూ. 6 కోట్ల రూపాయల వ్యయంతో హై లెవల్ బ్రిడ్జి నిర్మాణం చేపడతామని హామీ ఇచ్చారు. అదేవిధంగా రోడ్లు మరియు భవనాల శాఖ అధికారులతో సమన్వయం చేసి గ్రామానికి కావాల్సిన డాంబర్ రోడ్డు పనులు త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. అదేవిధంగా నాంపల్లికి వెళ్ళే దారిలో లో లెవల్ కల్వర్ట్ నిర్మాణానికి కూడా తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. గ్రామ ప్రజలు,



ముఖ్యంగా రైతులు, ఇలాంటి విపత్తు పరిస్థితుల్లో జాగ్రత్తగా ఉండాలని, పంట పొలాల్లో నీటి ముప్పు లేకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు... ఈ కార్యక్రమంలో మాల్ మార్కెట్ కమిటీ చైర్మన్ అలివేలు సంజీవరెడ్డి, దేవరకొండ మార్కెట్ కమిటీ చైర్మన్ నాయిని జమునా మాధవరెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ముక్కమల్ల వెంకటయ్య గౌడ్, ఆర్డీవో రమణా రెడ్డి, ఎంపీడీవో సుజాత, ఎమ్మార్వో రమాకాంత్ శర్మ తదితర అధికారులు , కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## వృద్ధులను గౌరవించాలి

**• జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.సౌజన్య**

**సంగారెడ్డి, అక్టోబర్ 30 (జనం సాక్షి) :** వృద్ధులను గౌరవించడం అందరి బాధ్యత అని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి. సౌజన్య అన్నారు. గురువారం జాతీయ న్యాయ సేవాధికార సంస్థ మరియు రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ మరియు జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. భవానిచంద్ర ఆదేశాల ప్రకారం అమీనాపూర్ లోని ది నెస్ట్ వృద్ధాశ్రమన్ని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి. సౌజన్య తనికి నిర్వహచారు. ఈ తనిఖీలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి. సౌజన్య మాట్లాడుతూ వృద్ధుల పట్ల చిన్న చూపు చూడకుండా వాళ్ళ బాగోగులు చూసుకుంటూ వారిని గౌరవంగా చూడాలి అన్నారు. న్యాయ పరమైన విషయాలలో ఉచిత న్యాయ సహాయం అందిస్తామని ఏదైనా న్యాయ సహాయం కోరినచో న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయం, సంగారెడ్డిని సంప్రదించాలని సూచించారు. అనంతరం ఆశ్రమంలో వృద్ధులకు



వడ్డించే వంటలను పరిశీలించారు. ఈ తనిఖీలో వృద్ధులు, ది నెస్ట్ వృద్ధాశ్రమమం అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# లబ్ధిదారులను బెదిరిస్తే ఊరుకునేది లేదు

- ఇందిరమ్మ ఇండ్ల గుత్తేదారిపై కఠిన చర్యలు
- జిల్లా కలెక్టర్ రాజార్షి షా



**ఆదిలాబాద్ ప్రతినిధి (జనంసాక్షి) :** ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులను బెదిరిస్తే ఊరుకునేది లేదని జిల్లా కలెక్టర్ హెచ్చరించారు. సోనాల మండలం కౌఠ గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం సందర్భంగా లబ్ధిదారుడిపై దాష్టీకం చేసిన గుత్తేదారు విషయంలో కఠిన చర్యలు తీసుకున్నట్లు జిల్లా కలెక్టర్ రాజార్షి షా ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఘటనపై బోథ్ పోలీసు స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ నం.201/2025 నమోదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. గుత్తేదారు ప్రవర్తనను తీవ్రంగా పరిగణించి, అతన్ని ఇందిరమ్మ హౌసింగ్ పనుల నుండి తొలగించి బ్లాక్‌లిస్ట్ చేసినట్లు కలెక్టర్ వెల్లడించారు. సదరు గుత్తేదారు చేపట్టిన ఇళ్ల నిర్మాణాన్ని నిలిపివేసి, లబ్ధిదారుల ఇళ్లు ఇతర మేస్త్రీల ద్వారా పూర్తి చేయడానికి చర్యలు ప్రారంభించినట్లు తెలిపారు. గుత్తేదారులు, మేస్త్రీలు ఎవరైనా లబ్ధిదారులపై దాష్టీకం లేదా దుర్వినియోగం చేస్తే, భవిష్యత్తులో కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో నాణ్యతకు ప్రాధాన్యత ఇవ్వాలని, సరఫరాదారులు, మేస్త్రీలు రిజినబుల్ చార్జీలు తీసుకోవాలని సూచించారు. ఇండ్ల నిర్మాణంలో లబ్ధిదారులకు ఏవైనా సమస్యలు, సందేహాలు ఉన్నట్లయితే మండల తహసీల్దార్, ఎం.పి.డీ.ఓ., ఏ.ఈ. (హౌసింగ్)లను వెంటనే సంప్రదించాలని కలెక్టర్ సూచించారు.జిల్లాలో లబ్ధిదారుల పట్ల ఎవరైనా బెదిరింపులు, దుర్వినియోగం లేదా దాష్టీకం చేస్తే చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు.

# జలదిగ్బంధంలో హనుమకొండ

- వరద ముంపు ప్రాంతాలను క్షేత్రస్థాయిలో పరిశీలించిన కలెక్టర్ స్నేహ శబరీష్
- తక్షణ సహాయక చర్యలకు అధికారులను ఆదేశించిన కలెక్టర్..



**హనుమకొండ ప్రతినిధి, అక్టోబర్ 30 (జనంసాక్షి) :** భారీ వర్షం కారణంగా వరద ఉధృతి పెరగడంతో హనుమకొండ నగరంలోని పలు కాలనీలు జలమయం కాగా హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ గురువారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వరద ప్రభావిత ప్రాంతాలలో సహాయక చర్యలను గురించి విధుల్లో ఉన్న అధికారులతో ఆయా కాలనీల పరిస్థితులను కలెక్టర్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. వరద తీవ్రత అధికంగా ఉన్న కాలనీల్లో తాజా స్థితిగతులను అడిగి తెలుసుకుని రెవెన్యూ, పోలీస్, ఎస్డీఆర్ఎఫ్, ఎన్డీఆర్ఎఫ్, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ డీఆర్ఎఫ్ బృందాలు అందిస్తున్న సహాయక చర్యలను పరిశీలించారు. గోపాలపూర్ ఊర చెరువు తో పాటు ప్రగతి నగర్, వివేక్ నగర్, అమరావతి నగర్, 100 ఫీట్ల రోడ్డు, సమ్మయ్య నగర్ ప్రాంతాలను కలెక్టర్ సందర్శించి అక్కడి పరిస్థితిని పరిశీలించారు. ఆయా ప్రాంతాలలోని కాలనీలు వరద నీటిలో చిక్కుకోగా కలెక్టర్ అధికారులతో కలిసి పరిశీలించి తక్షణ సహాయక చర్యలకు ఆదేశించారు. అక్కడనుండి హంటర్ రోడ్డులోని మెడికవర్ హాస్పిటల్ ప్రాంతంలో నివసిస్తున్న ఒక కుటుంబం వరదలో తీవ్ర ఇబ్బందులు పడుతున్న సమాచారం రావడంతో కలెక్టర్ క్షేత్రస్థాయిలో ఆ ప్రదేశానికి వెళ్లి బాధిత కుటుంబాన్ని సహాయక చర్యల్లో పాల్గొంటున్న డీఆర్ఎఫ్ సిబ్బంది సహాయంతో బోటులో బయటకు తీసుకువచ్చి పునరావాస కేంద్రానికి ఆ కుటుంబాన్ని తరలించారు. సీఎస్ఆర్ గార్డెన్ సమీపంలో వరద ముంపు తీవ్రంగా ఉండడంతో అక్కడ ఉన్న తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలికల డిగ్రీ కళాశాలకు చెందిన 470 మంది విద్యార్థినులను సురక్షితంగా బయటకు తీసుకురావాలని జిల్లా కలెక్టర్ ఆదేశించగా డిఆర్ఎఫ్ సిబ్బంది లైఫ్ బోట్ల ద్వారా హాస్టల్ నుండి బయటకు తీసుకువచ్చి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బస్సుల ద్వారా హసన్ పర్తి లోని డిగ్రీ కళాశాలకు, సుబ్బయ్య పల్లి లోని కళాశాలకు, మడికొండలోని బాలికల కళాశాలకు తరలించారు. విద్యార్థినులను అధికారులు, సహాయక బృందాలు సురక్షితంగా తరలిస్తుండగా కలెక్టర్ అక్కడే ఉండి సహాయక చర్యలను పర్యవేక్షించారు. హనుమకొండలోని అలంకార్ జంక్షన్ తో పాటు కాపు వాడలో వరద ముంపు గురైన కాలనీలను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భారీ వర్షాల కారణంగా వరద ముంపు గురైన కాలనీలో ప్రజలు ఇబ్బందులు పడకుండా తక్షణ సహాయక చర్యలను అధికారులు సమన్వయంతో పూర్తి చేయాలన్నారు. వరద నీటి వల్ల ముంపునకు గురైన ప్రాంతాల నుంచి ప్రజలను సురక్షితంగా పునరావాస కేంద్రాలకు తరలించాలని అధికారులను ఆదేశించారు. వివిధ శాఖల అధికారులు వరద ప్రభావ పరిస్థితులపై పర్యవేక్షణ చేయాలన్నారు. ఈ సందర్భంగా హనుమకొండ, కాజీపేట తహసీల్దార్లు రవీందర్ రెడ్డి, భావు సింగ్, సూపరింటెండెంట్ జగత్ సింగ్, కిరణ్ కుమార్, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ సీఎంహెచ్వో డాక్టర్ రాజారెడ్డి, డిప్యూటీ తహసిల్దార్ శ్యాం కుమార్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# తేమ పోవాలంటే ఆరబెట్టాలా?

- రైతుకు తప్పని తేమ కష్టాలు
- మార్కెట్ యార్డులో పత్తిని ఆరబెడుతున్న రైతులు



**ఆదిలాబాద్ ప్రతినిధి (జనంసాక్షి) :** జిల్లా రైతులకు ఇప్పుడు పత్తికి తేమ పొంచి ఉండడం కలవర పెడుతోంది. పత్తిని అమ్ముకుందామని రైతులు జిల్లా కేంద్రంలోని మార్కెట్ యార్డుకు తీసుకువస్తే ఇక్కడ మార్కెట్ లో తేమ శాతం కొర్రీలు పెడుతుండడంతో రైతులు తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుంది. పత్తిని తూకం వేసే సమయంలో తేమ శాతం ఎక్కువగా చూపిస్తుండడం కారణంగా రైతులకు ఏమి చేయాలి పాలు పోవడం లేదు. 12% తేమ విధానం పట్ల తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. దీంతో తేమను పోగొట్టడానికి రైతులు అష్ట కష్టాలు పడాల్సి వస్తుంది. అమ్ము కోవడానికి తెచ్చిన పత్తిని రెండు మూడు రోజుల నుంచి ఇలా మార్కెట్ యార్డులో ఆరబెడుతూ ఇబ్బంది పడుతున్న దృశ్యాలు కనిపిస్తున్నాయి. మరో వైపు రెండు రోజులనుంచి జిల్లాపై మొంత తూఫాను కారణంగా వర్షాలు కురుస్తుండటం కారణంగా దీని ప్రభావం పత్తిపై పెను ప్రభావం చూపే అవకాశం ఉంది. దీంతో ఇప్పుడు రైతులకు పత్తిని అమ్ముకోవాలంటే తేమ శాతం భయపెడుతుంది.

# పందుల బెడద నుండి కాపాడాలి



- నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించాలి
- అటవీ శాఖ కార్యాలయం ముందు రైతుల ధర్నా..!

**కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా బ్యూరో అక్టోబర్ 30 (జనం సాక్షి) :** అటవీ సమీప గ్రామాల్లో పంటలకు పందుల వల్ల నష్టం జరిగిందని, వాటి వల్ల తమ పంటలు నష్టపోతున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు గురువారం కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కాగజ్ నగర్ అటవీశాఖ డివిజనల్ కార్యాలయం ముందు రైతులు ఆందోళన చేశారు. కాగజ్ నగర్ అటవీ శాఖ రేంజ్ పరిధిలోని కోసిని, ఊటుపల్లి, రేగులగూడ, దరిగాం, వన్జిరి తదితర గ్రామాలకు చెందిన రైతులు అటవీశాఖ కార్యం ముందు ఆందోళన చేపట్టారు. అడవి పందుల వల్ల తమ చేతికి వచ్చిన పత్తి పంట, వరి పంటలు , కూరగాయల పంటలు పూర్తిగా నష్ట పోతున్నాయని అని వారు తెలిపారు. దీంతో అటవీశాఖ ఎఫ్డిఓ సుశాంత్ వారికి హామీ ఇచ్చారు. పంటను నష్టపోయిన రైతులకు సంబంధించిన భూముల వివరాలు సర్వే చేయించి నష్టపరిహారం చెల్లిస్తామని రైతులకు హామీ ఇచ్చారు. అలాగే రైతులు పంటలక్షణకు సోలార్ విద్యుత్ ఫెన్సింగ్ వైర్లను ఏర్పాటు చేసుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో భారత రాష్ట్ర సమితి నాయకులు లెండ్ గురె శ్యామ్ రావు, మాజీ సర్పంచ్ శ్రీనివాస్ గౌడ్ ,రైతుల పాల్గొన్నారు

# నది పరీవాహక ప్రాంతాలకు ఎవరూ వెళ్లొద్దు

- జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్



**నిర్మల్ బ్యూరో, అక్టోబర్30 (జనంసాక్షి) :** జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా కడెం, స్వర్ణ ప్రాజెక్టుల పరిసరాలకు ఎవరూ వెళ్లరాదని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నదీ పరివాహక ప్రాంతాలు, వాగులు, లోతట్టు ప్రదేశాలకు ఎవరూ వెళ్లవద్దని, ముఖ్యంగా పశువుల కాపరులు తమ పశువులను నది-వాగుల దారుల్లోకి తీసుకెళ్లకూడదని కలెక్టర్ సూచించారు. ప్రజల ప్రాణాలు, ఆస్తులు రక్షణలో భాగంగా అందరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వరద నీటితో కడెం, గడ్డెన్న, స్వర్ణ ప్రాజెక్ట్ గేట్లు ఎత్తనున్న నేపథ్యంలో దిగువ గ్రామాల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని స్పష్టం చేశారు. నదీ పరివాహక ప్రాంతాల్లోకి చేపలు పట్టేవారు, రైతులు, ఇతరులు వెళ్లకూడదని హెచ్చరించారు. జిల్లా యంత్రాంగం 24 గంటలు అప్రమత్తంగా ఉందని, ఎన్ డి ఆర్ ఎఫ్ టీంలు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తినా వెంటనే కలెక్టరేట్ కంట్రోల్ రూమ్ నంబర్ 91005 77132 ను సంప్రదించవచ్చని కలెక్టర్ పేర్కొన్నారు.

# రక్తదానం ప్రాణదానంతో సమానం

- ములుగు జిల్లా ఎస్పీ డా. శబరీష్ పి.
- పోలీస్ అమరవీరుల త్యాగాలకు నివాళిగా మెగా రక్తదాన శిబిరం



**ములుగు బ్యూరో,అక్టోబర్30(జనం సాక్షి):** పోలీస్ అమరవీరుల సంస్మరణ సందర్భంగా ములుగు జిల్లా ఎస్పీ డా. శబరీష్ పి ఆదేశాల మేరకు గురువారం రోజున ములుగు డిఎల్ఆర్ ఫంక్షన్ హాల్‌లో ములుగు జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించబడింది. జిల్లా ఎస్పీ డా.శబరీష్ పి ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై,శిబిరాన్ని ప్రారంభించి రక్తదానం చేసిన వారికి ప్రశంస పత్రాలను అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా ఎస్పీ గారు మాట్లాడుతూ రక్తదానం అనేది ప్రాణదానంతో సమానమని, ప్రాణాపాయ స్థితిలో ఉన్నవారి ప్రాణాలను రక్షించడంలో రక్తదానం కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. పోలీస్ అమరవీరుల స్మరణోత్సవాల సందర్భంగా యువత, ప్రజలు, ఆటో డ్రైవర్లు, పోలీసు సిబ్బంది ఇలా సుమారు 500 మంది స్వచ్ఛందంగా రక్తదానంలో పాల్గొనడం అభినందనీయమనీ అన్నారు. విధి నిర్వర్తనలో ప్రాణత్యాగం చేసిన పోలీస్ అమరవీరుల త్యాగాలను సమాజం ఎప్పటికీ మరవదని, వారి స్మృతికి గుర్తుగా ప్రతి సంవత్సరం పోలీస్ ఫ్లాగ్ డే నిర్వహిస్తామని పేర్కొన్నారు. పోలీసులు కేవలం శాంతి భద్రతల పరిరక్షకులే కాకుండా, సేవా కార్యక్రమా ల్లోనూ ముందుంటారని తెలిపారు. రక్తదానంపై ఉన్న అపోహలను నమ్మకుండా ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు. రక్తదానం వలన ప్రమాదాలు, అత్యవసర పరిస్థితులు లేదా తలసేమియా వంటి వ్యాధులతో బాధపడుతున్న వారికి ప్రాణ రక్షణ లభిస్తుం దని తెలిపారు.ఈ రక్తదాన శిబిరంలో దాదాపు 180 యూనిట్ల రక్తం సేకరించ బడింది. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ శివం ఉపాధ్యాయ,ములుగు డీఎస్పీ రవీం దర్, సీఐలు దయాకర్,సురేష్, ఆర్ఐలు స్వామి, సంతోష్, వెంకటనారాయణ, ఎస్ఐలు,ములుగు జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ చంద్రశేఖర్, డాక్టర్ అనుష,ఆసుపత్రి సిబ్బంది, వరంగల్, ములుగు జిల్లా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులు, లయన్స్ క్లబ్ సభ్యులు, ప్రజలు పోలీసులు పాల్గొన్నారు.

# విద్యా విధానాల్లో నాణ్యత పెరగాలి

జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని విద్యా విధానాల్లో నాణ్యత పెంపుకు విద్యాశాఖాధికారులు, ఉపాధ్యాయులు మరింత కృషి చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. గురువారం కలెక్టర్ చాంబర్ లో మధ్యాహ్న భోజనం, ఆధార్ నమోదు, విద్యార్థులు, ఉపాధ్యాయులు ముఖ గుర్తింపు హాజరు, విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు, ఆహార నాణ్యత తనిఖీలు, పిఎం శ్రీ పనుల పురోగతి, భవిత తదిరత కార్యక్రమాలపై విద్యాశాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు, మౌలిక సదుపాయాలు, హాజరు, మధ్యాహ్న భోజన పథక అమలు, డిజిటల్ విద్య, ఫలితాల విశ్లేషణ వంటి అంశాలపై అధికారులు సమగ్ర నివేదిక ఇవ్వాలన్నారు. ఎంఈఓలు, ప్రధానోపాధ్యాయులు క్రమం తప్పక పాఠశాలలు తనిఖీ చేయాలని అట్టి అంశాలపై నివేదికలు పోర్టల్ లో నమోదు చేయాలని తెలిపారు. యూ డైస్ నివేదిక ప్రకారం 26 బాలురు, 13 బాలికల పాఠశాలల్లో మరుగుదొడ్లు లేవని, అలాగే 24 బాలురు,14 బాలికల పాఠశాలల్లో మరుగుదొడ్లు ఉపయోగకరంగా లేవని ప్రతిపాదనలు ఇవ్వాలని సూచించారు. ఇట్టి పాఠశాలలకు ప్రతిపాదనలు ఇవ్వాలని గత సమావేశంలో చెప్పానని ఇంతవరకు ఎందుకు ఇవ్వలేదని అసంతృప్తి వ్యక్తం చేస్తూ రెండు రోజుల్లో నివేదికలు ఇవ్వాలని ఈడబ్ల్యూఐడిఓసి ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. విద్యార్థుల హాజరును రోజువారీగా పర్యవేక్షించాలన్నారు. ప్రాథమిక స్థాయి నుంచే పిల్లల్లో చదువుపై ఆసక్తి పెంచేలా టీచర్లు ప్రత్యేక పాఠశాల కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. విద్యార్థులు ప్రైవేట్ పాఠశాలలకు వెళ్లకుండా ప్రభుత్వ పాఠశాలలకు వచ్చేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ప్రభుత్వ పాఠశాలలు ఆదర్శంగా మారేలా విద్యా శాఖ అధికారులు, ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థుల్లో సృజనాత్మకత, ఆత్మవిశ్వాసం, సామాజిక బాధ్యత పెంపొందించాలని ఆయన సూచించారు. పాఠశాలల నిర్వహణ ఖర్చులకు ధృవీకరణ నివేదికలు ఇవ్వాలని ఆదేశించారు. తన పర్యటనలో కంప్యూటర్స్ పరిశీలిస్తున్నానని చాలా చోట్ల పనిచేయడం లేదని మరమ్మతులు నిర్వహించి విద్యార్థులకు ఉపయోగంలోకి తేవాలని స్పష్టం చేశారు. విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలను ఎప్పటికప్పుడు ఆన్లైన్ చేయాలని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, డిఈఓ రాజేందర్, ఈడబ్ల్యూ ఐడిసి ఏఈ జీవన్, అన్ని మండలాల విద్యాశాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అయ్యో పాపం...

- అటు వెళ్లలేరు ఇటు రాలేరు
- వరంగల్లో ముంపు ప్రాంత ప్రజల కష్టాలు



**వరంగల్ ఎంజీఎం, అక్టోబర్ 30(జనంసాక్షి):** వరంగల్ నగరంలో బుధవారం కురిసిన భారీ వర్షాల కారణంగా వరంగల్ నగరంలోని పలు కాలనీలు లోతట్టు ప్రాంతాలు పూర్తిగా జలమయమయ్యాయి. గృహవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొన్ని కాలనీలో అసలు రహదారులు కనిపించని పరిస్థితి ఏర్పడింది. రెండు రోజులుగా గృహవాసులు తమ గృహాల్లోనే ఉంటున్నారు. బయటికి రాలేని పరిస్థితి బయటి వాళ్లు లోపటికి వెళ్లలేని పరిస్థితి కనిపిస్తుంది వరద నీరు అలాగే ఉండడంతో ఇబ్బందులు పడుతున్నారు.వరంగల్ అండర్ రైల్వే గేట్ లోని ఎస్ఆర్ఆర్ తోటలో వీధుల్లో పూర్తిగా జలాలు నిండడంతో వారు బయటికి రాకుండా ఉండడం కనిపించింది. సంబంధిత అధికారులు గృహవాసులకు తగిన సహాయ సహకారాలు అందించాలని కోరుతున్నారు.

# మొంథా తుపాన్‌తో నష్టపోయిన పంటలు

- దెబ్బతిన్న రోడ్లు, మత్తడి పడ్డ చెరువులు





**స్టేషన్ ఘన్పూర్, అక్టోబర్ 30 (జనం సాక్షి) :** స్టేషన్ ఘన్పూర్ మండల కేంద్రంతోపాటు అన్ని గ్రామా ల్లో బుధవారం కురిసిన మొంథా తుపాన్ తో వరి, మొక్కజొన్న, పత్తి పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. వర్షం కారణంగా రోడ్లు తెగి దెబ్బతిన్నాయని, రిజర్వా యర్లు, చెరువులు మత్తల్లు పడి వాహన రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. చేతికందిన వరి ధాన్యం కల్లాలలో వర్షం కారణంగా తడిసి ముద్ద కావడంతో రైతులు తడిసిన ధాన్యాన్ని చూసి రైతులు బోరున విలపించారు. మొంథా తుపాన్ తో గ్రామాలలో తీవ్ర నష్టం జరిగింది.మొంథా తుపాన్ తో నష్టపోయిన వరి, మొక్కజొన్న,పత్తి పంటలకు ఎకరానికి 50వేల నష్టపరి హారం చెల్లించాలని, దెబ్బతిన్న రోడ్లను వెంటనే బాగు చేయించాలని, పంటలు నష్టపోయిన రైతులను ప్రభు త్వం ఆదుకోవాలని పలు పార్టీల నాయకులు, రైతు సంఘం నాయకులు, ప్రజలు కోరుతున్నారు.

**కేంద్రరాష్ట్రప్రభుత్వాలు పంటలకు ఉంచితంగా బీమా చేయించాలి : సిపిఎం పార్టీ మండల కార్యదర్శి సాదం రమేష్**

కేంద్రరాష్ట్రప్రభుత్వాలు పంటలకు ఉంచితంగా బీమా చేయించాలని సిపిఎం పార్టీ మండల కార్యదర్శి సాదం రమేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చిల్పూర్ మండలంలోని కృష్ణజీగూడెం గ్రామంలో సిపిఎం పార్టీ గ్రామ కమీటి ఆధ్వర్యంలో నిన్న కురిసిన మొంథా తుపాన్ ప్రభావంతో కృష్ణజీగూడెం గ్రామంలో వరదలో కొట్టుక పోయిన వరిని మోసులు కప్పిన వరి పొలాలను సిపిఎం పార్టీ బృందం సందర్శించారు. అనంతరం మండల కార్యదర్శి సాదం రమేష్ మాట్లాడుతు నిన్న కురిసిన భారీ వర్షాలు మండలంలో వరి, మొక్కజొన్న, పత్తి పంటలు త్రివ్రంగా నష్టపోయారు రైతులకు ప్రభుత్వం ఎకరానికి 50వేల రూపాయలు నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. పీఏసీఎస్, ఐకెపి సెంటర్ లో ఉన్న వరి ధాన్యం ను రేపు వెంటనే తరలించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో ఊరడి లింగయ్య, నారబోయన బిక్షపతి, పోలు శ్రీనివాస్, ముడిక బీమయ్య, ఊరడి రవి, సంగి వెంకటయ్య, సాదం చంద్రయ్య, తదితరులు పాల్గొన్నారు.

## బూర్గులతండా గ్రామంలో భారీ కొండచిలువ కలకలం

**నేరేడుచర్ల, అక్టోబర్ 30 (జనంసాక్షి) :** మండలంలో బూర్గుల తండా గ్రామంలో భారీ పది అడుగుల కొండచిలువ కలకలం రేపింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామంలో గత కొన్ని రోజులుగా కొండచిలువ సంచరిస్తున్నట్లు తెలిపారు.గురువారం కొండచిలువ ఓ ఇంటి ఆవరణలో సుమారు 5 కేజీల కోడిపుంజును చుట్టుకొని మింగే ప్రయత్నం చేస్తుండడంతో గ్రామస్తులు గమనించి ఆ కొండచిలువను చంపేయడం జరిగింది.గ్రామ శివారులో ఎలాంటి అడవి ప్రాంతం లేకున్నా గాని ఇలాంటి వన్యప్రాణులు ఇళ్ల మధ్యలోకి రావడం ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తుందని, అటవీ శాఖ అధికారులు ఇలాంటివి గుర్తించి గ్రామంలోని ప్రజలకు ప్రాణహాని లేకుండా చూడాలని పలువురు గ్రామస్తులు కోరారు.



## భద్రతా నియమాలను పాటించని ఆటో డ్రైవర్లు



**దేవరకొండ, అక్టోబర్ 30 (జనంసాక్షి) :** దేవరకొండలో కొందరు బతుకుదెరువు కోసం వ్యవసాయ పనులకు ఇతర ప్రాంతాలకు వెళ్లే వారు సరైన రవాణా సౌకర్యాలు విడిచి ప్రైవేటు వాహనాలను ఆశ్రయిస్తున్నారు. ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణిస్తూ ప్రమాదాలకు గురవుతున్నారు. పట్టణంలో పనులు లేక ఇతర ప్రాంతాల్లో వ్యవసాయ పనులకు వెళ్లేందుకు కూలీలు ఆటోలాలో ఎక్కి ఇలా ప్రమాదకరంగా ప్రయాణిస్తున్నారు. పరిమితికి మించి ప్రయాణిస్తే ప్రమాదమని తెలిసిన గత్యంతరం లేకనే ఆటోలో ఇలా వెళ్తున్నామని చెబుతున్నారు. చిన్న నిర్లక్ష్యం ప్రాణాల నష్టానికి దారి తీస్తుందని,కూలీలను, పిల్లలను లేదా ప్రయాణికులను సామర్థ్యానికి మించి ఎక్కించడం ప్రమాదానికి కారణం అవుతుందని,పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కిస్తూ,నిబంధనలు పాటించని డ్రైవర్లపై పోలీసులు చట్టరీత్యా చర్యలు తీసుకుంటే ప్రమాదాలను అరికట్టవచ్చు అని పట్టణ ప్రజలు గుసగుసలాడుతున్నారు.

## మునగ మొక్కల సాగుపై ప్రత్యేక దృష్టి సారించాలి

**పినపాక, అక్టోబర్ 30 (జనం సాక్షి) :** రైతులకు మునగ మొక్క పెంపకంపై ప్రత్యేక అవగాహన కల్పించాలని పినపాక ఎంపీడీవో సంకీర్త్ సూచించారు. గురువారం పినపాక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో వ్యవసాయ శాఖ ఏఈ వెంకటేశ్వర్లు, ఏఈవోలు రమేష్ తో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. రైతులకు మునగ వల్ల వచ్చే ఉపయోగాలు వివరించాలని ఈ సందర్భంగా ఎంపీడీవో సూచించారు. పినపాక మండలంలో సాగవుతున్న మునగ పంట వివరాలను ఎంపీడీవోకు ఏవో వెంకటేశ్వర్లు వివరించారు. గ్రామాలలో అవగాహన కల్పిస్తున్నామని తెలియజేశారు. మునగ ఆకునుండి, మునగ మొక్క, మునగ పంట వరకు వచ్చే లాభాలను వివరిస్తున్నామని ఎంపీడీవోకు వివరించారు. మునగ సాగు వల్ల రైతులకు లభించే ఉపయోగాలు సైతం తెలియజేస్తున్నామన్నారు.



## ఫారెస్ట్ అధికారులపై దాడులు చేయడం సరైన పద్ధతి కాదు



**పినపాక, అక్టోబర్ 30 (జనం సాక్షి) :** అటవీ భూముల రక్షణకై నిరంతరం శ్రమిస్తున్న అటవీ శాఖ అధికారులపై దాడులు సరైన పద్ధతి కాదని ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ తేజస్విని తెలిపారు. గురువారం ఆమె పినపాక మండలం ఈ బయ్యారం క్రాస్ రోడ్ లో గల అటవీశాఖ కార్యాలయం వద్ద మాట్లాడారు. గత రెండు రోజుల క్రితం కరకగూడెం మండలంలో ఫారెస్ట్ అధికారులపై వలస గిరిజన పోడు రైతులు దాడి చేయడం పై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఇటువంటి చర్యలు పూనుకున్న వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అటవీ రక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.

## సూర్యాపేట నుండి దంతాలపల్లి వెళ్లే రహదారిపై రాకపోకలు బంద్

**ఆత్మకూర్ (ఎస్), అక్టోబర్ 30 (జనంసాక్షి) :** సూర్యాపేట-దంతాలపల్లి రోడ్డు లో నెమ్మికల్లు వద్ద చౌడ చెరువు నుండి రోడ్డుపై ప్రవహించడం వల్ల రోడ్డు కుంగిపోవటంతో ఆ రోడ్డుపై రాకపోకలకు ఆటంకం ఏర్పడింది కాబట్టి వెంటనే పునరుద్ధరణ పనులు చేపట్టి శుక్రవారం ఉదయం నాటికి రాకపోకలు జరిగే విధంగా చర్యలు చేపట్టాలని ఆర్ అండ్ బి ఈ పద్మావతిని కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ఆదేశించారు. గురువారం ఆత్మకూరు (ఎస్ )మండలం, నెమ్మికల్ వద్ద అధిక వర్షం వల్ల కుంగిపోయిన రోడ్డు ను, నేలకు వాలిన వరి పంటను పరిశీలించి పంట నష్టం పై పూర్తి నివేదిక అందించాలని వ్యవసాయ అధికారిని ఆదేశించారు. తదుపరి ఆత్మకూరు ఎస్ మండలం దాచారం వద్ద ఐకేపీ ఆధ్వర్యంలో నిర్వహించే ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ సందర్శించి తేమ శాతం పరిశీలించారు.ధాన్యం కొనుగోలు కేంద్రాలలో తేమ శాతం 17 రాగానే వెంటనే కాంటా వేసి మిల్లులకు తరలించాలని నిర్వాహకులను ఆదేశించారు. వర్షం వల్ల ఏమైనా ధాన్యం తడిచాయా అని అడగగా కొనుగోలు కేంద్రం ఎత్తులో ఏర్పాటు చేయటంతో పాటు, ధాన్యం పై టార్పాలిన్ పట్టాలు కప్పటం వల్ల ధాన్యం తడవలేదని నిర్వాహకులు తెలిపారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ అమీన్ సింగ్, ఎంపిడిఓ ఎం డి హసీం,ఏ ఓ దివ్య, సెంటర్ ఇంచార్జి అనిత తదితరులు ఉన్నారు.



## పంట నష్టంపై అధికారుల కసరత్తు



**మిర్యాలగూడ, అక్టోబర్ 30 (జనం సాక్షి) :** మొంథా తుఫాన్ ప్రభావం తో 3 రోజులపాటు కురిసిన గాలి వానలకు మిర్యాలగూడ డివిజన్ లోని 5 మండలాల్లో పంట నష్టం పై ప్రాథమిక అంచనాలు సిద్ధం చేసినట్లు మిర్యాలగూడ ఇంచార్జ్ ఏ డి ఏ ధీరావత్ సైదా నాయక్ గురువారం తెలిపారు. మిర్యాలగూడ డివిజన్లో ప్రాథమిక అంచనాల మేరకు 11,729 ఎకరాలు పంట నష్టం జరిగినట్లు ప్రాథమిక అంచనా వేసినట్లు తెలిపారు. దామరచర్ల, అడవిదేవులపల్లి, వేములపల్లి, మాడుగుల పల్లి, మిర్యాలగూడ మండలాలలో మొత్తం 1,16,000 ఎకరాల విస్తీర్ణం లో వరి సాగు, 20,280 ఎకరాలలో పత్తి సాగు చేస్తుండగా, ఇటీవల ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాల వలన 11,164 ఎకరాలలో వరి పంట, 65 ఎకరాలలో పత్తి, మరో 50 ఎకరాలలో మిర్చి పంటలు నష్టపోయినట్లు ప్రాథమికంగా గుర్తించినట్లు తెలిపారు. క్షేత్రస్థాయిలో మండల వ్యవసాయ అధికారులు, విస్తరణ అధికారులు పంట నష్టాన్ని నిర్ధారిస్తూ పూర్తిస్థాయి నివేదికలను సిద్ధం చేస్తున్నారన్నారు. నివేదిక ఉన్నతాధికారులకు అందజేయడం జరిగిందని, వారు ఇచ్చే తదుపరి ఆదేశాల మేరకు తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

# తడిసిన ధాన్యంపై నివేదికలు అందజేయాలి

- కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

**సూర్యాపేట ప్రతినిధి, అక్టోబర్ 30 (జనంసాక్షి) :** భారీ వర్ష ప్రభావిత ప్రాంతాలలో ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఏమైనా తడిసిన ధాన్యం ఉంటే వెంటనే నివేదిక ఇవ్వాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ లో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ లో ఆయన మాట్లాడుతూ మొంథా తుఫాన్ వల్ల జిల్లాలో అధిక వర్షాలు కురుస్తాయని అధికారులను, రైతులను అప్రమత్తం చేయడం వల్ల కొనుగోలు కేంద్రాల్లో ధాన్యపు రాశులపై టార్పాలిన్ పట్టాలు కప్పటం వల్ల ఎక్కువగా ధాన్యం తడవలేదని, అడుగు భాగాన గాని చివరి అంచుల్లో గాని తడిస్తే వెంటనే మిల్లులకి తరలించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. కలెక్టరేట్లో అన్ని శాఖల అధికారులతో 24 గంటల పాటు 6281492368 నెంబర్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. వీడియో కాన్ఫరెన్స్లో ఎస్పీ కె.నరసింహ, అదనపు కలెక్టర్ సీతారామ రావు,జడ్పి సీఈవో వివి.అప్పారావు, జిల్లా వ్యవసాయ అధికారి శ్రీధర్ రెడ్డి, డిపిఓ యాదగిరి,ఆర్అండ్ బి ఈఈ సీతారామయ్య, పంచాయతీ రాజ్ ఈఈలు వెంకటయ్య, మాధవి, ఇరిగేషన్ ఎస్సీ శివ ధర్మ, డిఎస్ఓ మోహన్ బాబు,డిఎం రాము, డిసిఓ పద్మ, రవాణా అధికారి జయప్రకాష్ రెడ్డి,అగ్నిమాపక అధికారి కృష్ణారెడ్డి , డిఎంహెచ్ఓ డాక్టర్ చంద్రశేఖర్, సిపిఓ కిషన్, మిషన్ భగీరథ ఈఈ అరుణాకర్ రెడ్డి,మున్సిపల్ కమిషనర్ హనుమంత రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## రైతులకు ఎకరాకు 40వేలు పరిహారం అందించాలి



**వేములపల్లి, అక్టోబర్ 30 (జనంసాక్షి) :** మండలంలోని శెట్టిపాలెం గ్రామంలో అకాలవర్షాల వల్ల నష్టపోయిన పంట పొలాలను గురువారం బీజేపీ వేములపల్లి మండల కమిటీ ఆధ్వర్యంలోపరిశీలించారు. ఈసందర్భంగా బీజేపీ మండల అధ్యక్షులు పెదమాం భరత్ మాట్లాడుతూ మొంథా తుపాను కారణంగా మండలంలో అనేక గ్రామాలలో వానా కాలం సీజన్ లో రైతులు యూరియా కొరత అధిక వర్షాలు కూలీల కొరత వంటి అనేక సమస్యలతో ఆరుగాలం శ్రమించి రైతులు పంటపండిస్తేతుఫాను కారణంగా చేతికొచ్చిన పంట అధిక వర్షం గాలి దుమారం కారణంగా నీట మునిగిందన్నారు .కాంగ్రెస్ ప్రభుత్వం యుద్ధప్రాతిపదికనవ్యవసాయ అధికారులు రెవిన్యూ సిబ్బందిని గ్రామాలకు పంపి నష్టపోయిన పంట పొలాలను పరిశీలించి ప్రతి ఎకరాకు 40 వేల రూపాయల పంటనష్టం అందించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం రైతుల కోసం ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకంరాష్ట్ర ప్రభుత్వం అమలు చేసి ఉంటే నేడు రైతులందరికీ పంట నష్టం పరిహారం అంది న్యాయం చేకూరి ఉండేదన్నారు ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం పసల్ బీమాను అమలు చేయాల ని ఆయన డిమాండ్చేశారు.ఈకార్యక్రమంలోబిజెపి జిల్లా కౌన్సిల్ సభ్యులు చిర్ర సాంబమూర్తి, బిజెపి కిసాన్ మోర్చా రాష్ట్ర నాయకులుజవ్వాజీసత్య నారాయణ, చల్లమల్ల సీతారాం రెడ్డి,పెదమాం వెంకన్న, మండల బిజెపి నాయకులు పెదమాం ప్రసాద్,చక్కని ఉపేందర్, మజ్జిగపు రాంరెడ్డి మాతంగి ప్రభాకర్ సోమయ్య అనిల్ మహేష్ సతీష్ ను రైతులు పండుగ అంజయ్య పండుగ లింగయ్య మహబూబ్ మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## పంట నష్టంపై పూర్తి నివేదికలు అందజేయాలి

- కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్



**సూర్యాపేట ప్రతినిధి, అక్టోబర్ 30 (జనంసాక్షి) :** మొంథా తుఫాన్ ప్రభావంతో కురిసిన వర్షాల వల్ల దెబ్బ తిన్న పంటపై , నీట మునిగిన పంటపై పూర్తిస్థాయి నివేదిక ఇవ్వాలని వ్యవసాయ అధికారిని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ఆదేశించారు.గురువారం నూతనకల్ మండలం మిర్యాల గ్రామంలో ఎర్పుల రామలింగంకు చెందిన పత్తి పంటను పరిశీలించారు.ఈ సందర్భంగా కలెక్టర్ ఎన్ని ఎకరాలలో సాగు చేశారని రైతును అడగగా, నాలుగు ఎకరాలలో సాగు చేశానని, ఒక్కసారి పత్తి తీశామని, రెండో సారి తీయుటుకు సిద్ధమయ్యే లోపు వర్షంతో తడిచి పత్తి దెబ్బతిందని వివరించారు.అనంతరం నూతనకల్ తాళ్ల సింగారం రోడ్డులో తుమ్మల చెరువు అలుగు పోయటం వల్ల నీట మునిగిన పంటను పరిశీలించారు.పొలాల్లో నీరు పోయేందుకు తగిన చర్యలు తీసుకోవాలని ఇరిగేషన్ ఏఈని, అలాగే పంట నష్టంపై నివేదిక ఇవ్వాలని వ్యవసాయ అధికారిని ఆదేశించారు. తహసీల్దార్ శ్రీనివాసరావు,ఎంపిడిఓ సునీత, ఏవో మల్లారెడ్డి, ఎంపిఓ శశికళ, ఏఈఓ భవ్య తదితరులు కలెక్టర్ వెంట ఉన్నారు.

## దెబ్బతిన్న పంటలను పరిశీలించిన జిల్లా కలెక్టర్

**టేకులపల్లి, అక్టోబర్ 30 (జనంసాక్షి) :** తుఫాను ప్రభావంతో కురిసిన అకాల వర్షానికి పత్తి, వరి పంటలకు తీవ్రంగా నష్టం వాటిల్లడంతో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ గురువారం టేకులపల్లి మండలంలో పర్యటించి నష్టం వాటిల్లిన పంటలను పరిశీలించారు. తంగేళ్ల తండా గ్రామంలోని రైతుల దెబ్బతిన్న వరి, పత్తి పంటలను క్షేత్ర సందర్శన చేసి పరిశీలించారు. పంటల పరిశీలనలో కలెక్టర్ వెంట సందర్శించిన వారిలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బాబురావు, ఇల్లందు వ్యవసాయ సంచాలకులు లాల్చంద్, మండల వ్యవసాయ అధికారిని నీరుడు అన్నపూర్ణ, ఏ ఈ ఓ లు, రైతులు ఉన్నారు.



## మున్నేరు ముంపు నిర్వాసితులకు అండగా ఉంటాం



**ఖమ్మం, అక్టోబర్ 30 (జనం సాక్షి) :** మొంథా తుఫాను ప్రభావంతో గత 24 గంటల నుంచి కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో ఖమ్మం నగరంలోని మున్నేరు ఉధృతి 26 అడుగులకు చేరి 47, 48 డివిజన్ లోని పద్మావతి నగర్, వెంకటేశ్వర నగర్, బొక్కలగడ్డలి ప్రాంత ప్రజల ఇళ్లలోకి నీరు చేరి దిక్కుతోచని పరిస్థితుల్లో రోదిస్తున్న ఆ కుటుంబాలను 48వ డివిజన్ కార్పొరేటర్ తోట గోవిందమ్మ రామారావు అక్కున చేర్చుకుని ఆకలితో ఉన్న ఆ వందలాది కుటుంబాలకు అన్న ప్రసాదాలు అందించారు. అనంతరం తోట గోవిందమ్మ రామారావు మాట్లాడుతూ రోజువారి కూలీ చేసుకునే ఈ కుటుంబాలకు గత కొన్ని సంవత్సరాల నుంచి ఈ మున్నేరు ఉధృత్తి వాళ్ల జీవనాన్ని లిచీకటిమయం చేస్తుందని వేలాది రూపాయల ఆస్తి నష్టంతో పాటు మానసిక రోదనను కలిగిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో తోట రమేష్, వంగాల వెంకట్ చేతి, కృష్ణ, బాబా, కిషన్ నాయక్, నిరంజన్, కునుపూరి మహేష్ కునుపూరి మధు రవీందర్, వీరేందర్, మాధవరావు, లింగా రెడ్డి, ప్రాంత యువత, మహిళలు పాల్గొన్నారు.

## పేద విద్యార్థులకు అండగా నిలవడం అభినందనీయం



**సూర్యాపేట ప్రతినిధి, అక్టోబర్ 30 (జనంసాక్షి) :** తెలంగాణ రాష్ట్ర టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి పేద విద్యార్థులకు అండగా నిలుస్తున్నారని మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పెద్దిరెడ్డి రాజా, ప్రముఖ వైద్యులు డాక్టర్ వూర రామ్మూర్తి యాదవ్ అన్నారు. గురువారం సూర్యాపేట పట్టణంలోని తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఉమెన్స్ డిగ్రీ కాలేజీలో విద్యార్థులకు గతంలో ఇచ్చిన హామీ మేరకు రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి సుమారు రూ.50 వేల విలువైన సీలింగ్ ఫ్యాన్స్, ట్యూబ్ లైట్లను తన సొంత నిధులతో అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు చదువుకునే వాతావరణం మరింత అనుకూలంగా ఉండేలా కృషి చేస్తామన్న పటేల్ రమేష్ రెడ్డి త్వరలోనే సుమారు రూ.5 లక్షల వ్యయంతో ఆధునిక కంప్యూటర్లు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.విద్య భవిష్యత్ నిర్మాణానికి పునాది అన్న నమ్మకంతో విద్యాభివృద్ధికి శ్రద్ధ చూపటం అభినందనీయమని అన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు వెలుగు వెంకన్న, జ్యోతి కరుణాకర్, నేరెళ్ల మధు, షేక్ ఫారుక్, యాట వెంకన్న, కళాశాల ప్రిన్సిపాల్ శ్రీవాణి,వైస్ ప్రిన్సిపాల్ మౌనిక,లెక్చరర్లు శ్రీవిద్య, శివలీల, సుజాత తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ నాయకుడిగా క్రమశిక్షణతో ఉంటా..

**చౌటుప్పల్, అక్టోబర్ 30 (జనం సాక్షి) :** తాను క్రమశిక్షణ కలిగిన కాంగ్రెస్ పార్టీ నాయకుడిగా, కార్యకర్తగా పార్టీ అధిష్టానం తీసుకునే ఏ నిర్ణయానికైనా కట్టుబడి ఉంటానని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి స్పష్టం చేశారు. తాను పార్టీ మారుతున్నట్లుగా బిఆర్ఎస్ నాయకులు, తమ పార్టీలోని కొందరు కావాలనే తనపై దుష్ప్రచారం చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. రాజకీయంగా నేను ఏదైనా నిర్ణయం తీసుకోవాలనుకున్నప్పుడు నేనే స్వయంగా ప్రెస్ మీట్ పెట్టి చెబుతానని తెలిపారు. నాపై సోషల్ మీడియాలో వస్తున్న దుష్ప్రచారాలను ప్రజలు నమ్మవద్దు, అని ఆయన కోరారు. గురువారం చౌటుప్పల్ మున్సిపాలిటీ కేంద్రంలోని లక్కారం,చౌటుప్పల్ మున్సిపాలిటీ చెరువులను ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి పరిశీలించి గంగ పూజను నిర్వహించారు. ఈ కార్యక్రమాలలో చౌటుప్పల్ ఆర్డిఓ వెలమ శేఖర్ రెడ్డి, నీటిపారుదల శాఖ ఈఈ మనోహర్, డి ఈ రాజవర్ధన్ రెడ్డి, మార్కెట్ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య, మండల తహసీల్దార్ వీరాబాయి, మున్సిపల్ కమిషనర్ గుత్తా వెంకట్రాంరెడ్డి, మార్కెట్ వైస్ చైర్మన్ ఆకుల ఇంద్రసేనారెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ వెన్ రెడ్డి రాజు, మాజీ సర్పంచ్ పబ్బు రాజు గౌడ్, యాదాద్రి భువనగిరి జిల్లా ఫిషరీస్ చైర్మన్ పాశం సంజయ్ బాబు, కొయ్యడ సైదులు, మొగుదాల రమేష్, బత్తుల విప్లవ్, సందగళ్ళ సతీష్, బోడిగె బాలకృష్ణ, ఆర్ ఐ లు బాణాల రాంరెడ్డి, కొప్పుల సుధాకర్ రావు, వివిధ శాఖల అధికారులు, నాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.



# బోయిన్‌పల్లి-దొరేపల్లీ గ్రామ రోడ్డు దుస్థితిపై రైతుల ఆగ్రహం


**కనగల్, అక్టోబర్ 30 (జనం సాక్షి) :** మండలంలోని బోయినపల్లి-దోరేపల్లి గ్రామాల రహదారి చినుకు పడితే చిత్తడి చిత్తడిగా మారి కనీసం ప్రజలు నడవలేని పరిస్థితి కనబడుతుంది. నిత్యం ఆ రహదారిపై రైతులు తమ వ్యవసాయ పొలాలకు వెళ్లడం, వంద లాది వాహనాలు నడవడంతో రోడ్డు పరిస్థితి అధ్వానంగా తయారైంది. ఈ రెండు గ్రామాల చుట్టూ వాగులు, ఎమ్మార్పీ నుంచి మైనర్ కాలువల ద్వారా నీటి సౌకర్యంతో బోర్లు, చెరువులలో నీరు సమృద్ధిగా ఉండటం మూలంగా ఈ గ్రామాల రైతులు వరి పంటనే ప్రధానంగా ఎంచుకొని ఖరీఫ్, యాసంగి సీజన్లో పంటలను పండిస్తున్నారు. దళారుల భారీ నుండి రైతులను కాపాడడానికి ప్రభుత్వం మద్దతు ధరతో పండించిన పంటలను సింగిల్ విండో సొసైటీ, మహిళ సంఘాల ద్వారా కేంద్రాలను ఏర్పాటు చేసి కొనుగోలు చేసిన ధాన్యం మిల్లర్లకు తరలింపు లో అధ్వానంగా ఉన్న రోడ్డుపై లోడుతో లారీలు వెళ్లాలంటే ఎక్కడ ప్రమాదానికి దారి తీస్తాయో అని ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని లారీలను నడుపుతున్నారు. రోడ్డు పరిస్థితి ని కల్లారా చూసిన జిల్లా అధికారులు అక్కడ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడానికి ఇష్టపడడం లేదు. తాత్కాలిక మరమతులతో ఏర్పడిన గుంతలను మట్టితో పూడ్చిన ఇసుక ట్రాక్టర్లవిపరీత రద్దీతో పెద్ద పెద్ద గుంతలుగా మారి రోడ్డు కాస్తబురద మాయంగా మారిన పరిస్థితి ఉంది. రెండు గ్రామాల ప్రజా ప్రతినిధులు సమన్వయంతో జిల్లా మంత్రుల దృష్టికితీసుకెళ్లి అధ్వానం ఉన్న మట్టి రోడ్డు బీటీ రోడ్డుగా మార్చడానికి కృషి చేయాలని రైతులు, ప్రజలు కోరుతున్నారు.






# ఇక కాపర్ వంతు..

**దేశీయంగా కాపర్‌కు డిమాండ్ బలపడుతోంది. గత ఆర్థిక సంవత్సరంలో (2024-25) 1,878 కిలో టన్నులకు చేరుకుంది. అంతకుముందు ఆర్థిక సంవత్సరంలో డిమాండ్ 1,718 కిలో టన్నులతో పోల్చి చూసినప్పుడు 9.3 శాతం పెరిగింది.ఇంటర్నేషనల్ కాపర్ అసోసియేషన్ ఇండియా (ఐసీఏ ఇండియా) ఈ వివరాలను నివేదిక రూపంలో విడుదల చేసింది.ఆర్థికంగా పురోగమిస్తుండడం, కీలక రంగాల్లో కాపర్ వినియోగం పెరుగుతుండడం డిమాండ్‌కు మద్దతుగా నిలుస్తున్నట్టు తెలిపింది.**



**న్యూఢిల్లీ:** భారీ స్థాయి మౌలి క ప్రాజెక్టులు, భవన నిర్మాణాలు, ఎలక్ట్రిక్ వాహనా లు, సోలార్ విద్యుత్ సామర్థ్యాల విస్తరణ వంటివి డిమాండ్‌ను అధికం చేస్తున్నాయని పేర్కొంది. ముఖ్యంగా గత ఆర్థిక సంవత్సరంలో భవన నిర్మాణ రంగం నుంచి కాపర్‌కు డిమాండ్ 11 శాతం పెరిగ్గా, మౌలిక సదుపాయాల రంగం నుంచి 17 శాతం అధికంగా ఉన్నట్టు తెలిపింది."భారత్‌లో ఆర్థిక, పారిశ్రామిక పురోగతికి అనుగుణంగా కాపర్ డిమాండ్ పెరుగుతోంది. పునరుత్పాదక ఇంధన వనరులు, సుస్థిర రవాణా పరిష్కారాలు, మౌలిక వసతుల అభివృద్ధి కాపర్ డిమాండ్‌ను పెంచుతున్నాయి. దేశ అభివృద్ధికి కీలక వనరుగా కాపర్ తనవంతు పాత్రను తెలియజేస్తోంది" అని ఐసీఏ ఇండియా తెలిపింది.అయితే వికసిత్ భారత్ ఆకాంక్షకు అనుగుణంగానే ప్రస్తుత కాపర్ డిమాండ్ ఉందా? అని ప్రశ్నించుకోవాలని ఐసీఏ ఇండియా ఎండీ మయాంక్ కర్మార్కర్ పేర్కొన్నారు. కాపర్ నిల్వలను అభివృద్ధి చేసుకోవడం, దేశ సరఫరా వ్యవస్థలను బలోపేతం చేసుకోవడం ద్వారా భవిష్యత్ డిమాండ్‌ను చేరుకోవచ్చని సూచించారు.

**భవిష్యత్తుబంగారం**

బంగారం ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. రోజుకో కొత్త ధరకు చేరుతూ సామాన్యులకు అందనంత దూరంగా జరిగిపోతోంది పసిడి. ఇన్వెస్టర్లు సైతం స్వర్ణంపై సంపూర్ణ విశ్వాసం పెట్టలేకపోతున్నారు. ఈ నేపథ్యంలో 'భవిష్యత్ బంగారం'గా మరో లోహం ఆశలు పుట్టిస్తోంది. అదే 'రాగి' మల్టీ నేషనల్ మైనింగ్ సంస్థ వేదాంతా గ్రూప్ చైర్మన్ అనిల్ అగర్వాల్ కాపర్‌ను 'తదుపరి బంగారం'గా అభివర్ణించారు.ఇది క్లీన్ ఎనర్జీ, ఆధునిక సాంకేతిక పరిజ్ఞాన రంగాలలో ఎక్కువగా ప్రాముఖ్యతను పొందుతోందని పేర్కొన్నారు. ఎలక్ట్రిక్ వాహనాలు, పునరుత్పాదక శక్తి మౌలిక సదుపాయాలు, ఏఐ, రక్షణ పరికరాలలో కాపర్‌కు పెరుగుతున్న డిమాండ్‌ను ఆయన ప్రస్తావించారు. కెనడాలోని బారిక్ గోల్డ్ సంస్థ తన పేరులో గోల్డ్ పదాన్ని తొలగించి కేవలం 'బారిక్'గా మార్చడం గ్లోబల్ స్థాయిలో కాపర్ గనులపై దృష్టి మారే సంకేతంగా ఆయన పేర్కొన్నారు.

## 25 ఏళ్లు.. 3.5 కోట్లు

### అమ్మకాల్లో యాక్టివా రికార్డు




**న్యూఢిల్లీ:** ప్రముఖ టూ వీలర్ కంపెనీ హోండా మోటార్‌సైకిల్ అండ్ స్కూటర్ ఇండియా యాక్టివా 110, యాక్టివా 125, యాక్టివా-ఐతో సహా దాని ప్రసిద్ధ యాక్టివా శ్రేణి..మొత్తం 35 మిలియన్ (3.5 కోట్లు) అమ్మకాల మైలురాయిని సాధించింది. దీన్నిబట్టి చూస్తే ఇండియన్ మార్కెట్లో ఈ స్కూటర్‌కు ఉన్న డిమాండ్ స్పష్టంగా అర్థమవుతోంది.హోండా మోటార్‌సైకిల్.. తన యాక్టివా శ్రేణి స్కూటర్లను 3.5 కోట్ల యూనిట్లను విక్రయించడానికి 25 ఏళ్ల సమయం పట్టింది. 2001లో యాక్టివా స్కూటర్ దేశీయ విఫణిలో ప్రారంభమైంది. 2015 నాటికి 10 మిలియన్ సేల్స్.. 2018 నాటికి 20 మిలియన్ సేల్స్, 2025 నాటికి 35 మిలియన్ సేల్స్ రికార్డ్ సాధ్యమైంది.యాక్టివా స్కూటర్ భారతదేశంలో లాంచ్ అయినప్పటి నుంచి.. అనేక అప్డేట్స్ పొందుతూనే ఉంది. ఇందులో డిజైన్ అప్డేట్స్, అప్డేటెడ్ ఫీచర్స్ కూడా ఉన్నాయి. ఇవన్నీ కొనుగోలుదారులను ఎప్పటికప్పుడు ఆకట్టుకుంటూ ఉండటం చేత అమ్మకాలలో గణనీయమైన పురోగతి సాధ్యమైంది.హోండా యాక్టివా వారసత్వాన్ని కొనసాగించడంలో భాగంగా.. కంపెనీ 2025 ఆగస్టులో యాక్టివా %ం% యాక్టివా 125 యానివర్సరీ ఎడిషన్స్ లాంచ్ చేసింది. కంపెనీ ఎప్పటికప్పుడు కొత్త ఉత్పత్తులను లాంచ్ చేయడం మాత్రమే కాకుండా.. బలమైన డీలర్ నెట్‌వర్క్‌ను కూడా కలిగి ఉంది. ప్రస్తుతం ఇండియన్ మార్కెట్లో యాక్టివా ఈ, యాక్టివా క్యూసీ1 పేరుతో ఎలక్ట్రిక్ స్కూటర్లు కూడా అందుబాటులో ఉన్నాయి.

## నష్టాల్లో ముగిసిన సూచీలు

**ముంబయి:** మార్కెట్ అంచనాలకు అనుగుణంగానే అమెరికా ఫెడరల్ రిజర్వ్ కీలక వడ్డీ రేట్లలో పావు శాతం కోత విధించింది. అదే సమయంలో భవిష్యత్ వడ్డీరేట్ల కోతపై కీలక సంకేతాలు ఇవ్వలేదు. ఈ ఏడాదిలో మరోసారి రేట్ల కోత ఉండబోదని ఫెడ్ చీఫ్ జెరోమ్ పావెల్ హింట్ ఇచ్చారు. దీంతో మదుపర్ల సెంటిమెంట్ దెబ్బతింది. దీంతో ప్రపంచ మార్కెట్లతో పాటు మన మార్కెట్ సూచీలు అమ్మకాల ఒత్తిడి ఎదుర్కొన్నాయి. అదే సమయంలో అమెరికా- చైనా మధ్య వాణిజ్య ఒప్పందం కుదురుతుందన్న వార్తల వేళ మదుపర్లు అప్రమత్తత పాటించారు. ముఖ్యంగా మెటల్, ఐటీ, ఎఫ్‌ఎంసీజీ, ఫార్మా స్టాక్స్‌లో అమ్మకాల ఒత్తిడి ఎదుర్కొన్నాయి.సెన్సెక్స్ ఉదయం 84,750.90 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 84,997.13) నష్టాల్లో ప్రారంభమైంది. రోజంతా నష్టాల్లోనే కొనసాగింది. చివరికి 592.67 పాయింట్ల నష్టంతో 84,404.46 వద్ద స్థిరపడింది. నిఫ్టీ సైతం 176.05 పాయింట్లు నష్టపోయి 25,877.85 వద్ద ముగిసింది. డాలరుతో రూపాయి మారకం విలువ 88.70గా ఉంది.

## 250 మెగావాట్స్ పవర్ ప్లాంట్ సొంతం చేసుకున్న ఎంఈఐఎల్



**హైదరాబాద్(జనంసాక్షి):** తమిళనాడులో నేవేలి వద్ద 250 మెగావాట్ల లిగ్నైట్ ఆధారిత విద్యుత్ ఉత్పత్తి కేంద్రాన్ని మేఘా ఇంజినీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ (ఎంఈఐఎల్) కొనుగోలు చేసింది.అబుదాబి కేంద్రంగా ఉన్న సంస్థ నుంచి వందశాతం వాటాను కొనుగోలు చేసినట్లు ఎంఈఐఎల్ గురువారం ప్రకటించింది. ఎంఈఐఎల్ అనుబంధ సంస్థ ఎంఈ ఐఎల్‌ఎనర్జీ ప్రైవేట్ లిమిటెడ్ (ఎంఈఐఎల్ ఎనర్జీ) తమిళనాడులోని నేవేలిలో ఉన్న టీఏక్యూఏ నేవేలి పవర్ కంపెనీ ప్రైవేట్ లిమిటెడ్ (టీఏక్యూఏ నేవేలి) సంస్థను అబుదాబి నేషనల్ ఎనర్జీ కంపెనీ పీజేఎస్‌సీ (టీఏక్యూఏ) నుంచి 100 శాతం వాటాను స్వాధీనం చేసుకుంది.ఈ స్వాధీన ప్రక్రియ ఎంఈఐఎల్ గ్రూప్ వ్యూహాత్మక పరిణామంగా చెప్పవచ్చు. ఒక పెద్ద ఈపీసీ కాంట్రాక్టర్ నుంచి అంతర్జాతీయ మౌలిక సదుపాయాల అభివృద్ధి, యాజమాన్యం, నిర్వహణలో నిమగ్నమైన సమగ్ర ఇన్‌ఫ్రా డెవలపర్‌గా మారే దిశలో కీలకమైన అడుగుగా ఎంఈఐఎల్ చేసిన ఈ కొనుగోలు నిలుస్తోంది.టీఏక్యూఏ నేవేలి 250 మెగావాట్ల సామర్థ్యం కలిగిన లిగ్నైట్ ఆధారిత విద్యుత్ కేంద్రాన్ని తమిళనాడులోని నేవేలి ప్రాంతంలో నిర్వహిస్తోంది. ఈ విద్యుత్ కేంద్రానికి ఆ రాష్ట్ర విద్యుత్ పంపిణీ సంస్థతో దీర్ఘకాలిక విద్యుత్ కొనుగోలు ఒప్పందం ఉంది. రాష్ట్ర అవసరాలకు అనుగుణంగా నిరంతర, నమ్మదగిన విద్యుత్ సరఫరా అందించడంలో ఈ యూనిట్ స్థిరమైన పనితీరు రికార్డును ఇప్పటికే నెలకొల్పింది.ప్రస్తుతం ఇంధన రంగంలో 5.2 గిగావాట్లకు పైగా విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యాన్ని ఎంఈఐఎల్ కలిగి ఉంది. తమిళనాడు ప్లాంట్ కొనుగోలు ద్వారా ఈ రంగంలో తన స్థానాన్ని సంస్థ మరింత బలపరుచుకుంటోంది. అలాగే, దేశంలో విద్యుత్ అవసరాలను తీర్చడంతో పాటు స్థిరమైన, భారీ స్థాయిలో పనిచేసే ఉత్పత్తి ఆస్తుల పోర్ట్‌ఫోలియోను నిర్మించే లక్ష్యాన్ని ముందుకు తీసుకెళ్తోంది.టీఏక్యూఏ నేవేలిని తన ప్రస్తుత విద్యుత్ ఉత్పత్తి ఆపరేషన్లలో సులభంగా సమన్వయం చేయడాన్ని ఎంఈఐఎల్ ఎనర్జీ ప్రాధాన్యంగా తీసుకుంటోంది. దీని ద్వారా ఆపరేషనల్ ఎక్సలెన్స్, సమర్థవంతమైన ఆస్తి నిర్వహణ తదితరాలను సంస్థ కట్టబడింది.ఈ సందర్భంగా ఎంఈఐఎల్ గ్రూప్ చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ సలిల్ కుమార్ మిశ్రా మాట్లాడుతూ.. "ఉన్నత నాణ్యత గల విద్యుత్ ఉత్పత్తి ఆస్తులను స్వాధీనం చేసుకోవడంలో ఇది ఒక మైలురాయిగా నిలుస్తోంది. ఈపీసీ రంగంలో మా అత్యుత్తమ నైపుణ్యాన్ని మౌలిక సదుపాయాల యాజమాన్యంతో కలిపి వ్యూహాత్మక మార్పు సాధించడానికి ఈ కొనుగోలు తోడ్పడుతుంది. మా ప్రధాన దృష్టి, దేశీయ ఇంధన భద్రతను పెంపొందించే, నమ్మదగిన విద్యుత్ సరఫరా అందించే, భారతదేశ దీర్ఘకాలిక అభివృద్ధి మద్దతు ఇచ్చే వ్యూహాత్మక పెట్టుబడులపై కొనసాగుతుంది. థర్మల్, హైడ్రో, పునరుత్పాదక శక్తి రంగాలను సమన్వయం చేసే సమతులిత, స్థిరమైన విద్యుత్ ఉత్పత్తి పోర్ట్‌ఫోలియో నిర్మాణానికి మేము కట్టుబడి ఉన్నాము" అని అన్నారు. టీఏక్యూఏ నేవేలి స్వాధీనం మా ఆర్గానిక్, ఇనార్గానిక్ వృద్ధి వ్యూహాలకు అనుగుణంగా ఉంది. భారత విద్యుత్ రంగంపై మాకు ఉన్న విశ్వాసాన్ని ఇది ప్రతిబింబిస్తోంది అని అన్నారు.

ఏఐ ఎఫెక్ట్.. యూట్యూబ్ ఉద్యోగులకు

## ఎగ్జిట్ ప్లాన్

**వాషింగ్టన్:** ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అన్ని రంగాలలోని ఉద్యోగులను ప్రభావితం చేస్తోంది. ఇప్పటికే లెక్కకు మించిన ఉద్యోగులు ఏఐ వల్ల ఉద్యోగాలను కోల్పోయారు.ఇప్పుడు తాజాగా.. ప్రముఖ వీడియో స్ట్రీమింగ్ ప్లాట్‌ఫామ్ యూట్యూబ్ ఈ జాబితాలోకి చేరింది. అయితే ఈ సంస్థ ఉద్యోగులను బలవంతంగా తొలగించడంలేదు, కానీ వాలంటరీ ఎగ్జిట్ ప్లాన్ ప్రకటించింది.ఏఐ టెక్నాలజీ వేగంగా పెరుగుతున్న సమయంలో.. యూట్యూబ్‌లో తప్పకుండా కొన్ని మార్పులు చేయాల్సి ఉంది. దీనిని దృష్టిలో ఉంచుకుని కంపెనీ ఈ నిర్ణయం తీసుకున్నట్లు సీఈఓ 'నీల్ మోహన్' ప్రస్తావించారు. కాగా పదేళ్లలో మొదటిసారి తన ప్రొడక్ట్ డివిజన్‌లో మార్పులు చేస్తున్నారు.అమెరికాలో పనిచేస్తున్న యూట్యూబ్ ఉద్యోగులు.. స్వచ్ఛందంగా తమ ఉద్యోగాన్ని వదులుకుంటే, పరిహారం కింద వారికి నిష్క్రమణ ప్యాకేజీలను అందించనున్నట్లు వెల్లడించారు. కంటెంట్ క్రియేషన్, యూజర్ ఎక్స్పీరియన్స్ వంటి వాటిని ఏఐ ప్రభావితం చేయనుంది. కొత్త మార్పులు 2025 నవంబర్ 05 నుంచి అందుబాటులో రానున్నాయి.యూట్యూబ్ మాతృ సంస్థ.. గూగుల్ తన ఉత్పత్తులు, సేవలలో కృత్రిమ మేధస్సును ఏకీకృతం చేయడానికి కృషి చేస్తోంది. ఇందులో భాగంగానే ఈ పునర్వ్యవస్థాం జరిగింది. ఏఐ సాధనాలను సమర్థవంతంగా ఉపయోగించడం ద్వారా ఉత్పాదకతను పెంచాలని సీఈఓ సీఈఓ సుందర్ పిచాయ్ కూడా తమ బృందాలను కోరారు.

**గుడ్ల ధరలు**

| హైదరాబాద్ | వరంగల్ |
| --- | --- |
| ₹ 5.70 | ₹ 5.72 |

**బంగారం ధరలు** (10 గ్రాములు)

హైదరాబాద్

| ₹ 1,11,350 (22 క్యారెట్లు) | ₹ 1,21,480 (24 క్యారెట్లు) |
| --- | --- |

**వెండి ధరలు (కేజీ)**

హైదరాబాద్

₹ 1,65,000

## ఎట్టకేలకు దొరికిన మ్యూజియం దొంగలు!



**రోమ్:** పపంచ ప్రఖ్యాతిగాంచిన లూవ్(లౌవ్) మ్యూజియం చోరీ కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ ఘటనకు సంబంధించి ఐదుగురిని అరెస్ట్ చేసినట్లు పారిస్ పోలీసులు ధృవీకరించారు.అయితే వీళ్లు పింక్ పాంథర్ ముఠా సభ్యులేనా? అనేది మాత్రం ఇంకా ధృవీకరణ కాలేదు. ప్రస్తుతం వీరిని రహస్య ప్రాంతంలో అధికారులు విచారిస్తున్నట్లు సమాచారం.అక్టోబరు 19న పారిస్‌లోని లూవ్ మ్యూజియంలో జరిగిన చోరీ ప్రపంచవ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశమైంది మ్యూజియంలో ఓ వైపు నిర్మాణం జరుగుతుండగా.. కన్‌స్ట్రక్షన్ కార్మికుల వేషాలు వుండగులు ఓ భారీ క్రేన్ ద్వారా నేరుకగా నుంచి లోపలికి చొరబడ్డారు. ఉదయం 10గం. ప్రాంతంలో సరుకు రవాణా ఎలివేటర్ ద్వారా అపోలో గ్యాలరీలోకి ప్రవేశించారు. నెపోలియన్ చక్రవర్తి కాలనాటి వస్తువులు, ఆభరణాలు ఉన్న గ్యాలరీ అద్దాలను పగలగొట్టి అందులోని తొమ్మిది వస్తువులను దొంగిలించి బయటపడ్డారు. ఇదంతా కేవలం ఏడు నిమిషాల్లోనే జరిగిపోవడం గమనార్హం.ఆ ఆభరణాల విలువ 88 మిలియన్ యూరోలు (భారత కరెన్సీలో దాదాపు రూ.895 కోట్లు) ఉంటుందని అధికారులు అంచనా వేశారు. ఈ చోరీకి పాల్పడిన దుండగులను పట్టుకునేందుకు దాదాపు 100 మందితో కూడిన అంతర్జాతీయ దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేశారు. అయితే..ప్రస్తుతం అదుపులోకి తీసుకుంది అనుమానితులా? లేదంటే దొంగలేనా? అనేది ధృవీకరణ కావాల్సి ఉంది. అలాగే నగల రికవరీ ఇంకా జరగలేదని తెలుస్తోంది. అంతేకాదు.. ఈ చోరీకి సంబంధించి మరో ఇద్దరు, ముగ్గురిని అదుపులోకి తీసుకోవాల్సి ఉందని, వాళ్లే ఈ చోరీకి ప్రధాన సూత్రధారులని తెలుస్తోంది.

**పింక్ పాంథర్ ముఠా గురించి..**

లూవ్ మ్యూజియం చోరీ వెనుక పింక్ పాంథర్ ముఠా హస్తం ఉందా? అనే అనుమానాలు వ్యక్తం అయ్యాయి. అందుకు కారణం.. చోరీ జరిగిన విధానమే!. 2001లో సెర్బియా బెల్గ్రేడ్ కేంద్రంగా డ్రాగన్ మైకిక్ అనే వ్యక్తి ఈ ముఠాను ప్రారంభించారు. ఆభరణా దొంగతనాలకు ఈ ముఠా పెట్టింది పేరు. స్మోక్ బాంబులు, గేటవే కార్లు ఉపయోగిస్తూ సినీ ఫక్కీలో చోరీలు చేయడం ఈ ముఠా స్టైల్. అందుకే 1963లో వచ్చిన ది పింక్ పాంథర్ అనే సినిమా ఆధారంగా ఇంటర్‌పోల్ ఈ గ్యాంగ్‌కు ఆ పేరు పెట్టింది.ప్రస్తుతం ఈ గ్యాంగ్‌లో సుమారు 800 మంది సభ్యులు ఉన్నారని, యుగోస్లేవియా యుద్ధంలో పాల్గొన్న మాజీ సైనికులకు ఈ ముఠాతో సంబంధాలు ఉన్నాయని చెబుతుంటారు. యూరప్, ఆసియా, మిడిల్ ఈస్ట్‌లో ఇప్పటిదాకా 370కి పైగా దొంగతనాలు చేయగా.. చోరీ చేసిన వాటి విలువ 500 మిలియన్ డాలర్లు (సుమారు రూ.4200 కోట్లు) ఉండొచ్చని అంచనా. దుబాయ్ మాల్‌లో 2007లో పట్టపగలే చేసిన భారీ చోరీ, 2004లో టోక్యోలో కాస్ట్లీ డైమండ్ దొంగతనంతో పాటు లండన్, జెనీవా మ్యూజియాల్లో విలువైన చోరీలు చేసింది ఈ పింక్ పాంథర్ గ్యాంగ్. అయితే.. ఈ ముఠా చేసిన చోరీల్లో వస్తువులు రికవరీ కావడం చాలా తక్కువ. ఆభరణాలను ముక్కలు చేసి అమ్మేస్తుండడంతో చాలా కేసులు సాల్వ్ కాకుండా ఉండిపోయాయి.

సీబీఎస్ఈ టెన్త్, 12 పరీక్షలు

## ఫిబ్రవరి 17నుంచి

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** 2026లో జరగనున్న సీబీఎస్ఈ పది, 12వ తరగతి బోర్డు పరీక్షలకు ఫైనల్ డేట్ షీట్లు విడుదలయ్యాయి. ఈ పరీక్షలు ఫిబ్రవరి 17 నుంచి ప్రారంభమవుతాయని సీబీఎస్ఈ స్పష్టం చేసింది. పదో తరగతి పరీక్షలు మార్చి 10 వరకు, 12వ తరగతి విద్యార్థులకు ఏప్రిల్ 9 వరకు ఈ పరీక్షలు నిర్వహించనున్నట్లు సీబీఎస్ఈ బోర్డు కంట్రోలర్ భరద్వాజ్ ఓ ప్రకటనలో వెల్లడించారు. రోజూ ఈ పరీక్షలు ఉదయం 10.30 గంటలకు ప్రారంభమవుతాయని తెలిపారు.పది, 12 తరగతి పరీక్షల ఫైనల్ డేట్‌షీట్ల కోసం క్లిక్ చేయండిసీబీఎస్ఈ తొమ్మిది, 11వ తరగతి విద్యార్థుల రిజిస్ట్రేషన్ డేటా ఆధారంగా గత నెలలో ఈ పరీక్షలకు తాత్కాలిక డేట్‌షీట్‌ను విడుదల చేసిన విషయాన్ని ఈ సందర్భంగా బోర్డు గుర్తు చేసింది. అయితే, అన్ని పాఠశాలలు తమ విద్యార్థుల జాబితా (ఎల్ఓసీ)లను సమర్పించడంతో ఆ డేటా ఆధారంగా తాజాగా సీబీఎస్ఈ పరీక్షల తుది డేట్ షీట్‌లను సిద్ధం చేసి విడుదల చేసినట్లు పేర్కొంది. సకాలంలో జాబితాలు ఇవ్వడం వల్లే తొలిసారి ఈ పరీక్షలకు 110 రోజుల ముందుగా తుది డేట్ షీట్‌ను విడుదల చేసినట్లు తెలిపింది. రెండు సబ్జెక్టుల మధ్య విద్యార్థులకు తగినంత సమయం ఉండేలా చూడటంతో పాటు 12వ తరగతి విద్యార్థులకు ప్రవేశ పరీక్షల తేదీలను దృష్టిలో ఉంచుకొని ఈ డేట్ షీట్‌లను సిద్ధం చేసినట్లు బోర్డు పేర్కొంది.

## నైజీరియాలో ఐఐటీ క్యాంపస్ ఏర్పాటు




**న్యూఢిల్లీ:** భారతదేశంలోని అత్యున్నత ఇంజినీరింగ్ విద్యాసంస్థల్లో ఒకటైన ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అంతర్జాతీయ విస్తరణలో భాగంగా 2026 నాటికి నైజీరియాలో క్యాంపస్‌ను ఏర్పాటు చేయనుంది.ఇది పశ్చిమ ఆఫ్రికాలో భారతదేశానికి చెందిన మొదటి ఐఐటీ క్యాంపస్ కానుంది.నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ 2020 అమలులో భాగంగా విదేశాల్లో క్యాంపస్‌లను ఏర్పాటు చేయాలని భారతీయ విశ్వవిద్యాలయాలను ప్రోత్సహిస్తున్నారు. ఈ విస్తరణ ద్వారా భారతదేశం తన అకడమిక్ సామర్థ్యాన్ని ప్రపంచంలోని ఇతర ప్రాంతాలతో పంచుకోవాలని లక్ష్యంగా పెట్టుకుంది.ఈ క్యాంపస్ ద్వారా భారత్, నైజీరియా మధ్య విద్యా, సాంకేతిక రంగాల్లో సహకారం మరింత పెరుగుతుంది.ఆఫ్రికా ఖండంలో శాస్త్ర, సాంకేతిక విద్యను ప్రోత్సహించడం ద్వారా దీర్ఘకాలిక భాగస్వామ్యాలు ఏర్పరచుకోవాలని భారత్ భావిస్తోంది.నైజీరియా ప్రభుత్వం తమ దేశాన్ని ప్రాంతీయ సాంకేతిక కేంద్రంగా మార్చాలని లక్ష్యంగా పెట్టుకుంది. ప్రపంచ స్థాయి విద్యాసంస్థ అయిన ఐఐటీ ఏర్పాటుతో ఈ లక్ష్యం వేగవంతమవుతుందని నైజీరియా విశ్వసిస్తోంది.నైజీరియా విద్యార్థులకు స్వదేశంలోనే నాణ్యమైన ఇంజినీరింగ్, సాంకేతిక విద్యను అందించడానికి ఈ భారత ఐఐటీ ఉపయోగపడుతుంది. ఇది 'బ్రెయిన్ డ్రెయిన్'(ఉన్నత విద్య కోసం విద్యార్థులు విదేశాలకు వెళ్లడం) సమస్యను తగ్గించడానికి కూడా సహాయపడుతుంది. నైజీరియాలో ఐఐటీ క్యాంపస్ ఏర్పాటుకు సంబంధించిన పనులు ప్రణాళిక దశలో ఉన్నాయి. ఈ క్యాంపస్ సుళేజాలోని ఫెడరల్ గవర్నమెంట్ అకాడమీలో ఏర్పాటు కానుంది. ఈ ప్రాంగణాన్ని 'నైజీరియన్ అకాడమీ ఫర్ ది గిఫ్టెడ్' అని కూడా పిలుస్తారు. ఈ అకాడమీని భారత్ సహకారంతో 'సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్'గా మార్చనున్నారు. ఈ క్యాంపస్‌లో అధ్యాపకుల నియామకం, కోర్సుల రూపకల్పనను పర్యవేక్షించడానికి ఇండియా, నైజీరియాకు చెందిన సంయుక్త బృందం పని చేస్తుంది.2026 నాటికి గ్రాడ్యుయేషన్, పోస్ట్ గ్రాడ్యుయేషన్ విద్యార్థుల మొదటి బ్యాచ్ ప్రారంభమవుతుందని భావిస్తున్నారు. క్యాంపస్ మౌలిక సదుపాయాలు, లాజిస్టిక్స్‌ను నైజీరియా ప్రభుత్వం నిర్వహిస్తుంది. ప్రస్తుతానికి ఈ క్యాంపస్‌లో ప్రవేశానికి సంబంధించిన ఖచ్చితమైన తుది వివరాలు ఇంకా ప్రకటించలేదు. ఇప్పటికే నవంబర్ 2023లో టాంజానియాలో భారత్ ఐఐటీ క్యాంపస్‌ను ఏర్పాటు చేసింది.

### కారులో మహిళ..

### కళ్లు తెరిచేంతలో మృతి

**పూణె:** ప్రతిమనిషికి ఏదో ఒకరోజు మృత్యువు సంభవిస్తుందనేది అందరికీ తెలిసిందే. అయితే అది ఎలా వస్తుందనేది ఎవరూ చెప్పలేరు. కొందరికి ఎవరూ ఊహించని విధంగా మృత్యువు వాటిల్లుతుంది.ఇటువంటి ఘటనే అత్యంత భీకరైన కారులో విలాసవంతగా వెళుతున్న మహిళకు ఎదురయ్యింది. పూణే నుండి మాంగావ్‌కు వోక్స్‌వ్యాగన్ వర్టస్ కారులో వెళుతున్న ఒక మహిళ అకస్మాత్తుగా మృత్యువాత పడింది.కొండపై నుంచి ఒక పెద్ద బండరాయి ఆమె వెళుతున్న కారుపై పడి, అది కారు సన్‌రూఫ్‌ను చీల్చుకుని, అమాంతం కారులోని ఆమెపై పడింది. ఈ ఘటనలో ఆమె అక్కడికక్కడే మృతిచెందింది. మృతురాలిని గుజరాత్‌కు చెందిన స్నేహల్(43)గా పోలీసులు గుర్తించారు. ఈ ఘటన మహారాష్ట్రలోని తమ్హిని ఘాట్‌లో చోటుచేసుకుంది.

# తాలిబన్లను తుడిచిపెట్టేస్తాం

- మాతో పెట్టుకుంటే మీరు మళ్లీ గుహల్లోకే..
- పాక్ రక్షణ మంత్రి ఆసిఫ్ బెదిరింపులు



**న్యూఢిల్లీ:** మళ్లీ మా దేశంలో దాడి జరిగితే వారిని తిరిగి గుహలకు పంపుతాం శాంతి చర్చలు విఫలమైన వేళ పాక్ రక్షణ మంత్రి ఆసిఫ్ బెదిరింపు ఇస్లామాబాద్: అఫ్గనిస్థాన్ నుంచి తమ దేశంలో మళ్లీ ఉగ్రవాద దాడులు జరిగితే ఆ దేశంలో అధి కారంలో ఉన్న తాలిబన్లను తుడిచిపెట్టేస్తామని పాకిస్థాన్ రక్షణ మంత్రి ఖ్వాజా ఆసిఫ్ హెచ్చ రించారు.సోదర దేశంగా శాంతి నెలకొల్పేందు కు అఫ్గనిస్థాన్‌కు ఒక అవకాశం ఇచ్చామని, కా నీ.. ఆ దేశంలోని కొందరు నేతలు చేస్తున్న ప్రక టనలు తాలిబన్ల సంకుచిత బుద్ధిని బయటపెడు తున్నాయని మండిపడ్డారు. ఈ మేరకు బుధ వారం ఆయన సోషల్‌మీడియాలో పోస్ట్ చేశారు. 'పాకిస్థాన్‌కు ఉన్న ఆయుధాల్లో చిన్న భాగాన్ని వాడినా తాలిబన్ల పాలనను అంతం చేసి, వారిని తిరిగి గుహల్లోకి తరమగలం.వాళ్లు అదే గనుక కోరుకుంటే.. గతంలో మాదిరిగానే తోకలు ము దుచుకుని తోరాబోరా గుహల్లోకి మళ్లీ వెళ్లగలు తీయటం అక్కడి ప్రజలు చూస్తారు. తాలిబన్లు పోరాటాన్నే కోరుకుంటే.. వారి సర్కస్ ఫీట్లను ప్రపంచం మొత్తం చూస్తుంది. మీ ట్రోఫీని, అపహాస్యాన్ని చాలాకాలంగా భరిస్తున్నాం. ఇక భరించేది లేదు. పాకిస్థాన్‌లో ఉగ్రదాడి జరిగినా, ఆత్మాహుతి దాడి జరిగినా.. ఆ దుస్సాహసానికి పనికిరాని ప్రతిఫలాన్ని రుచి చూస్తారు. మా శక్తిసా మర్థ్యాలను పరీక్షించాలని చూస్తే.. అదే మీ అంతం అవుతుంది. అఫ్గనిస్థాన్‌ను సామ్రాజ్యాల స్మశానం అంటుంటారు కదా! పాకిస్థాన్ సామ్రాజ్యం కాదు. కానీ, అఫ్గనిస్థాన్ మాత్రం కచ్చితంగా వారి సొంత ప్రజల స్మశానం. నిజానికి మీ దేశం సామ్రాజ్యాల స్మశానం కాదు. మీ చరిత్ర మొత్తం సామ్రాజ్యాల ఆట స్థలం'అని ఎద్దేవా చేశారు.పాకిస్థాన్- అఫ్గనిస్థాన్ మధ్య కొద్దిరోజులుగా టర్కీలోని ఇస్తాంబుల్‌లో జరుగుతున్న శాంతి చర్చలు విఫలమయ్యాయి. తమ దేశంలో దాడులకు పాల్పడుతున్న ఉగ్రవాదులకు ఆశ్రయం కల్పించటాన్ని ఆపేయాలన్న పాకిస్థాన్ ప్రధాన డిమాండ్‌కు అఫ్గనిస్థాన్‌లోని తాలిబన్ పాలకులు అంగీకరించకపోవటంతో చర్చల్లో ప్రతిష్టంభన ఏర్పడింది. టర్కీ మధ్యవర్తిత్వంతో గత శనివారం నుంచి జరుగుతున్న చర్చలు ఎలాంటి ఫలితం లేకుండానే ముగిశాయని పాకిస్థాన్ సమాచా ర శాఖ మంత్రి అత్తౌల్లా తరార్ బుధవారం ప్రకటించారు.ఉగ్రవాదులను నిర్మూలించటంలో అఫ్గనిస్థాన్ నుంచి దీర్ఘకాలిక సహకారాన్ని ఆశించామని, సీమాంతర ఉగ్రవాద నిర్మూలన కోసం అఫ్గనిస్థాన్‌లో తాలిబన్ల పాలన ప్రారంభమైనప్పటి నుంచి సంప్రదింపులు జరుపుతూనే ఉన్నామని చెప్పారు. దోహాలో తాలిబన్లు రాత పూర్వకంగా ఇచ్చిన హామీని అమలుచేయాలని కోరినా అటువైపు నుంచి సానుకూల స్పందన రాలేదని ఆరోపించారు. పాకిస్థాన్ ఎప్పుడూ శాంతినే కోరుకుంటుందని, శాంతి స్థాపన కోసం ఎన్నో త్యాగాలు చేసిందని చెప్పుకొచ్చారు. చర్చల విఫలంపై కాబూల్ నుంచి ఎలాంటి ప్రకటన రాలేదు. మరోవైపు తమ ప్రజల భద్రత, శాంతి కోసం వీలైనన్ని మార్గాల్లో చర్చల ప్రక్రియ కొనసాగిస్తూనే ఉంటామని పాకిస్థాన్ సైనిక వర్గాలు తెలిపాయి.

### కుమారుల పోటీపై

### రబ్రీ సంచలన వ్యాఖ్యలు

**పట్నా:** బీహార్‌లో ఎన్నికల వేడి కొనసాగుతోంది. రాజకీయ పార్టీలన్నీ ప్రచారంలో మునిగితేలుతున్నాయి. ఇంతలో ఆర్జేడీ చీఫ్ లాలూ భార్య రబ్రీదేవి తన కుమారుల పోటీపై వ్యాఖ్యానించారు.తన కుమారుడు, జనశక్తి జనతాదళ్ (జేజేడీ)అధినేత తేజ్ ప్రతాప్ యాదవ్ ఎన్నికల్లో పోటీ చేయడంపై ఆమె మాట్లాడుతూ, ఆయన పోటీ చేయనివ్వాలని, ఆయన తన ప్రాతినిధ్య స్థానం నుంచే పోటీ చేస్తున్నారని అన్నారు.ప్రధాని మోదీ నేతృత్వంలోని ప్రభుత్వం దేశాన్ని అమ్మేసిందని, దబ్బంతా ప్రధాని మోదీ ఇంటికి చేరిందని రబ్రీదేవి వ్యాఖ్యానించారు. బీహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్ రూ. 70 వేల కోట్ల మోసానికి పాల్పడ్డారని, కానీ దానిపై ఎక్కడా చర్చ జరగలేదన్నారు. లాలూ ఎలాంటి తప్పు చేయలేదని, తాము కోర్టులో కేసును ఎదుర్కొంటామన్నారు. ఈ సారి మా కుమారుడు, మహా కూటమి ముఖ్యమంత్రి అభ్యర్థి తేజస్వి యాదవ్ విజయంపై రబ్రీ దేవి నమ్మకం వ్యక్తం చేశారు. బీహార్ ప్రజలు ఆయనను ముఖ్యమంత్రిగా చేయాలని నిర్ణయించుకున్నారు" అన్నారు.



# ప్రకృతి ప్రతాపం రైతన్నకు శాపం

## తెలంగాణ రైతాంగం కష్టం గంగలో కలిసింది

### మొంథా తుఫాన్ మిగిల్చిన మహా విషాదం

ఆకాశం కారు మబ్బులు... భూమి మీద కన్నీటి వాన. మొంథా తుఫాన్ ప్రతాపం ఒక్క రాత్రిలో రాజన్న సిరిసిల్ల, కరీంనగర్ జిల్లాల అన్నదాతల గుండెల్ని చీల్చేసింది. ఆరుగాలం చెమటోడ్చి, అప్పుల బరువు మోసి, కడుపు కోసం కాళ్లు రాపోసుకుని పండించిన వరి ధాన్యం... కళ్లముందే నీటి మునిగి ముద్దై మొలకెత్తడం చూసి రైతులు గుండెలు పగిలేలా ఏడ్చారు. "అమ్మా... మా కష్టం ఇదేనా ఫలితం?" అంటూ గంభీరావుపేట కొనుగోలు కేంద్రం వద్ద ఓ రైతు ఆకాశం వైపు చూసి అరచాడు. చిగురుమామిడి మండలంలోని రేకొండ గ్రామంలో గందె రాజేశ్వరి కళ్లనీళ్లు ఆగలేదు... వరదలో కొట్టుకుపోయిన నాలుగు పాడి ఆవుల్ని గుర్తుచేసుకుని గుండెలు బాదుకుంది. కథలాపూర్‌లో రోడ్డుపై ఆరబెట్టిన వేల క్వింటాళ్ల ధాన్యం... ఒక్కసారి వర్షం కురిసి ఉప్పొంగి ముద్దైంది. "మా పిల్లల పాలు, పుస్తకాలు... ఇల్లు నడపడానికి ఈ ధాన్యమే ఆధారం" అంటూ రైతాంగం ఏడ్చింది. షెల్టర్లు లేక, కవర్లు లేక... రాత్రి వరద ప్రవాహం ధాన్య కుప్పల్ని ముంచెత్తింది. గత వారం నుంచి మాయిశ్చర్ ఎక్కువని కొనుగోలు చేయని అధికారుల నిర్లక్ష్యం... రైతుల జీవితాల్ని అంధకారంలోకి నెట్టింది. పత్తి, మొక్కజొన్న పంటలు నేలకొరిగాయి. సదాశివనగర్‌లో వెంకట్రావు 5 ఎకరాల మొక్కజొన్న రోడ్డుపై మొలకెత్తి కన్నీళ్లు తెప్పించింది. "ప్రభుత్వమే కొనాలి... లేదంటే మా కుటుంబాలు రోడ్డున పడతాయి" అంటూ వేడుకున్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ పర్యటనలో "అధైర్యపడొద్దు... ప్రభుత్వం ఆదుకుంటుంది" అని హామీ ఇచ్చారు. కానీ రైతుల గుండెల్లో ఆశలు మాత్రం ఇంకా మొగ్గలేదు... ఆత్మహత్యే శరణ్యమన్న మాటలు గాలిలో కలిసిపోతున్నాయి.



**షెల్టర్లు, టార్పాలిన్ కవర్లు కొరత**

కొనుగోలు కేంద్రాల్లో తగిన షెల్టర్లు, టార్పాలిన్ కవర్లు లేకపోవడం, వర్షం కురుస్తున్నా కవర్లు కప్పడంలో నిర్లక్ష్యం నష్టానికి ప్రధాన కారణమని రైతులు ఆరోపిస్తున్నారు. గత రెండు సంవత్సరాలుగా క్వింటాల్‌కు రూ.500 బోనస్ ఇవ్వకపోవడం, రేకొండ-ఎక్లాస్ పూర్ రోడ్డుపై బ్రిడ్జి నిర్మాణానికి రూ.2.27 కోట్లు మంజూరైనా రెండేళ్లుగా పనులు ప్రారంభం కాలేదని విపక్షాలు మండిపడ్డాయి. రేకొండ గ్రామం జలదిగ్బంధంలో చిక్కుకుపోయింది. యూరియా బస్తాలతో ఇబ్బంది పడ్డ రైతులు ఇప్పుడు అకాల వర్షాలతో తీవ్ర నష్టపోతున్నారు.

**వరదలో పాడి ఆవులు మృతి**

ఏరుకొండ గ్రామంలో రమేష్‌కు చెందిన నాలుగు పాడి ఆవులు వాగులో కొట్టుకుపోయి మృతి చెందాయి. ఇతర గ్రామాల్లోనూ పశువులు మరణించాయి. "పాలు, ఆదాయం... ఇల్లు నడపడానికి ఆధారం" అంటూ కుటుంబాలు రోదిస్తున్నాయి. మృత ఆవులకు రూ.3 లక్షలు పరిహారం ఇవ్వాలని నేతలు డిమాండ్ చేశారు. తక్షణ సర్వే, ఎకరాకు రూ.50 వేల పరిహారం డిమాండ్

- తీవ్ర తుఫాను తీరం దాటి తెలుగు రాష్ట్రాల్లో కల్లోలం చేసింది
- కొనుగోలు కేంద్రాల్లో వేల క్వింటాళ్ల వరి ధాన్యం తడిసి ముద్దయింది
- పత్తి, మొక్కజొన్న పంటలు వేల ఎకరాల్లో నాశనమైంది
- ప్రభుత్వ నిర్లక్ష్యంతో షెల్టర్లు, టార్పాలిన్ కవర్లు కొరత
- వరదలో పాడి ఆవులు మృతి.. రోడ్డున పడ్డ కుటుంబాలు
- తక్షణ సర్వే, ఎకరాకు రూ.50 వేల పరిహారం విపక్షాల డిమాండ్
- 'అధైర్యపడొద్దు, పూర్తిగా ఆదుకుంటాం' మంత్రి హామీ



ముత్తారం మండలంలో



గంభీరావుపేట మండల కేంద్రంలో

**రాజన్న సిరిసిల్ల ప్రతినిధి /కరీంనగర్/జమ్మికుంట/ముత్తారం/ గంభీరావుపేట, అక్టోబర్ 30 (జనంసాక్షి):**

బంగాళాఖాతంలో ఏర్పడిన మొంథా తీవ్ర తుఫాన్ బుధవారం రాత్రి ఆంధ్రప్రదేశ్ తీరాన్ని దాటి తెలుగు రాష్ట్రాల్లో మహావిధ్వంసం సృష్టించింది. రాజన్న సిరిసిల్ల, కరీంనగర్ జిల్లాల్లో ఎడతెరిపి లేకుండా కురిసిన అకాల వర్షాలు అన్నదాతలను కన్నీటి సముద్రంలో ముంచెత్తాయి. ఆరుగాలం చెమటోడ్చి, అప్పులు చేసి, కడుపు కోసం కష్టపడి పండించిన వరి, పత్తి, మొక్కజొన్న పంటలు వేల ఎకరాల్లో నీట మునిగి, మొలకెత్తి, కుళ్లి పూర్తిగా నాశనమయ్యాయి. కొనుగోలు కేంద్రాల్లో అరబెట్టిన వేలాది క్వింటాళ్ల వరి ధాన్యం రాత్రి వరద ప్రవాహంతో తడిసి ముద్దైంది. పాడి ఆవులు కొట్టుకుపోయి మృతి చెందాయి. రైతులు గుండెలు పగిలేలా ఏడుస్తూ ప్రభుత్వం నుంచి తక్షణ సర్వే, పూర్తి పరిహారం డిమాండ్ చేస్తున్నారు. రవాణా మంత్రి పొన్నం ప్రభాకర్ పర్యటించి హామీ ఇచ్చారు. సీపీఐ, బీఆర్ఎస్, బీజేపీ నేతలు ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని తప్పుపట్టి ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఆత్మహత్యల భయం రైతులను ఆందోళనకు గురిచేస్తోంది. మొంథా తుఫాన్ బుధవారం రాత్రి ఏకధాటిగా ఆంధ్ర తీరాన్ని దాటడంతో తెలంగాణలో భారీ వర్షాలు కురిశాయి. రాజన్న సిరిసిల్ల,



సదాశివ నగర్ మండలంలోని తుక్కోజువాడ గ్రామంలో వెంకట్రావు అనే రైతు

కరీంనగర్ జిల్లాల్లో రాత్రి 8 గంటల నుంచి గురువారం ఉదయం 10 గంటల వరకు ఎడతెరిపి లేకుండా వర్షం పడింది. మానేరు నది ఉద్ధృతంగా ప్రవహించి పరివాహక ప్రాంతాల్లోని గ్రామాలను జలదిగ్బంధం చేసింది. ముత్తారం మండల ఎంపీడీఓ సురేష్ పర్యటించి ఓడేడు, ముత్తారం, పారుపల్లి, అడవిశ్రీరాంపూర్, ఖమ్మంపల్లి గ్రామాల్లో నది పొంగి ప్రవహించడం పరిశీలించారు. ప్రజలు, రైతులు మానేరు చుట్టుపక్కలకు వెళ్లవద్దని, మోటార్లు, పశువుల కోసం రిస్క్ చేయవద్దని హెచ్చరించారు.

**కొనుగోలు కేంద్రాల్లో వేలాది క్వింటాళ్ల వరి ధాన్యం :**

గంభీరావుపేట, కథలాపూర్, చిగురుమామిడి, రుద్రంగి, జమ్మికుంట మండలాల కొనుగోలు కేంద్రాల్లో గత వారం నుంచి రైతులు అరబెట్టిన 10 వేలకు పైగా క్వింటాళ్ల వరి ధాన్యం రాత్రి వరద ప్రవాహంతో పూర్తిగా తడిసింది. మాయిశ్చర్ 20-25 శాతం ఉందని అధికారులు కొనుగోలు చేయకపోవడంతో బహిరంగంగా పోసిన ధాన్యం ఉబ్బి, మొలకెత్తి, ముద్దైంది. "ఆరు నెలల కష్టం, రూ.50 వేల అప్పు... ఒక్క రాత్రిలో నీటిపాలైంది" అంటూ రైతులు బోరున విలపించారు. తడిసిన ధాన్యానికి మద్దతు ధర ఇవ్వాలని, మాయిశ్చర్ కండిషన్ లేకుండా కొనుగోలు వేగవంతం చేయాలని డిమాండ్ చేశారు. లారీల సమస్యతో రవాణా ఆలస్యమవుతోంది. 15 రోజులుగా ఆరని ధాన్యంతో తాత్పత్తుల ఖర్చు భారం పడుతోంది.

**వేల ఎకరాల్లో నీట మునిగిన వరి పంట**

చిగురుమామిడి మండలంలో 17 గ్రామాల్లో 5 వేల ఎకరాలకు పైగా వరి పంటలు నీట మునిగాయి. గంభీరావుపేట మండలంలో పొన్నాలపల్లి, లక్ష్మీపూర్, నాగంపేట్, దమ్మన్నపేట్, గోరంటాల, లింగాపూర్, కొత్తపెల్లి, మల్లారెడ్డిపేట్, లింగన్నపేట్ గ్రామాల్లో 3 వేల ఎకరాల వరి పొలాలు పూర్తిగా నీట మునిగాయి. కోసిన ధాన్యం రోడ్లపై, పొలాల్లోనే మొలకెత్తింది. మే- జూన్ నుంచి అక్టోబర్ చివరి వరకు కురిసిన వర్షాలు మొదట సాగుకు ఉపయోగపడ్డాయి. ఇప్పుడు కోత సమయంలో అకాల వర్షాలు పంటను నాశనం చేశాయి. హార్వెస్టర్ గంటకు రూ.1,500-2,000 ఖర్చు పడుతుండగా, తేమ వల్ల రెండు గంటలు పట్టి ఎకరాకు రూ.2,000-5,000 అదనపు ఖర్చు వస్తోంది. "చేతికొచ్చిన పంట చేజారిపోయింది" అంటూ రైతులు నిరాశ వ్యక్తం చేస్తున్నారు.

**రైతును ఆర్థికంగా కేదేలు చేసిన పత్తి**

చిగురుమామిడి, గంభీరావుపేట, కథలాపూర్ మండలాల్లో 2 వేల ఎకరాలకు పైగా పత్తి పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. పూత, కాయల దశలో ఉన్న పత్తి మొక్కలు నీట మునిగి కాయలు కుళ్లిపోయాయి. ఆరబెట్టిన పత్తి గింజలు రోడ్లపై తడిసి నాణ్యత కోల్పోయాయి. ఎకరాకు రూ.40-50 వేల పెట్టుబడి పెట్టిన రైతులు పూర్తి నష్టంలో పడ్డారు. "పత్తి మార్కెట్ ధరలు బాగున్నాయి... ఇప్పుడు ఏమీ మిగల్లేదు" అంటూ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రేకొండ గ్రామంలో గందె రాజేశ్వరి 3 ఎకరాల పత్తి పంట పూర్తిగా నాశనమైంది.

**రోడ్లపై ఆరబెట్టిన మొలకెత్తిన మొక్కజొన్న**

సదాశివనగర్ మండలం తుక్కోజువాడలో వెంకట్రావు 5 ఎకరాల మొక్కజొన్న పంట కోసి రోడ్డుపై ఆరబెట్టాడు. రాత్రి వర్షంతో గింజలు పూర్తిగా తడిసి మొలకెత్తాయి. ఎకరాకు రూ.30-35 వేల పెట్టుబడి పెట్టిన రైతులు నష్టంలో పడ్డారు. గంభీరావుపేట, చిగురుమామిడి మండలాల్లో 1,500 ఎకరాల మొక్కజొన్న పంటలు నీట మునిగాయి. "మొక్కజొన్న మార్కెట్‌కు వెళ్లాల్సిన గింజలు మొలకలయ్యాయి" అంటూ వెంకట్రావు కన్నీళ్లు ఆగలేదు.

**షెల్టర్లు, టార్పాలిన్ కవర్లు, డ్రైయర్లు కొరత**

కొనుగోలు కేంద్రాల్లో తగిన షెల్టర్లు, టార్పాలిన్ కవర్లు, డ్రైయర్ యూనిట్లు లేకపోవడం నష్టానికి ప్రధాన కారణమని రైతులు ఆరోపిస్తున్నారు. వర్షం కురుస్తున్నా కవర్లు కప్పడంలో నిర్లక్ష్యం జరిగింది. గత రెండు సంవత్సరాలుగా క్వింటాల్‌కు రూ.500 బోనస్ ఇవ్వకపోవడం, రేకొండ-ఎక్లాస్ పూర్ రోడ్డుపై రూ.2.27 కోట్ల బ్రిడ్జి మంజూరైనా పనులు ప్రారంభం కాలేదు. యూరియా బస్తాలతో ఇబ్బంది పడ్డ రైతులు ఇప్పుడు అకాల వర్షాలతో తీవ్ర నష్టపోతున్నారు.

వరదలో పాడి ఆవులు మృతి: కుటుంబాల ఆధారం కోల్పోయాయి

ఏరుకొండ గ్రామంలో రమేష్‌కు చెందిన నాలుగు పాడి ఆవులు వాగులో కొట్టుకుపోయి మృతి చెందాయి. రేకొండలో గందె రాజేశ్వరి, దుడ్డేల లక్ష్మీనారాయణ, రొంటాల రాజయ్య, గుర్రాల మహేందర్ రెడ్డి పశువులు మరణించాయి. "రోజుకు 20-30 లీటర్ల పాలు... ఇల్లు నడపడానికి ఆధారం" అంటూ కుటుంబాలు రోదిస్తున్నాయి. మృత ఆవులకు రూ.3 లక్షలు పరిహారం ఇవ్వాలని డిమాండ్.

**ఎకరాకు రూ.50 వేల పరిహారం, తక్షణ సర్వేకు విపక్షాల డిమాండ్**



సీపీఐ నాగెల్లి లక్ష్మారెడ్డి, బీఆర్ఎస్ మామిడి అంజయ్య, ముద్రకోల రాజయ్య, కోమటిరెడ్డి జైపాల్ రెడ్డి, మామిడి రాజేశ్వరి, అల్లెపు సంపత్, పైడిపల్లి వెంకటేష్, బోయిని పటేల్, మొగిలి ఓదెలు, విలాసాగరం అంజయ్య, తమ్మిశెట్టి రవీందర్, మాజీ ఎంపీటీసీ పరకాల కొండయ్య తదితరులు పరిశీలించి ఎకరాకు వరికి రూ.50 వేలు, పత్తికి రూ.40 వేలు, మొక్కజొన్నకు రూ.30 వేలు డిమాండ్ చేశారు. బీజేపీ మారుతి, ఎర్రబెల్లి సంపత్ రావు, రాచమడుగు వెంకటేశ్వర్రావు, కొడిపెల్లి గోపాల్ రెడ్డి, కథలాపూర్ మహేష్, గడ్డం జీవన్ రెడ్డి, కాసోజీ ప్రతాప్, మల్యాల శ్రీకర్, అందే భూమేష్, తాలుక మల్లేష్ మాయిశ్చర్ లేకుండా కొనుగోలు, పాలిథిన్ కవర్లు డిమాండ్ చేశారు. సెస్ ఆకుల గంగారం, గంగం సరూప రాణి, మంచే రాజేశం, గంగం మహేందర్, చెప్పాల గణేష్, ఉప్పులూటి గణేష్, ఆకుల గంగాధర్, ఎండి బాబా, దయ్యాల పెద్దులు, నేవూరి చంద్రం, గెంట ప్రశాంత్, కొడగంటి శ్యాంసుందర్, కాదాసు లక్ష్మణ్ వెంటనే ధాన్యం కొనుగోలు డిమాండ్ చేశారు. ఉద్యమిస్తామని హెచ్చరించారు.

**'అధైర్యపడొద్దు, పూర్తిగా ఆదుకుంటాం' మంత్రి పొన్నం**

మంత్రి పొన్నం ప్రభాకర్ చిగురుమామిడి మండలంలో సీతారాంపూర్ చౌరస్తా నుంచి గ్రామం లోపలికి దెబ్బతిన్న రోడ్డు, కూలిన విద్యుత్ స్తంభాలు, ఇసుక మేటలు పోసుకుపోయిన పంట పొలాలు, ఇందుర్తి-కోహెడ మధ్య లోలెవల్ బ్రిడ్జిపై వరద ప్రవాహం పరిశీలించారు. కలెక్టర్ పమేలా సత్పతి, అడిషనల్ కలెక్టర్ అశ్వినీ తానాజీ, సీపీ గౌస్ ఆలం, చైర్మన్ తిరుపతి రెడ్డి ఉన్నారు. "అధైర్యపడొద్దు, ప్రభుత్వం పూర్తిగా ఆదుకుంటుంది" అని హామీ ఇచ్చారు. నష్టాలు రికార్డ్ చేయాలని ఆదేశించారు. హైలెవల్ బ్రిడ్జి మంజూరు, సీఎంకు రిప్రజెంటేషన్ ఇస్తామని చెప్పారు.

"పేరుకే రైతు రాజు... మిగిలేది శూన్యం" అంటూ రైతులు నిరాశ వ్యక్తం చేస్తున్నారు. నీటి లేక పంట ఎండిపోతే నష్టం, అధిక వర్షాలు పడితే నష్టం... యువత వ్యవసాయానికి ముఖం చాటేస్తోంది. "ప్రభుత్వం ఆదుకోకపోతే ఆత్మహత్యే శరణ్యం" అని రైతులు ఆందోళన చెందుతున్నారు. వెంటనే సర్వే, పరిహారం చెల్లించాలని డిమాండ్. లేకపోతే ఆందోళనలు తప్పవని విపక్షాలు హెచ్చరిస్తున్నాయి.



చిగురుమామిడి మండలంలోని



చిగురుమామిడి మండలంలో..



కథలాపూర్ మండల కేంద్రంలో...



రుద్రంగి మార్కెట్ యార్డులో

# అకాల వర్షాలతో నష్టపోయిన రైతులను ఆదుకుంటాం

- చివరి గింజ వరకు ధాన్యం కొనుగోలు చేస్తాం : ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

**గంగాధర, అక్టోబర్ 30 (జనంసాక్షి):**

అకాల వర్షాలతో తడిసిన ధాన్యాన్ని చివరి గింజ వరకు కొనుగోలు చేసి నష్టపోయిన రైతులు ఆదుకుంటామని రైతులు ఆందోళన చెందవద్దని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. గురువారం మండలంలో వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో గంగాధర, మంగపేట, ఇస్లాంపూర్. గ్రామాలలోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అకాల వర్షాలతో నష్టపోయిన రైతులను అన్ని విధాలుగా ఆదుకుంటామని రైతులకు ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు తడిసిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. కేంద్రాలకు ధాన్యం తీసుకువచ్చే రైతులకు ఇబ్బందులు కలుగకుండా నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. కేంద్రాల వద్ద తాగునీరు సౌకర్యం విద్యుత్ ఏర్పాటు చేయాలని రైతుల కోసం నీడ ఏర్పాటు చేయాలని సూచించారు. కొనుగోలు కేంద్రాలలో రైతుల వివరాలను నమోదు చేసుకొని తేమ శాతం వచ్చిన ధాన్యాన్ని వెంటనే తూకం వేసి మిల్లులకు తరలించాలని సూచించారు.



కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

ప్రతిపక్షాల మాటలు నమ్మి రైతులు ఆందోళనకు గురికావద్దన్నారు సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తానని రైతులకు భరోసా కల్పించారు.

ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ జాగిరపు రజిత శ్రీనివాస్ రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ దూలం బాలగౌడ్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తోట కరుణాకర్, సింగిల్ విండో వైస్ చైర్మన్ వేముల భాస్కర్, తహసిల్దార్ అంబటి రజిత, ఎంపీడీవో ధమ్మని రాము, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పురుమల్ల మనోహర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దుబ్బాసి బుచ్చయ్య, నాయకులు పడాల రాజన్న, సాగి అజయ్ రావు. దోర్నాల శ్రీనివాస్ రెడ్డి, రోమాల రమేష్. పడితపల్లి కిషన్. గుజ్జుల బాపురెడ్డి. గడ్డం అంజయ్య, కరుణాకర్, బెజ్జంకి కళ్యాణ్, చందు, మధు, రాచమల్ల భాస్కర్, మంత్రి మహేందర్, గంగాధర ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

# వడ్ల కొనుగోళ్లు వేగవంతం చేయండి

- అదనపు కలెక్టర్ లత ఆకస్మిక తనిఖీ
- అల్లీపూర్ కేంద్రంలో ధాన్యం రిజిస్టర్లు పరిశీలన
- తుఫాన్ ప్రభావంతో రైతులు జాగ్రత్తలు తీసుకోవాలి
- అధికారులు, రైతులతో చర్చలు



**రాయికల్, అక్టోబర్ 30 (జనంసాక్షి) :** మొంథా తుఫాన్ ప్రభావంతో కురిసిన భారీ వర్షాల నేపథ్యంలో వడ్ల కొనుగోళ్లు సజావుగా సాగాలని అదనపు కలెక్టర్ బి.ఎస్. లత స్పష్టం చేశారు. రాయికల్ మండలంలోని అల్లీపూర్ రైతు ఉత్పత్తి దారుల కంపెనీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వడ్ల కొనుగోలు కేంద్రాన్ని గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ధాన్యం నిలువల రిజిస్టర్లు, కొనుగోళ్ల ప్రక్రియలు పరిశీలించారు. రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, కొనుగోళ్లను వేగవంతం చేయాలని నిర్వాహకులకు సూచించారు. ఈ తనిఖీలో ట్రైయినీ కలెక్టర్ కన్నం హరిణి, చైర్మన్ అత్తినేని శంకర్, డైరెక్టర్ రత్నాకర్ రావు, కార్యదర్శులు రాకేష్, రాజేష్ తదితర అధికారులు, రైతులు పాల్గొన్నారు. అల్లీపూర్ కొనుగోలు కేంద్రంలో రైతులు తమ వడ్ల ధాన్యాన్ని అమ్ముకోవడానికి పెద్ద ఎత్తున ఆశ్రయిస్తున్నారు. అదనపు కలెక్టర్ లత ఆకస్మిక తనిఖీలో ధాన్యం నిలువల రిజిస్టర్లు, తూకాలు, చెల్లింపుల వివరాలు ముస్తీబద్ధంగా పరిశీలించారు. తుఫాన్ వల్ల ధాన్యం తడిసిపోకుండా చూడాలని, రైతులు త్వరగా కేంద్రాలకు తీసుకువచ్చి అమ్ముకోవాలని సూచించారు.

# ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమి పూజ





- ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలి
- పారిశుద్ధ్య పనుల తీరు పరిశీలన
- మున్సిపాలిటీ పరిధిలోని ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పనుల తీరుపై జిల్లా కలెక్టర్ ఆరా

**కామారెడ్డి జిల్లా ప్రతినిధి అక్టోబర్ 30 (జనం సాక్షి) :** వర్షాల కారణంగా పట్టణంలో పారిశుద్ధ్య పరిస్థితులు ప్రభావితమవుతున్న నేపథ్యంలో మున్సిపాలిటీ పరిధిలో రాజంపేట పారిశుద్ధ్య పనుల తీరును ప్రత్యక్షంగా పరిశీలించారు. మురుగు నీటి పారుదల, చెత్త సేకరణ, రోడ్ల శుభ్రత వంటి అంశాలను పరిశీలించి సంబంధిత అధికారులకు తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజల ఆరోగ్య భద్రత దృష్ట్యా నీటి నిల్వలు లేకుండా చూడాలని, చెత్తను సమయానికి తరలించడంతో పాటు, శానిటేషన్ వర్కర్లు పర్యవేక్షణలో ఉండేలా చూడాలని సూచించారు. వర్షాకాలంలో వ్యాధుల వ్యాప్తిని నివారించేందుకు పారిశుద్ధ్యం అత్యంత ప్రాధాన్యత కలిగినదని అధికారులు, మున్సిపల్ సిబ్బంది అప్రమత్తంగా ఉండి పారిశుద్ధ్యం పై ప్రత్యేక చర్యలు చేపట్టాలని అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనుల తీరును పరిశీలించారు. అనంతరం రాజంపేట లో లబ్ధిదారులు నిర్మించుకుంటున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పనుల పురోగతిని పరిశీలించి, మాట్లాడుతూ.. నిరుపేదలకు గూడు కల్పించే ఉద్దేశంతో ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల పథకంలో లబ్ధిదారులు ఇండ్ల నిర్మాణ పనులను వేగవంతం చేసే విధంగా అధికారులు పర్యవేక్షించాలని ,త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. నిబంధనల ప్రకారం నిర్దేశిత విస్తీర్ణంలో ఇల్లు నిర్మించుకునేల లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని, మార్కవుట్ అయిన వివరాలు అధికారులను అడిగి తెలుసుకొని వంద శాతం మార్కవుట్ పనులు పూర్తి చేయాలని, బేస్ మెంట్, రూఫ్ , స్లాబ్ స్థాయిల వారీగా పూర్తి అయిన పనులకు సంబంధించి లబ్ధిదారుల ఖాతాలలో బిల్లులు జమ చేయడం జరుగుతుందని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలకు ప్రభుత్వం ఇసుకను ఉచితంగా అందిస్తుందని, ఈ అవకాశాన్ని వినియోగించుకుని లబ్ధిదారులు త్వరితగతిన ఇంటి నిర్మాణం పూర్తి చేసుకోవాలని తెలిపారు. ఇందిరమ్మ గృహ నిర్మాణాలు పరిశీలిస్తూ లబ్ధిదారులు ఇందిరమ్మ కమిటీ సభ్యులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా కలెక్టర్ లబ్ధిదారులు ఇంటి నిర్మాణాల్లో ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి, సంబంధిత అధికారులకు వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. ఇందిరమ్మ ఇండ్లు మంజూరు అయినప్పటికీ నిర్మాణం ప్రారంభించని లబ్ధిదారులను ప్రోత్సహించి, త్వరితగతిన ఇంటి నిర్మాణాలు పూర్తిచేయాలని సూచించారు. తదుపరి సరంపల్లి గ్రామంలో ఇందిరమ్మ గృహ లబ్ధిదారుడి ఇంటి నిర్మాణం భూమిపూజ లో పాల్గొన్నారు. కమిటీ సభ్యులతో సమావేశమై, ఇండ్ల నిర్మాణం వేగవంతంగా జరిగేలా చూడాలని ఆదేశించారు. ఇంకా అర్హత కలిగిన వారు దరఖాస్తు చేసిన పక్షంలో వారికి కూడా శాంక్షన్ మంజూరు చేస్తామని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనుల్లో ఫైనాన్షియల్ గా ఇబ్బందులు తలెత్తితే ఐకెపి ద్వారా మహిళా సంఘాల ద్వారా బ్యాంక్ రుణాలు ఇప్పించి లబ్ధిదారులకు సహయ సహకారాలు అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి మదన్మోహన్, పి.డి. హౌసింగ్ జైపాల్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ సి.హెచ్. రాజేందర్ రెడ్డి, డిప్యూటీ తహశీల్దార్, ఆర్.ఐలు, వార్డ్ ఆఫీసర్లు తదితరులు పాల్గొన్నారు.





# ఎకరానికి రూ.50వేల నష్టపరిహారం

- 20శాతం తేమ ఉన్నా ధాన్యం కొనాలి..
- బీసీ రిజర్వేషన్లపై బీజేపీ ద్వంద్వ వైఖరి
- రాష్ట్ర సమస్యల పరిష్కారంలో కేంద్రం వివక్ష
- నిరుద్యోగ జేఏసీకి సీపీఐ(ఎం) మద్దతు
- పార్టీ రాష్ట్ర కార్యదర్శి జాన్వెస్లీ

**ఖమ్మం, అక్టోబర్ 30 (జనం సాక్షి) :** సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్వెస్లీ వర్షాలతో దెబ్బతిన్న పంటలకు ఎకరానికి రూ.50 వేల చొప్పున పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. వెంటనే నష్టాలను అంచనా వేసి కేంద్రం, రాష్ట్రం పరిహారం ఇవ్వాలన్నారు. ఖమ్మం సుందరయ్య భవనంలో గురువారం విలేకరుల సమావేశంలో జాన్వెస్లీ మాట్లాడారు. పంటలు చేతికొచ్చే సమయంలో వర్షాలు పడ్డాయని, వేలాది ఎకరాలు నీటమునిగాయన్నారు. ఎకరానికి రూ.30 వేల నుంచి రూ.60 వేల వరకు నష్టపోయారని తెలిపారు. రోడ్లపై అరబెట్టిన ధాన్యం కొట్టుకుపోయిందన్నారు. వరద నీరు చేలల్లోకి చేరిందని, పంటలతోపాటు మేటలు వేసిన ఒండ్రు, చెత్తాచెదారం తొలగించేందుకు మరోసారి ఖర్చు పెట్టాల్సి వస్తుందన్నారు. అనేక చోట్ల ఆస్తి, ప్రాణనష్టాలు జరిగాయని పేర్కొన్నారు.

**ధాన్యం కొనుగోలుకు 20% తేమతోనే అనుమతి**

వర్షాల వల్ల ధాన్యంలో తేమశాతం పెరిగిందని, 20 శాతం తేమ ఉన్నా కొనుగోలు చేయాలని కోరారు. నాణ్యతతో సంబంధం లేకుండా సీసీఐ కొనుగోలు చేయాలన్నారు. ఎకరాకు 60 బస్తాలు రావాల్సిన వరి 30 బస్తాలే వచ్చిందని చెప్పారు. పత్తి తీత దశలో వర్షాలు రావడంతో నల్లగా మారిందని, మొక్కజొన్న రైతుల పరిస్థితి కూడా ఇదే అన్నారు. మరో వారంలో కోతకు వచ్చే వరి కూడా నేలవాలని ఆవేదన వ్యక్తం చేశారు.

**బీసీలకు 42% రిజర్వేషన్ అమలు చేయాలి**

సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్రంలోని బీజేపీ వైఖరి వల్లే ఇది ఆగుతోందని, పార్లమెంట్‌లో బిల్లు పెట్టాలన్నా రాజ్యాంగ సవరణ జరగాలన్నా కేంద్ర పరిధిలోనే ఉందన్నారు. బీజేపీ నాటకాలాడుతోందని, ద్వంద్వ వైఖరి అనుసరిస్తోందని మండిపడ్డారు. 9వ షెడ్యూల్‌లో చేర్చి అమలు చేయాలని కోరారు. సామాజిక న్యాయం కోసం పోరాడే శక్తులు కేంద్రంపై ఉద్యమించాలని పిలుపునిచ్చారు. రాష్ట్రం ఆర్డినెన్స్, సర్వేలు చేశామంటే కుదరదని, అఖిలపక్షాలతో కలిసి పోరాడాలని సూచించారు.

**ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉద్యోగాల భర్తీపై ఆందోళన**

ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లింపుల్లో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. రూ.8 వేల కోట్లుంటే రూ.1200 కోట్లు మాత్రమే చెల్లిస్తామని ఒప్పందం చేసుకుని చెల్లించలేదని, ప్రయివేటు కాలేజీలు సర్టిఫికెట్లు ఇవ్వటం లేదని చెప్పారు. నిరుద్యోగ జేఏసీ ఆందోళనలకు సీపీఐ(ఎం) మద్దతిస్తోందన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే 2 లక్షల పోస్టులు భర్తీ చేస్తామని హామీ ఇచ్చిన ప్రభుత్వం ఇప్పటి వరకు జాబ్ క్యాలెండర్ విడుదల చేయలేదని ఆరోపించారు. గత ప్రభుత్వ నోటిఫికేషన్లే భర్తీ చేస్తున్నారని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా పర్యటించి నష్టాలు సేకరిస్తున్నట్లు జాన్వెస్లీ పేర్కొన్నారు. వెంటనే రైతులను ఆదుకోకపోతే బాధితులతో కలిసి ఆందోళన లు చేస్తామని హెచ్చరించారు. మొంథా తుఫాను ప్రభావిత కారేపల్లి, కామేపల్లి, రఘునాథపాలెం మండలాల్లో ఆయన పర్యటించినట్లు జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వర రావు తెలిపారు. రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సుదర్శన్, ఎండీ అబ్బాస్, రాష్ట్ర కమిటీ సభ్యులు శ్రీరాంనాయక్, వై.విక్రమ్, బుర్రి ప్రసాద్, తెలంగాణ రైతుసంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మాదినేని రమేశ్, బొంతు రాంబాబు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు యర్రా శ్రీనివాస రావు, నవీన్ రెడ్డి, పిట్టల రవికుమార్ తదితరులు పాల్గొన్నారు. బనకచర్ల వాటా, బడ్జెట్ కేటాయింపులు, సంక్షేమ నిధులు, ఎస్సీ-ఎస్టీ సబ్‌ప్లాన్‌లో కేంద్ర బీజేపీ నిర్లక్ష్యం చేస్తోందని జాన్వెస్లీ ఆరోపించారు. లౌకికత్వం, రాజ్యాంగ హక్కులను కాలరాస్తోందని, అమెరికా సామ్రాజ్యవాదానికి మోదీ రంగిపోతున్నాడని మండిపడ్డారు. వామపక్షాలతో కలిసి ఆందోళనలు చేస్తామని ప్రకటించారు.

"ఎస్జీఎఫ్ జోనల్ స్థాయి క్రికెట్ పోటీలకు"

# ఎంపికైన అల్ఫోర్స్ ఇ-టెక్నో స్కూల్ విద్యార్థులు

**అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డా.వి.నరేందర్ రెడ్డి**

**కరీంనగర్, అక్టోబర్ 30 (జనంసాక్షి) :** క్రికెట్ విశ్వక్రీడని ప్రపంచవ్యాప్తంగా చాలా ప్రత్యేకత కలిగిన క్రీడగా గుర్తింపు పొందినదని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్ రెడ్డి స్థానిక కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ- టెక్నో పాఠశాలలో పాఠశాలకు చెందినటువంటి విద్యార్థులు ఎస్జీఎఫ్ జోనల్ స్థాయి పోటీలకు ఎంపికైన సందర్భంగా నిర్వహించినటువంటి ప్రత్యేక సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై వారు మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... విద్యార్థులకు క్రీడల పట్ల ఆసక్తిని పెంపొందించడానికి వార్షిక ప్రణాళికలో భాగంగా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తూ వివిధ కార్యక్రమాలలో అద్భుతం ప్రదర్శన కనబరిచిన వారిని వివిధ స్థాయిలలో నిర్వహింపబడేటువంటి పోటీలకు ప్రోత్సహించడమే కాకుండా అందులో విజయం సాధించడమే లక్ష్యంగా శిక్షణ ఇప్పిస్తున్నామని వారు చెప్పారు. ఈ క్రమంలో ఇటీవల కాలంలో కరీంనగర్ జిల్లా కేంద్రంలోని ఒక ప్రైవేట్ అకాడమీలో నిర్వహించినటువంటి జిల్లా స్థాయి ఎస్జీఎఫ్ జిల్లా స్థాయి క్రికెట్ ఎంపిక పోటీలలో అండర్ 17 విభాగంలో పాఠశాలకు చెందినటువంటి



ఎ.అశ్వత్రావు, కె. ఋషి రెడ్డి కె.ఆశ్రిత్ పటేల్ త్వరలో రాజన్న సిరిసిల్ల జిల్లాలో నిర్వహించబోయే జోనల్ సాయి పోటీలకు ప్రాతినిధ్యం ఇవ్వబోతున్నారని హర్షం వ్యక్తం చేస్తూ విజేతలు అందరికీ పుష్పగుచ్ఛాలను అందజేసి జోనల్ స్థాయి పోటీలలోను విశిష్ట ప్రతిభను కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమం లో పాఠశాల ప్రిన్సిపాల్, వ్యాయామ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.





# అర్బన్ బ్యాంకును సమూలంగా ప్రక్షాళన చేస్తాం

- మంచి మెజార్టీతో మా ప్యానల్ దే ఘనవిజయం.
- అర్బన్ బ్యాంకు ప్యానల్ అభ్యర్థులతో వెలిచాల ప్రెస్ మీట్

**కరీంనగర్ జిల్లా బ్యూరో, అక్టోబర్ 30 (జనంసాక్షి) :** వెలిచాల రాజేందర్ రావు నేతృత్వంలోని నిర్మల భరోసా ప్యానల్ అర్బన్ బ్యాంకు ఎన్నికలకు మేనిఫెస్టో విడుదల చేసింది. గురువారం సాయంత్రం మైత్రి హోటల్‌లో ప్రెస్ మీట్ నిర్వహించిన ప్యానల్ అభ్యర్థులు బ్యాంకును ఆధునీకరించి, తెలంగాణలోనే స్మార్ట్ బ్యాంకుగా తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు. గత పదేళ్లుగా బ్యాంకు అధ్వాన్న స్థితికి చేరుకుందని, పాలకవర్గాల సొంత లాభాలే కారణమని రాజేందర్ రావు మండిపడ్డారు. 8 ఏళ్లుగా ఎన్నికలు జరగకుండా కోర్టు కేసులతో అడ్డుకున్న వారే మళ్లీ అధికారం కోసం ఓట్లు అడుగుతున్నారని విమర్శించారు. అవినీతి ఆరోపణలు, ఇల్లీగల్ మెంబర్‌షిప్‌లు, రోల్డ్ గోల్డ్ పేరిట రుణాలు వంటి వివాదాలతో బ్యాంకు ప్రతిష్ట దెబ్బతిన్నదని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో 18 వేల మంది సభ్యులున్న బ్యాంకు నేడు 9 వేలకు పరిమితమైందని, పారదర్శకతకు పాతర వేశారని ఆందోళన చెందారు. తమ ప్యానల్‌కు ఒక అవకాశం ఇస్తే బ్యాంకును జాతీయ బ్యాంకులకు ధీటుగా మారుస్తామని హామీ ఇచ్చారు. ఏసీతో కూడిన సత్వర సేవలు, ఖాతాదారులకు రక్షణ, కరీంనగర్-జగిత్యాలలో అదనంగా ఒక్కొక్క బ్రాంచ్, హుస్నాబాద్, హుజూరాబాద్, జమ్మికుంట, చొప్పదండిలో కొత్త బ్రాంచ్‌లు ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. ప్రస్తుతం రూ.72 కోట్ల డిపాజిట్లను మూడేళ్లలో రూ.200 కోట్లకు, రూ.58 కోట్ల అడ్వాన్సులను రూ.150 కోట్లకు చేరుస్తామని లక్ష్యాలు పేర్కొన్నారు. మంచి సేవా భావంతో పనిచేసేందుకు ముందుకొచ్చిన నిర్మల భరోసా ప్యానల్‌ను గెలిపించాలని కోరారు. ప్రెస్ మీట్‌లో ప్యానల్ అభ్యర్థులు మూల వెంకట రవీందర్ రెడ్డి, ఇ లక్ష్మణ్ రాజు, అనురాసు కుమార్, వజీర్ అహ్మద్, ఉయ్యాల ఆనందం, చిందం శ్రీనివాస్, నార్ల శ్రీనివాస్, మన్నె అనంత రాజు, మునిఫల్లి ఫణిత, దామెర శ్రీలత రెడ్డి, కాంగ్రెస్ నాయకులు మల్లికార్జున రాజేందర్, ఆకుల నరసన్న, కొత్తపల్లి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పంజాల స్వామి గౌడ్, అనంతుల రమేష్, బట్టు వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

**అర్బన్ బ్యాంకు ఎన్నికల్లో నిర్మల భరోసా ప్యానల్‌కు మద్దతు..**

**ప్రజామిత్ర డెమొక్రటిక్ ఫ్రంట్ పిలుపు**

నవంబర్ 1న జరగనున్న అర్బన్ బ్యాంకు ఎన్నికల్లో వెలిచాల రాజేందర్ రావు నేతృత్వంలోని నిర్మల భరోసా ప్యానల్‌ను గెలిపించాలని ప్రజామిత్ర ప్రోగ్రెసివ్ డెమొక్రటిక్ ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షుడు కొరివి వేణుగోపాల్ పిలుపునిచ్చారు. గురువారం ప్రజామిత్ర కార్యాలయంలో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. గత కొన్నేళ్లుగా జిల్లా, రాష్ట్ర, జాతీయ సమస్యలపై స్పందిస్తూ ఇండియా కూటమి, కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇస్తున్నామని తెలిపారు. గత అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపుకు స్వచ్ఛందంగా పనిచేశామని, ఇప్పుడు అర్బన్ బ్యాంకు ఎన్నికల్లోనూ కరీంనగర్ పార్లమెంటు కాంగ్రెస్ ఇంచార్జ్ రాజేందర్ రావు ఏర్పాటు చేసిన నిర్మల భరోసా ప్యానల్‌ను కాంగ్రెస్ ప్యానల్‌గా భావించి 12 మంది అభ్యర్థులను గెలిపించాలని బ్యాంకు సభ్యులకు విజ్ఞప్తి చేశారు. మీడియా సమావేశంలో సిగిరి శ్రీధర్, బోయినపల్లి చంద్రయ్య, కొంపల్లి రవీందర్, సిరిసిల్ల రాజేందర్, చెలిమెల రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

# బంకుల నిర్వాహకులూ.. బహుపరాక్

- నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు
- కొండమల్లేపల్లి పెట్రోల్ బంకులపై ఎఎస్పి మౌనిక ఆకస్మిక తనిఖీలు

**కొండమల్లేపల్లి, అక్టోబర్ 30 (జనంసాక్షి):** కొండమల్లేపల్లి పరిదిలోని పెట్రోల్ బంకులపై దేవరకొండ ఎఎస్పి మౌనిక గురువారం ఆకస్మిక తనీఖీలు నిర్వహించారు. గత రెండు మూడు రోజుల క్రితం పెట్రోల్ బంకులపై అవకతవకలు జరుగుతున్నాయని ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఆదేశానుసారం మండల కేంద్రంతో పాటు పరిసర ప్రాంతాల పరిధిలో ఉన్న ఎనిమిది పెట్రోల్ బంకుల రికార్డులు, పెట్రోల్, డీజిల్ నాణ్యత, ఇంధన కొలతలు సరిగా ఉన్నాయా లేదా అని ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో భాగంగా రెండు పెట్రోల్ బంకుల నిర్వాహకులు ఎటువంటి అనుమతి పొందిన లైసెన్సులు అందుబాటులో ఉంచకుండా పనిచేయని అగ్నిమాపక యంత్రాలు ఉంచుకుని నిర్లక్ష్యంగా నిబంధనలకు విరుద్ధంగా పెట్రోల్ బంకుల కార్యకలాపాలు నిర్వహిస్తున్నందుకు తాత్కాలికంగా ఆ రెండు బంకులను పూర్తిగా నిలిపివేశారు. ఈ సందర్భంగా ఏఎస్పీ మౌనిక మాట్లాడుతూ పెట్రోల్ బంకు నిర్వాహకులు తూనికలు కొలతల అధికారులు సూచించిన విధంగా



ప్రతిరోజు ప్రామాణిక కార్యాచరణ విధానాలు పాటించాలని ఆదేశించారు. పెట్రోల్ బంకులకు సంబంధించిన లైసెన్సులు, అన్ని రకాల ధ్రువీకరణ పత్రాలు 24 గంటలు అందుబాటులో ఉంచాలని అన్నారు. ప్రతి పెట్రోల్ బంకులో అగ్నిమాపక యంత్రాలు పనిచేసే స్థితిలో అందుబాటులో ఉంచాలని, పెట్రోల్ బంకులలో పనిచేసే సిబ్బందికి అగ్నిమాపక యంత్రాలు ఉపయోగించడంలో శిక్షణ పొంది ఉండాలని ఆదేశించారు. కొన్ని బంకుల లో సీసీ కెమెరాలు పనిచేయకపోవడాన్ని గమనించి వెంటనే సిసి కెమెరాలు పనిచేయాలని సూచించారు. పెట్రోల్ బంకుల నిర్వాహకులు నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## సీసీఐ కేంద్రాలుగా 7 జిన్నింగ్ మిల్లులు

**కామారెడ్డి జిల్లా ప్రతినిధి అక్టోబర్ 30 (జనం సాక్షి) :** మద్నూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆధీనంలోని 7 జిన్నింగ్ మిల్లులను జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ సీసీఐ కొనుగోలు కేంద్రాలుగా నోటిఫై చేశారు. అకాల వర్షాల నేపథ్యంలో ముందుగానే ప్రారంభించాల్సిన ఈ కేంద్రాలు శుక్రవారం (అక్టోబర్ 31) నుంచి పనిచేస్తాయని జిల్లా మార్కెటింగ్ అధికారిణి పి. రమ్య తెలిపారు. సీసీఐ ఎల్-1 ప్రకారం స్లాట్ బుకింగ్ ద్వారానే కొనుగోలు జరుగుతుందని, ఒక మిల్లు కెపాసిటీ వరకు మాత్రమే కనిపిస్తుందని, అక్కడికి పత్తి తీసుకెళ్లాలని సూచించారు. పత్తి తేమశాతం 8-12 శాతం మించకూడదని, మించితే పింజ రకాన్ని బట్టి క్వింటల్‌కు రూ.50, తేమ శాతాన్ని బట్టి రూ.81-82 తగ్గుతుందని హెచ్చరించారు. రైతులు కల్లాల వద్దనే పత్తిని ఆరబెట్టుకుని తీసుకురావాలని, అధిక తేమతో వచ్చి ఇబ్బంది పడకూడదని కోరారు. పత్తి అమ్మకానికి వచ్చే రైతులు, ముఖ్యంగా కౌలు రైతులు ముందుగా వ్యవసాయ అధికారులను సంప్రదించి కిసాన్ యాప్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, తర్వాత కిసాన్ కపాస్ యాప్‌లో స్లాట్ బుకింగ్ చేసుకోవాలని తెలిపారు. యాప్‌లో పట్టా పాస్‌బుక్, ఆధార్ కార్డు, బ్యాంకు పాస్‌బుక్ జిరాక్స్‌లు జత చేయాలని సూచించారు. స్లాట్ బుకింగ్ తేదీని అనుసరించి మిల్లుకు వెళ్లాలని, అనివార్య కారణాల వల్ల రాలేకపోతే అదే రోజు క్యాన్సల్ చేసుకోవాలని చెప్పారు. ఈ సౌకర్యం మూడు పర్యాయాల వరకు ఉంటుందని, ముగిసిన తర్వాత స్లాట్ బుకింగ్ నిలిపివేయ బడుతుందని వివరించారు. తిరిగి బుకింగ్ చేయాలంటే వ్యవసాయ అధికారులను సంప్రదించాలని, పిదపనే సీసీఐకి అమ్ముకునే అవకాశం ఉంటుందని అధికారిణి రమ్య తెలిపారు.

## నష్టపోయిన రైతుకు అండగా ఉంటాం

**చొప్పదండి ,అక్టోబర్ 30( జనం సాక్షి ):** అకాల వర్షానికి పంట నష్టపోయిన ప్రతి రైతుకు అండగా నిలబడి ప్రభుత్వం నుండి పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం భరోసానిచ్చారు. చొప్పదండి మండలంలోని రుక్మాపూర్‌లో బుధవారం వర్షంకు నేలకొరిగిన వరి పంటను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన అధికారులతో మాట్లాడుతూ తుఫాన్ ద్వారా వచ్చిన అకాల వర్షానికి నష్టపోయిన పంటలను సమగ్ర పరిశీలన చేసి వివరాలు సేకరించి పంట నష్టాన్ని అంచనా వేసి నివేదిక అందించాలని సూచించా రు. అనంతరం చొప్పదండి మండలం రుక్మాపూర్ గ్రామంలో నిర్వహిస్తున్న జిన్నింగ్ మిల్లులో పత్తి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అకాల వర్షానికి నష్టపోయిన ప్రతి రైతుకు అండగా ఉంటామని కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చిన ధాన్యమును ఎలాంటి షరతులు లేకుండా కొనుగోలు చేపించే బాధ్యత నాదని రైతులు ఎలాంటి అధైర్య పడాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. తదనంతరం చొప్పదండి ఎమ్మెల్యే క్యాంపు కార్యా లయంలో కళ్యాణలక్ష్మీ/షాది ముభరక్ చెక్కుల పంపిణీ కార్యక్రమానికి హాజరై 26 మంది లబ్ధిదారులకు ఇరవై ఆరు లక్షల మూడు వేల పదహారు(2603016/-) రూపాయిల విలువ చెక్కులను స్థానిక నాయకులతో కలిసి పంపిణీ చేశారు. కార్యక్రమంలో తాసిల్దార్ నవీన్ కుమార్, ఏవో వంశీకృష్ణ, మార్కెట్ కమిటీ చైర్మన్ కొత్తూరు మహేష్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఇప్ప శ్రీనివాస్ రెడ్డి నాయకులు ముద్దం తిరుపతి పెరుమండ్ల గంగయ్య, తాళ్లపల్లి శ్రీనివాస్ గౌడ్ ,ముద్రసాని రంగన్న మునిగాల సుధాకర్, రాపల్లి ఐలయ్య ,మాఊరం రాములుపురం రాజేశం,



మునిగాల రాజేందర్, గుర్రం రమేష్ ,కర్రె శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# విజిలెన్స్ నిత్య జీవితంలో భాగంగా కావాలి

- ప్రతి అంశాన్ని మానవీయ కోణంలో చూడాలి..
- శతాబ్దాలుగా నీతి, నిజాయతీల ఆవశ్యకత భారతీయ ఆత్మలో మమేకమై ఉంది..
- సాంకేతికత వినియోగంతో పారదర్శకత, సులభతరం
- దోషులను పట్టుకోవడమే కాదు౦ తప్పులను ముందుగానే నివారించడమే నిజమైన విజిలెన్స్..
- సింగరేణి లో విజిలెన్స్ అవగాహన వారోత్సవాల్లో విజిలెన్స్ డీజీ శిఖా గోయల్

**గోదావరిఖని, అక్టోబర్ 30 (జనంసాక్షి) :** ప్రతీ వ్యక్తి కేవలం వృత్తి జీవితంలోనే కాకుండా నిత్య జీవితంలోనూ నీతి, నిజాయతీల అత్యున్నత ప్రమాణాలను పాటించినప్పుడే అన్ని వ్యవస్థలు సక్రమంగా పనిచేయడమే కాకుండా ప్రజలకు పారదర్శక సేవలు అందించడం సాధ్యమవుతుందని రాష్ట్ర విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్సుమెంట్ డైరెక్టర్ జనరల్, ఎక్స్ అఫీషియో ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీమతి శిఖా గోయల్ పేర్కొన్నారు. భారతీయ ఇతిహాసాలతోపాటు శతాబ్దాలుగా వస్తున్న వారసత్వ విలువల్లోనూ సత్య, ధర్మ మార్గంలో వెళ్లాల్సిన ఆవశ్యకతను ప్రబోధించిన విషయాన్ని ఆమె గుర్తుచేశారు. విజిలెన్స్ అవగాహన వారోత్సవాల సందర్భంగా హైదరాబాద్ సింగరేణి భవన్ లో



నిర్వహించిన కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రసంగించారు. విజిలెన్స్ వారోత్సవాలను కేవలం వారం రోజులకు పరిమితం చేయకుండా అన్ని రోజులు కూడా నిబద్ధతతో పనిచేయాలన్నారు. నీతి, నిజాయతీ, పారదర్శకత పాటిం చడం వల్ల కష్టాలు మాత్రమే మిగులుతాయని, పనులు పూర్తి కావన్న అపనమ్మకాన్ని దూరం చేసుకోవాలన్నారు. ప్రతీ ఒక్కరూ ప్రతీ అంశాన్ని మానవీయ కోణంతో చూడాలన్నారు. నిజాయతీతో పనిచేయడం ద్వారా ఢిల్లీ మెట్రో రైలును సకాలంలో, తక్కువ ఖర్చుతో పూర్తి చేయగలమని శ్రీధరన్ నిరూపించారని, సహకార రంగంలో పారదర్శకతను పాటించడం ద్వారా అమూల్ ద్వారా క్షీర విప్లవాన్ని సృష్టించిన కురియన్లు కూడా నైతిక విలువలకు గొప్ప నిదర్శనమని పేర్కొన్నారు. ఇలా ఎందరో వ్యక్తులు నిజాయతీతో సేవలు అందించి ప్రజల మన్ననలు అందుకున్నారని తెలిపారు. అదే సమయంలో నిజాయతీగా ఉంటూ పనులు చేయక పోవడం కూడా నేరమే అన్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుంటూ పౌరులకు పారదర్శక సేవలు అందించడం ద్వారా అవినీతిని కట్టడి చేయడానికి ఆస్కారం ఉంటుందన్నారు. విజిలెన్స్ అంటే ప్రతీ ఒక్కరినీ నేరస్థులుగా చూడటం, నేరస్థులను పట్టుకో వడం కాదని, నేరం జరగకుండా, ఎవరూ నేరం చేయడానికి సిద్ధపడకుండా పకడ్బందీ వ్యవస్థను ఏర్పాటు చేయడమే విజిలెన్స్ ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. నిజాయతీగా పనిచేసిన వారి గొప్ప తనం గురించి సమాజం ఎప్పుడూ గుర్తుంచుకుంటుందని, ఆత్మ సంతృప్తి కోసం అంతరాత్మను వంచించుకోకుండా పనిచేయాలని పిలుపునిచ్చారు. దేశానికి వెలుగులు పంచుతున్న సింగరేణి ఉద్యోగు లను ఉద్దేశించే అవకాశం కల్పించడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమానికి సీఎండీ ఎన్.బలరామ్ అధ్యక్షోపన్యాసం చేస్తూ.. సింగరేణి 136 ఏళ్ల ప్రస్థానంలో సాధించిన విజయాలను, సింగరేణి ఆధ్వర్యంలో రానున్న రోజుల్లో చేపడుతున్న విస్తరణ ప్రణాళికలను, సింగరేణిలో మహిళా సాధికారత కోసం చేపట్టిన చర్యలను వివరించారు. అనంతరం శిఖా గోయల్ను ఘనంగా సన్మానించారు. సంస్థ డైరెక్టర్లు ఎల్వీ సూర్యనారాయణ, కె వెంకటేశ్వర్లు, గౌతమ్ పొట్రు, తిరుమల రావు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కోల్ మూవ్ మెంట్ మరియు చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ బి వెంకన్న, జీఎం(కో ఆర్డినేషన్) టి.శ్రీనివాస్, అన్ని ఏరియాల జీఎంలు, కార్పోరేట్ జీఎంలు, వివిధ విభాగాల అధిపతులు, అధికారులు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
శుక్రవారం
31 అక్టోబర్ 2025

# రూ. 111 కోట్ల విలువైన భూమిని కాపాడిన హైడ్రా

- 1.28 ఎకరాల ప్రభుత్వ భూమితో పాటు పార్కుకు కబ్జాల నుంచి విముక్తి




**హైదరాబాద్, అక్టోబర్ 30 (జనంసాక్షి) :** రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్, బాలాపూర్ మండలాల్లో 976 గజాల పార్కుతో పాటు 1.28 ఎకరాల ప్రభుత్వ భూమిని హైడ్రా గురువారం కాపాడింది. వీటి విలువ రూ. 111 కోట్లకు పైగా ఉంటుందని అంచనా. మైలార్‌దేవుపల్లి విలేజ్‌లోని శాస్త్రీపురం కాలనీలో 976 గజాల పార్కు స్థలం చుట్టూ గతంలో మున్సిపల్ అధికారులు ఫెన్సింగ్ వేసింది. తప్పుడు డాక్యుమెంట్లతో కొంతమంది పార్కు స్థలాన్ని కబ్జా చేస్తున్నారని అక్కడి నివాసితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు హైడ్రా చర్యలు తీసుకుంది. 1996లో వేసిన హుడా లే ఔట్‌లో పార్కుస్థలం కబ్జా అయ్యిందని ఫిర్యాదు చేయగా.. వెంటనే స్పందించి ఆ స్థలాన్ని హైడ్రా కాపాడిందని స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. బాలాపూర్ మండలం జిల్లేలుగూడ విలేజ్‌లో సర్వే నంబరు 76లోని 1.28 ఎకరాల ప్రభుత్వ భూమిలో కూడా ఆక్రమణలను హైడ్రా గురువారం తొలగించింది. కొంతమంది ఫేక్ పట్టాలు సృష్టించి ప్లాట్లుగా విక్రయించడంతో పాటు.. ఆక్రమణలకు పాల్పడుతున్నారంటూ హైడ్రాకు ఫిర్యాదు అందగానే ఈ చర్యలు తీసుకుంది. పార్కుతో పాటు.. ప్రభుత్వ స్థలం చుట్టూ ఫెన్సింగ్ వేసి హైడ్రా బోర్డులను ఏర్పాటు చేసింది.

# ఎస్‌డీఆర్‌ఎఫ్, టీఆర్ నిధులు వాడుకోండి

- నిధుల సమస్య లేదు
- అప్రమత్తతతో ప్రమాదాన్ని నివారించగలిగాం
- వీడియో కాన్ఫరెన్స్‌లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు



**హైదరాబాద్ (జనంసాక్షి) :** తుఫాను నేపథ్యంలో సహాయ, పునరావాస చర్యల్లో భాగంగా జిల్లా కలెక్టర్లు ఎస్‌డీఆర్‌ఎఫ్ (స్టేట్ డిజాస్టర్ రిలీఫ్ ఫండ్), టీఆర్ (ట్రెజరీ) నిధులు వాడుకొని, తదుపరి 30 రోజుల్లో రాటిఫై చేసుకోవాలని, నిధులకు సంబంధించి ఎటువంటి ఇబ్బంది లేదని కలెక్టర్లను డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు ఆదేశించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, యావత్ క్యాబినెట్ 48 గంటలు ముందుగా అందరినీ అలర్ట్ చేయడం, ప్రభుత్వ యంత్రాంగం అందుకు అనుగుణంగా స్పందించడంతో ప్రాణ నష్టాన్ని, భారీ ఆస్తి నష్టం నుంచి రాష్ట్రాన్ని కాపాడుకోగలిగామని డిప్యూటీ సీఎం అన్నారు. రాబోయే 24 గంటలు కలెక్టర్లు ఇతర అధికారులు సైక్లోన్, మ్యాన్యువల్ దగ్గర పెట్టుకొని సహాయ, పునరావాస చర్యలు చేపట్టాలని డిప్యూటీ సీఎం వివరించారు. తుఫాను ప్రభావం దురదృష్టకరం, కృష్ణాజిల్లా నుంచి నల్లగొండ, ఖమ్మం జిల్లా మీదుగా వెళ్లడంతో ఉత్తర తెలంగాణలో ఇబ్బందికర పరిస్థితులు ఏర్పడ్డాయని డిప్యూటీ సీఎం తెలిపారు. అధికారులు అప్రమత్తమై పత్తి తడవకుండా టార్పాలిన్లు కప్పడం, గోదాముల్లోకి పత్తి పంటను షిఫ్ట్ చేయడంతో పత్తి పంటను కాపాడుకోగలిగం అన్నారు. తుఫాను నేపథ్యంలో ఉత్తర, దక్షిణ సీఎండీలు మొదలుకొని విద్యుత్ శాఖ యావత్తు తుఫాను సహాయ చర్యల్లో నిమగ్నమయ్యాయి అని డిప్యూటీ సీఎం తెలిపారు. భారీ తుఫాను వచ్చినప్పటికీ ఎక్కడ విద్యుత్ సమస్య తలెత్తకుండా మొబైల్ వ్యాన్లు పెట్టుకొని సిబ్బంది ఎప్పటికప్పుడు మరమ్మతులు చేసుకుంటూ ముందుకు వెళ్లారని డిప్యూటీ సీఎం వివరించారు. తుఫాను నేపథ్యంలో రెండు డిస్కొంట్ పరిధిలో 11. 33/11 కె.వి సబ్ స్టేషన్లు దెబ్బతినగా ఏడు సబ్ స్టేషన్ లను తిరిగి పునరుద్ధరించారు కొద్దిగంటల్లో మిగిలిన నాలుగు సబ్ స్టేషన్లను పునరుద్ధరిస్తారని వివరించారు. 101. 33 కెవి లైన్లు దెబ్బతినగా అందులో 96 లైన్లను ఇప్పటికే పునరుద్ధరించారు ఈరోజు మిగిలిన 5 లైన్లను పునరుద్ధరిస్తారని వివరించారు. 11 కెవి లైన్లు 237 డామేజ్ కాగా ఇప్పటికే 227 లైన్లను పునరుద్ధరించారని వివరించారు. %ఱ=%(డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్ఫార్మర్) లు 171 దెబ్బతినగా 49 ప్రాంతాల్లో పునరుద్ధరించారు మరో 122 ట్రాన్స్ఫార్మర్లను కొద్ది గంటల్లో పునరుద్ధరిస్తారని డిప్యూటీ సీఎం వివరించారు. 638 విద్యుత్ స్తంభాలు దెబ్బతినగా 304 విద్యుత్ స్తంభాలను పునరుద్ధరించారు మరో 334 కొద్ది గంటల్లో పునరుద్ధరిస్తారని డిప్యూటీ సీఎం తెలిపారు.



# ఐసీసీసీ భవనాన్ని పరిశీలించిన డీజీపీ

**హైదరాబాద్ (జనంసాక్షి) :** తెలంగాణ రాష్ట్ర నూతన డిజిపిగా బి.శివధర్ రెడ్డి ఉద్యోగ బాధ్యతలు స్వీకరించిన తరువాత మొదటిసారిగా నగరంలోని ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ (ఐసిసిసి)భవనాన్ని సందర్శించారు. భవనంలోని వివిధ అంతస్తులను , కార్యాలయాలను పరిశీలించారు. 4వ అంతస్తులో ఉన్న డాటా సెంటర్, ఇతర అధికారుల చాంబర్‌లు, 8వ అంతస్తులో గల స్టేట్ కాన్ఫరెన్స్ హాల్, 18వ అంతస్తులో ఉన్న హైదరాబాద్ పోలీసు కమిషనర్ కార్యాలయం, 19వ అంతస్తులో ఉన్న హెలిపాడ్ వంటివి పరిశీలించారు. ఈ పర్యటనలో డిజిపితో పాటు హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వి.సి. సజ్జనార్, డైరెక్టర్ ఐసిసిసి వి. బి. కమలాసన్ రెడ్డి, డిసిపి పుష్ప, కె. అపూర్వారావు డిసిపి, స్పెషల్ బ్రాంచ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్యారడైజ్ ఎలివేటెడ్ కారిడార్ పనులు

- 9 నెలల పాటు ట్రాఫిక్ మళ్లింపు



**హైదరాబాద్, అక్టోబర్30 (జనంసాక్షి) :** ప్యారడైజ్ జంక్షన్ నుంచి డెయిరీఫామ్ రోడ్ వరకు జాతీయ రహదారి 44 పై ఎలివేటెడ్ కారిడర్ నిర్మాణం పనులు ప్రారంభం సందర్భంగా ట్రాఫిక్‌ను మళ్లిస్తున్నామని జాయింట్ కమిషనర్ డి. జోయల్ డేవిస్ తెలిపారు. ఈనెల 30 నుంచి 9 నెలలపాటు ట్రాఫిక్ మళ్లింపులు అమలులో ఉంటాయన్నారు. రాజీవ్ గాంధీ విగ్రహం జంక్షన్ నుండి బాలంరాయ్ వరకు రహదారిని మూసివేస్తున్నా మన్నారు. బాలంరాయ్ నుంచి సీటీవో జంక్షన్‌కు వెళ్లే వారు ప్రత్యామ్నాయ మార్గాల్లో వెళ్లాలని సూచించారు. బాలనగర్ వైపు నుంచి పంజాగుట్ట ట్యాంక్ బండ్ వైపు వెళ్లేవారు తాడ్‌బంద్ మస్తాన్ కేఫ్, డైమండ్ పాయింట్ కుడివైపు మలుపు తిరిగి మడ్‌ఫోర్ట్, ఎన్‌సీసీ, జేబీఎస్, ఎస్‌బీఐ మార్గంలో వెళ్లాలని పేర్కొన్నారు. సుచిత్ర వైపు నుంచి పంజాగుట్ట, ట్యాంక్‌బండ్ వైపు వెళ్లే వారు సేఫ్ ఎక్స్‌ప్రెస్ ఎడమవైపు మలుపు తిరిగి బాపూజీనగర్, సెంటర్ పాయింట్, డైమండ్ పాయింట్, మడ్‌ఫోర్ట్, ఎన్‌సీసీ, జేబీఎస్, ఎస్‌బీఐ మార్గంలో వెళ్లాలని పేర్కొన్నారు. ట్యాంక్‌బండ్ రాణిగంజ్, పంజాగుట్ట, రసూల్‌పురా, ప్లాజా వైపు నుంచి సీటీఓ జంక్షన్ ద్వారా తాడ్‌బంద్ వైపు వెళ్లేవారు రాజీవ్‌గాంధీ విగ్రహం జంక్షన్ నుంచి అన్నానగర్, బాలంరాయ్, తాడ్‌బంద్ ద్వారా పంజాగుట్ట, ట్యాంక్ బండ్ వైపు వెళ్లేవారు మీటింగ్ పాయింట్ బైలేన్, హాకీ గ్రౌండ్ బైలేన్, లా అండ్ ఆర్డర్ పోలీస్ స్టేషన్ మార్గాలను ఉపయోగించాలని జాయింట్ సీపీ సూచించారు. ట్రాఫిక్ సమాచారం కోసం హైదరాబాద్ ట్రాఫిక్ పోలీస్ సోషల్ మీడియా ప్లాట్‌ఫారంలను చూడవచ్చని, ప్రయాణ సమయంలో అత్యవసర సహాయం కోసం ట్రాఫిక్ హెల్ప్‌లైన్ నంబర్ 9010203626కి కాల్ చేయవచ్చన్నారు.

# పిల్లల ప్రాణాలతో చెలగామొద్దు

- హైదరాబాద్ సీపీ వీసీ సజ్జన్నార్



**హైదరాబాద్,అక్టోబర్ 30 (జనంసాక్షి) :** ఒక చేతిలో గొడుగు, మరో చేతిలో హ్యాండిల్ పట్టుకొని ఓ ద్విచక్ర వాహనదారుడు ప్రమాదకర రీతిలో పిల్లలను స్కూలుకు తీసుకెళ్లిన ఘటనపై హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ స్పందించారు. గుడి మల్కాపూర్‌లో ఓ వ్యక్తి చిన్నారులను బైక్‌పై ప్రమాదకరంగా తీసుకెళ్తుండటంపై 'ప్రమాదమని తెలిసీ ప్రాణాలతో చెలగాటం ఆడడటంపై ఆయన 'ఎక్స్'లో షేర్ చేశారు. ఇలా బైక్‌పై వెళ్తుండగా ప్రమాదవశాత్తు పట్టు తప్పితే బాధ్యలెవరని ప్రశ్నించారు. వర్షంలోనూ పిల్లల చదువుపై ఉన్న శ్రద్ధ.. ట్రాఫిక్ రూల్స్ నేర్పించడంలో ఎందుకు ఉండడం లేదన్నారు. ఇలా ప్రమాదకర ప్రయాణం చేస్తూ చిన్నారుల ప్రాణాలతో చలగాట మాడొద్దని సూచించారు. ప్రజలంతా ఆలోచించాలని, ట్రాఫిక్ రూల్స్ విషయంలో నిర్లక్ష్యంగా ఉండొద్దని ఈ సందర్భంగా సజ్జనార్ విజ్ఞప్తి చేశారు.

# మరో 2వేలు తగ్గిన పసిడి ధరలు

**హైదరాబాద్, అక్టోబర్30 (జనంసాక్షి) :** బంగారం ధరలు తగ్గుముఖం పడుతున్నాయి. దీపావళి సమయంలో రికార్డు స్థాయికి చేరిన పసిడి ధర, ప్రస్తుతం తగ్గుముఖం పడుతోంది. అంతర్జాతీయంగా చోటుచేసుకుంటున్న పరిణామాలు, పసిడి పెట్టుబడుల్లో లాభాల స్వీకరణ వంటి కారణాల వల్ల పసిడితో పాటు వెండి ధరలు కూడా తగ్గుతున్నాయి. గత రెండు వారాల్లో పసిడి భారీగా తగ్గింది. ఈ క్రమంలో బంగారం ధర గురువారం కూడా భారీగా పడిపోయింది. దాదాపు రూ.2 వేలు తగ్గింది. అంతర్జాతీయంగా బంగారం ఔన్స్ ధర తగ్గడంతో దేశీయంగా బంగారం ధరలు పతనమవుతున్నాయి.

# మున్నేరు వాగు ఉధృతితో మరోమారు ఆందోళన

- ఖమ్మం-బొమ్మకల్ రహదారిపై భారీగా వరద



**ఖమ్మం, అక్టోబర్30 (జనంసాక్షి) :** మొంథా తుపాను ప్రభావంతో కురిసిన భారీవర్షాలకు ఖమ్మంలోని 'మున్నేరు' వారు మరోమారు ఉధృతంగా సాగుతోంది. అంతకంతకూ నీటిమట్టం పెరగడంతో మరోమారు భయాందోళనలు మొదలయ్యాయి. వాగు పరివాహకంలోని కాలనీలను వరద చుట్టుముట్టింది. మోతీనగర్, బొక్కలగడ్డ కాలనీల్లోకి వరద చేరింది. మోతీనగర్‌లోని 35, బొక్కలగడ్డలో 57 కుటుంబాలను పునరావాస కేంద్రాలకు తరలించారు. మున్నేరుకు భారీగా వరద ప్రవాహం కొనసాగుతోంది. ప్రస్తుతం నీటిమట్టం 24.7 అడుగులకు చేరింది. ఎగువన భారీ వర్షాలతో వరద ప్రవాహం అంతకంతకూ పెరుగుతోంది. మున్నేరు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో వరద నీరు ఖమ్మం-బోనకల్ ప్రధాన రహదారిపై చేరింది. ఖమ్మం నగరం సమీపంలోని దంసలాపురం వద్ద ఆర్‌అండ్‌బీ రహదారిపై మూడు అడుగుల మేర వచ్చింది. దీంతో పోలీసులు ఆ మార్గంలో రాకపోకలను నిలిపివేశారు. వాహనాలు వెళ్లకుండా బారికేడ్లు ఏర్పాటు చేశారు. చింతకాని మండలం రామకృష్ణాపురం సమీపంలో లో లెవెల్ వంతెనపై వరద ప్రవహిస్తోంది. పాలేరు జలాశయానికి భారీగా వరద ప్రవాహం వచ్చి చేరుతోంది. ఖమ్మంలోని రాపర్తి నగర్ బీసీ కాలనీ వద్ద డంపింగ్ యార్డుకు వెళ్లే రహదారి కొట్టుకుపోయింది. టీఎన్జీవోస్ కాలనీని నలువైపులా వరద నీరు ముంచెత్తడంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మున్నేరు పరివాహక ప్రాంతంలోని ఏదులాపురం పరిధిలో కేబీఆర్ నగర్, ప్రియదర్శిని కళాశాల ప్రాంతంలో ఉన్న ఇళ్ల చుట్టూ వరద నీరు చేరింది.

# కరూర్ ఘటన తరవాత మళ్లీ ప్రజల్లోకి విజయ్

- పార్టీ వ్యవహారాల్లో చురుకుగా పాల్గొంటున్న నేత

**చెన్నై, అక్టోబర్30 (జనంసాక్షి) :** కరూర్ రోడ్‌షోలో 41 మంది దుర్మరణం సంఘటన తర్వాత పార్టీ వ్యవహారాలకు దూరంగా ఉన్న తమిళగ వెట్రి కళగం నేత విజయ్ మళ్ళీ పార్టీ వ్యవహారాల్లో చురుకుగా పాల్గొంటున్నారు. ఇటీవల కరూర్ మృతుల కుటుంబ సభ్యులను మహాబలిపురం రిసార్ట్‌కు రప్పించి వారికి క్షమాపణ చెప్పి, గాయపడిన వారికి తలా రూ.2లక్షలు ఇచ్చిన సంగతి తెలిసిందే. ఈ సంఘటన తర్వాతే ఆయన ధాన్యం కొనుగోలు వ్యవహారంపై డీఎంకే ప్రభుత్వంపై విమర్శలు చేస్తూ సుదీర్ఘ ప్రకటన చేశారు. బుధవారం సాయంత్రం పార్టీ సీనియర్ నేతలతో సమావేశమై 28 మంది సభ్యులతో కొత్త కమిటీని కూడా ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో మళ్ళీ పార్టీ వ్యవహారాలను చురుకుగా సాగించాలని ఆయన నిర్ణయించారు. ఆ మేరకు పార్టీ ప్రధాన కార్యదర్శి బుస్సీ ఆనంద్ అధ్యక్షతన పనయూరు లోని పార్టీ కార్యాలయంలో కొత్త కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశం అనంతరం పార్టీ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి నిర్మల్‌కుమార్ మీడియాతో మాట్లాడుతూ పార్టీ నిర్వాహక కమిటీ తొలిసమావేశం సాఫీగా సాగిందని, మళ్ళీ పార్టీ వ్యవహారాలను చురుకుగా కొనసాగించాలని పార్టీ నాయకులంతా సూచించినట్లు తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహంపై సమావేశం లో చర్చించినట్లు చెప్పారు. కరూర్ దుర్ఘటన పార్టీ వ్యవహారాలను పూర్తిగా స్తంభిం పజేసిందని, ఆ శోకం నుండి పూర్తిగా బయటపడి పార్టీ నాయ కుడు విజయ్ మళ్ళీ చురుకుగా పార్టీపై దృష్టి సారి స్తున్నారన్నారు. అన్నాడీఎంకేతో పొత్తు పెట్టుకుం టారా? అని విలేఖరుల ప్రశ్నించగా, నెల రోజులకు ముందు పార్టీ ఏ స్థితిలో ఉండేదో ఆ స్థితిలోనే పార్టీ వ్యవహారాలు కొనసాగుతాయని తెలిపారు. ఆ

# మొంథా తుఫాన్‌తో భారీగా నష్టం

- చెరువులుగా మారిన ఊరూవాడలు
- భారీగా పంట నష్టం వాటిల్లినట్లు అంచనా



**సిద్దిపేట, అక్టోబర్30 (జనంసాక్షి) :** మొంథా తుఫాన్ కారణంగా భారీ వర్షాలు కురిస్తున్నాయి. హుజురాబాద్, శంకరపట్నం, సైదాపూర్ మండలాల్లో వందలాది ఎకరాల్లో వరి పంట నీట మునిగిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కేశవపట్నం వాగు ఉప్పొంగడంతో ఐకేపీ కేంద్రం గోడ కూలి నిల్వ ఉంచిన వరి ధాన్యం కొట్టుకుపోయినట్లు రైతులు తెలిపారు. వాగు ఉప్పొంగడంతో.. సైదాపూర్‌కు రాకపోకలు నిలిచిపోయాయి. హుజురాబాద్‌లో కూడా చిలుకవాగు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో.. జూపాక రోడ్డు తెగి పోయింది. భారీ వర్షం కారణంగా రోడ్డుపై ఆరబెట్టిన వడ్లు కూడా కొట్టుకుపోయినట్లు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మొంథా తుఫాన్ కారణంగా.. తెలంగాణలోని పలు జిల్లాల్లో కురిసిన భారీ వర్షం బీభత్సం సృష్టించిన విషయం తెలిసిందే. హనుమకొండ, వరంగల్, మహబూబాబాద్, జనగాం, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి జిల్లాల్లో అత్యంత భారీ వర్షాలు కురిశాయి. వర్షాల కారణంగా భారీగా పంట నష్టం వాటిల్లింది. కుండపోత వర్షాలకు వరంగల్ - ఖమ్మం ప్రధాన రహదారిపై భారీగా వరదనీరు చేరింది. దీంతో ఆ రూట్‌ని పోలీసులు తాత్కాలికంగా మూసివేశారు. తుఫాన్ ప్రభావంతో వరంగల్, హనుమకొండ తడిసి ముద్దయింది. అలాగే.. సిద్దిపేట జిల్లా చేర్యాల, కొమురవెల్లి, మద్దూర్, దూల్మిట్ట మండలల్లో వరి పంటకు అపార నష్టం వాటిల్లింది. చేర్యాల మండలంలో.. భారీగా వరద నీరు చేరడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మరోవైపు ముస్త్యాల వద్ద రాగికుంట పొంగిపొర్లడంతో చేర్యాల - హుస్నాబాద్‌కు రాకపోకలు నిలిచిపోయాయి. వర్షం కారణంగా.. భారీగా ధాన్యం తడిసినట్లు రైతులు తెలిపారు. తడిసిన ధాన్యాన్ని కూడా ప్రభుత్వం కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. మద్దూర్‌లో 22 సెం.మీ, దూల్మిట్ట 19 సెం.మీ, చేర్యాల 17సెం.మీ, కొమురవెల్లి 12సెం.మీల వర్షపాతం నమోదు అయినట్లు అధికారులు వెల్లడించారు. ఈ మేరకు జిల్లాల్లో ఆకస్మిక వరదలు వచ్చే ప్రమాదం ఉందని, ప్రజలు బయటకు రావొద్దని అధికారులు హెచ్చరిస్తున్నారు. అయితే చాలా జిల్లాల్లో వరి ధాన్యం, మొక్క జొన్న పంటలు, చేతి కొచ్చిన పత్తి పంట తడిసి పోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.

# పిల్లలు చిత్రసీమలోకి వస్తారనుకోలేదు

- తుక్కమ్ ప్రారంభోత్సవంలో మోహన్ లాల్



**కొచ్చి, అక్టోబర్ 30 (జనంసాక్షి) :** తన పిల్లలు సినిమాల్లోకి వస్తారని తానెప్పుడూ అనుకోలేదని ప్రముఖ నటుడు,దాదాసాహెబ్ ఫాల్కె అవార్డు గ్రహీత మోహన్‌లాల్ అన్నారు. కెరీర్ విషయంలో వారికి స్వేచ్ఛ ఇచ్చానని తెలిపారు. 'తుడక్కమ్' ప్రారంభోత్సవ వేడుకలో మాట్లాడారు. తానూ ఊహించని రీతిలోనే ఇండస్ట్రీలోకి వచ్చానంటూ నాటి జ్ఞాపకాలు గుర్తుచేసుకున్నారు. తన కూతురు విస్మయ నటిస్తున్న తొలి సినిమానే 'తుడక్కమ్'. '2018' మూవీ ఫేమ్ జూడ్ ఆంథోనీ జోసెఫ్ దర్శకత్వంలో తెరకెక్కుతోంది. వేడుకనుద్దేశించి మోహన్‌లాల్ మాట్లాడుతూ.. 'సినిమాల్లో నటించాలని నేను కోరుకోలేదు. నేను నటుడిని కావడం విధి. గత 48 ఏళ్లుగా ప్రేక్షకులు నన్ను ఆదరిస్తున్నారు. వారి వల్లే నేనీ స్థాయిలో ఉన్నా. నా పిల్లల విషయానికొస్తే వారికంటూ కొన్ని లక్ష్యాలున్నాయి. వారి అభిప్రాయాలను గౌరవించేవాడిని. సినిమాల్లో నటించడం అనుకున్నంత సులువు కాదు. కానీ, విస్మయ నటిని కావాలని నిశ్చయించుకోవడంతో ఆమెకు కావాల్సిన సపోర్ట్ ఇచ్చాం. మంచి కథతో సినిమా రంగంలోకి వస్తోంది' అని పేర్కొన్నారు. తమ కుటుంబానికి ఈ ఏడాది ఎంతో ప్రత్యేకమని మోహన్‌లాల్ సతీమణి సుచిత్ర అభిప్రాయపడ్డారు. మోహన్‌లాల్ దాదా సాహెబ్ ఫాల్కే అవార్డు అందుకోవడం, తనయుడు ప్రణవ్ కొత్త సినిమా విడుదల కాబోతుండటం (ఈ నెల 31న రిలీజ్ కానున్న డియాస్ ఇరాయ్), తనయ నటిగా ప్రయాణం మొదలుపెట్టడంపై ఆమె ఆనందం వ్యక్తం చేశారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at #119&120, 1st Floor, Down Town Mall, Lakdikapul, Hyderabad, Telangana-500004. Editor : M.M.RAHMAN RNINo. APTEL/2013/50370